గురువారం
07-11-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 46
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

ఇజ్రాయిల్ రక్షణ మంత్రిపై వేటు

జెరూసలేం: ఇజ్రాయిల్ రక్షణ మంత్రి యోవావ్ గ్యాలెంట్‌పై వేటు పడింది. ఆయన్ను తొలగిస్తూ ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యహూ ఆదేశాలు జారీ చేశారు. రక్షణ శాఖ బాధ్యతలను విదేశాంగ మంత్రి కట్జ్‌కు అప్పగించారు. విదేశాంగ శాఖ బాధ్యతలను గిడియాన్ సార్‌కు అందజేయనున్నారు. హమాస్, హెజ్బొల్లాపై పోరు క్రమంలో గ్యాలెంట్‌తో విభేదాలు వచ్చినట్లు నెతనహ్యూ పేర్కొన్నారు. యుద్ధమప్పుడు ప్రభుత్వాన్ని నమ్మాలి.. కానీ గ్యాలెంట్‌కు నాకు మధ్య అనమ్మకం వచ్చిందన్నారు. పరిస్థితిని చక్కబెట్టే ప్రయత్నాలు పనిచేయలేదని, మనస్పర్థల గురించి శత్రువులకూ తెలిసిందని అన్నారు. గ్యాలెంట్‌ను తొలగించడం ఇది రెండోసారి. మార్చి 2023లో కూడా ఓ సారి ఆయనపై వేటు వేశారు.

యూపీ సర్కారుపై సుప్రీం ఆగ్రహం

రూ.25 లక్షలు చెల్లించాలని ఆదేశం

న్యూఢిల్లీ: ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం రోడ్డు విస్తరణ పేరుతో అక్రమంగా ఇంటిని కూల్చివేయడాన్ని సుప్రీం కోర్టు బుధవారం తప్పుపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం మితిమీరి వ్యవహరించిందని, న్యాయ పరిధి దాటి వ్యవహరించిందని ఆగ్రహం వెలిబుచ్చింది. బాధిత కుటుంబా నికి శిక్షార్హమైన పరిహారంగా రూ.25 లక్షలు చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని న్యాయమూర్తులు జస్టిస్ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం... విధి విధానాలను

- మిగతా 2 లో

మహారాష్ట్ర, జార్ఖండ్‌లో రూ.558 కోట్లు స్వాధీనం

న్యూఢిల్లీ: మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీలతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో ఉప ఎన్నికలు జరగనున్న వేళ ఎన్నికల సంఘం (ఈసీ) తనిఖీలు ముమ్మరం చేసింది. రూ.558 కోట్లు విలువ చేసే మద్యం, మాదక ద్రవ్యాలు, విలువైన లోహాలతో పాటు నగదును స్వాధీనం చేసుకుంది. మహారాష్ట్రలో లభ్యమైనవాటి విలువ మొత్తం రూ.280 కోట్లు, కాగా జార్ఖండ్‌లో రూ.158 కోట్ల విలువ చేసే డబ్బు, మద్యం, డ్రగ్స పట్టుకున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తంగా స్వాధీనం చేసుకున్న వాటిలో

- మిగతా 2 లో

మిథున్ చక్రవర్తిపై ఎఫ్ఐఆర్

కోల్‌కతా: బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తిపై కోల్‌కతాలో నమోదైంది. బెంగాల్‌లోని నార్త్ 24 పరగణా లలో బీజేపీ నిర్వహించిన కార్యక్ర మంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారన్న ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. అక్టోబర్ 27న సాల్ట్ లేక్ ఏరియాలోని ఈస్టర్న్ జోనల్ కల్చరల్ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా పాల్గొన్నారు. మిథున్ చక్రవర్తి మాట్లాడుతూ, 2026లో బెంగాల్ పీఠం బీజేపీ వశం కానుందని, లక్ష్యసాధనకు ఏం చేయడానికైనా సిద్ధమన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలను ఓటు వేయకుండా ఎవరూ భయపెట్టలేరని అన్నారు.

ఇదీ లోకం!

మీరు చెప్పినవి అన్నీ బాగానే ఉన్నాయి సార్, కానీ ఆడటానికి మాకు గ్రౌండ్లు లేవు!

మళ్లీ ట్రంప్ వచ్చాడు

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం

- 20 ఏళ్లలో పాపులర్ ఓటు గెలుచుకున్న రిపబ్లికన్‌గా రికార్డు
- ట్రంప్‌కు 280 - హారిస్‌కు 224 ఓట్లు
- ప్రపంచ దేశాధినేతల అభినందనలు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించారు. ప్రత్యర్థి, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌ను ఓడించి అమెరికాకు 47వ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. క్రిమినల్ కేసుల్లో శిక్షలు పడటం, రెండుసార్లు అభిశంసన, హత్యాయత్నాలను ఎదుర్కొన్న ఆయన తిరిగి శ్వేతసౌధంలో అడుగు పెట్టబోతున్నారు. ట్రంప్ విజయంపై ప్రపంచదేశాధినేతలు హర్షం ప్రకటించారు. ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ట్రంప్, హారిస్ మధ్య రసవత్తర పోరు సాగింది. గెలుపు స్వల్ప ఆధిక్యతతో నమోదవుతుందని అంచనాలు వెలువడినా... ట్రంప్ మాత్రం భారీ మెజారిటీతోనే గెలుపొందారు. కీలక యుద్ధ క్షేత్రంగా భావించే స్వింగ్ స్టేట్స్‌లోని విస్కాన్సిన్‌తో పాటు జార్జియా, నార్త్ కరోలీనా, పెన్సిల్వేనియాలోనూ ఆయన గెలుపొందారు. రెండవసారి అధ్యక్ష పీఠాన్ని అధిష్టించనున్నారు. డెమొక్రటిక్ పార్టీ నాలుగేళ్ల పాలనపై అమెరికన్లలో

- మిగతా 2 లో

అసాధ్యాన్ని సుసాధ్యం చేశాం

యుద్ధాలు ఆపేస్తా... ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుంటా

విజయోత్సవ సభలో ట్రంప్

వాషింగ్టన్: అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపాం అంటూ విజయోత్సవ సభలో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందిన రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్ ఉద్ఘాటించారు. ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుంటానని, అలా చేయకుండా తనను ఎవ్వరూ ఆపలేరని చెప్పారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత యుద్ధాలు ఆపేస్తానన్నారు. 'మనపై చేసిన విమర్శలన్నీ తప్పని రుజువు చేశాం. అమెరికాకు ఇది స్వర్ణయుగం కాబోతోంది' అని విజయోత్సవ సభలో తన మద్దతుదారులను ఉద్దేశించి అన్నారు. అమెరికాను గొప్పగా తీర్చిదిద్దేందుకు ప్రతి శక్తిని ఏకతాటిపైకి తెస్తానని సంకల్పించారు. యుద్ధాలకు నాంది పలకబోను... జరిగే యుద్ధాలను ఆపేస్తాను అని ఆయన నొక్కిచెప్పారు. చారిత్రక విజయాన్ని రిపబ్లికన్ పార్టీ అందుకున్నదని తెలిపారు. తన గెలుపునకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అమెరికాను తిరిగి గొప్ప దేశంగా నిలుపుతానని, అమెరికా ఫస్ట్

నినాదానికి కట్టుబడతానని చెప్పారు. అమెరికా రాజకీయ చరిత్రలో మరువలేని విజయాన్ని అందుకున్నాం... ఈ మార్పు అమెరికాను తిరుగులేని శక్తిగా నిలబెట్టేందుకు దోహదమవుతుందని ట్రంప్ అన్నారు. ఎన్నికల పోరులో రిపబ్లికన్లు గొప్పగా పనిచేస్తారని కొనియాడారు. ప్రచారాన్ని ఓ ఉద్యమంగా చేపట్టారని ప్రశంసించారు. ఇకపై అమెరికా ప్రజలు, కుటుంబాల కోసం రిపబ్లికన్లు పోరాటం చేస్తానని తెలిపారు. ఈ విజయం కోసం కష్టపడిన పార్టీలోని ప్రతి ఒక్కరికి తగిన ప్రతిఫలం ఉంటుందని ట్రంప్ చెప్పారు. భవిష్యత్‌లో సరిహద్దుల సమస్యను పరిష్కరిస్తానన్నారు. అక్రమంగా అమెరికాలో అడుగుపెట్టే పరిస్థితులు ఉండబోవని, ఇతర దేశాల వారు చట్టబద్ధంగానే అమెరికాలోకి

- మిగతా 2 లో

సామాజిక బాధ్యతతో పనిచేయాలి

- హైడ్రాతో ఆందోళన వద్దు
- గౌరవ జీవితానికే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం
- స్వయం సహాయక సంఘాలకు 20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు
- బ్యాంకర్ల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి

విశాలాంధ్ర–హైదరాబాద్: హైడ్రా... భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వదని, బ్యాంకర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజాభవన్‌లో బుధవారం బ్యాంకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. భట్టి మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్ విభాగాలు నిర్మాణాలకు అనుమతులు ఇస్తాయని, ఏ ప్రభుత్వమైనా వీటిని కొనసాగిస్తాయని వివరించారు. హైడ్రా సెక్యూరిటీ, ట్రాఫిక్ నియంత్రణ, అక్రమార్కులు పార్కులు, సరస్సులు ఆక్రమించుకోకుండా చూస్తుందని తెలిపారు. కొన్ని ప్రభుత్వ శాఖలకు బ్యాంకింగ్ ద్వారా చేయూత అందించాలన్నదే ప్రధాన ఉద్దేశమన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా... మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కేవలం ఊరికే తిరగడానికి అని కొంతమంది అనుకుంటారు... అది వాస్తవం కాదని ... అది మహిళలు గౌరవం మర్యాదలతో జీవించేందుకు

- మిగతా 2 లో

నాణ్యమైన విద్యే లక్ష్యం

- సామాజిక న్యాయం కోసం కులగణన
- దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలి
- ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ: రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్రంలో నాణ్యమైన విద్య అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అందరికి విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. వసతిగృహ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచిన నేపథ్యంలో బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం 21వేల మంది ఉపాధ్యాయు లకు పదోన్నతులు కల్పించడంతో పాటు 11,062 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామన్నారు. సామాజిక న్యాయం అందించేందుకు ప్రభుత్వం కుల గణన సర్వే నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని, వచ్చే అకడమిక్ ఇయర్ లోగా నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. చదువుతో పాటు స్కిల్ ఉంటేనే ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. దేశ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. టాటా ఇనిస్టిట్యూట్ సహకారంతో ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తున్నామని వివరించారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గంజాయి, డ్రగ్స్ ఎక్కడ కనిపించినా 100కు డయల్ చేసి సమాచారం అందించాలని అన్నారు. ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతను అలవరచుకోవాలని సూచించారు. ఈ నెల 14న ఫేజ్-2 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ మంజూరు చేయబోతున్నట్లు ప్రకటించారు. సీఎంను కలిసిన వారిలో ఖమ్మం జిల్లా వైరా, మధిర నియోజకవర్గాల నుంచి వసతిగృహ విద్యార్థులు ఉన్నారు. వారి వెంట మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు బలరాం నాయక్, రామసాయం రఘురాం రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఉన్నారు.

రాష్ట్రాన్ని దోచేది ఆ ముగ్గురే...

- బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలన్న సంస్థకు కాంట్రాక్ట్ ఎలా ఇచ్చారు?
- ఈడీలు కేవలం బీఆర్ఎస్‌పైనే పనిచేస్తాయా
- అధికార పార్టీపై కేటీఆర్ ధ్వజం

విశాలాంధ్ర - హైదరాబాద్: ప్రతిపక్షంలో ఉండగా, ఏ కంపెనీని ఆంధ్రా... ఈస్ట్ ఇండియా... అరాచక కంపెనీ అన్నారో... అధికారంలో ఉండి కూడా ఇప్పుడు ఆ కంపెనీపై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వాన్ని నిలదీశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అప్పట్లో

- మిగతా 2 లో

ప్రజాపోరాటాలకు వైకల్యం అడ్డుకాదు

సాయిబాబా సంస్మరణ సభలో 'చాడ'

విశాలాంధ్ర - హుస్నాబాద్: ప్రజలను చైతన్య పరుస్తూ, ప్రజా పోరాటాలు నిర్వహించేందుకు మాజీ ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబాకు వైకల్యం అడ్డు రాలేదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో బుధవారం సాయిబాబా సంస్మరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంకటరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ఉద్యమాలను అణగదొక్కాలని ప్రయత్నిస్తుందని ఆగ్రహం వ్యక్తం

- మిగతా 2 లో

సుప్రీం తీర్పు పున:పరిశీలన అవసరం

ప్రైవేట్ ఆస్తులపై రాజా



న్యూఢిల్లీ: ప్రైవేటు ఆస్తులకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం తాజాగా వెలువరించిన తీర్పును పున:పరిశీలించడం అవసరమని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. సహజ వనరులను ఇప్పటికే దోచుకుంటున్న దోపిడీదారుల మనోధైర్యాన్ని పెంచేదిగా, వనరుల ప్రైవేటీకరణకు ద్వారాలు తెరిచేదిగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందన్నారు. ఉమ్మడి ప్రయోజనాల కోసం ప్రైవేట్ ఆస్తులన్నింటినీ ప్రభుత్వాలు స్వాధీనం చేసుకోవడానికి వీల్లేదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రాజా స్పందిస్తూ ఇది రాజ్యాంగ నిర్మాతల మార్గదర్శకత్వానికి పూర్తి వ్యతిరేకమన్నారు. అడవులు, తడిభూములు, ఇతర సహజ వనరులను కార్పొరేట్లు దోచుకుంటున్న వేళ... ఇలాంటి తీర్పు వెలువడటంతో దోపిడీదారుల మనోధైర్యం పెరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. 'అన్ని ప్రైవేటు ఆస్తులు 'మెటీరియల్ రిసోర్స్ ఆఫ్ కమ్యూనిటీ' కాదని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. అయితే రాజ్యాంగంలోని అధికరణ 39(బి) ప్రకారం ఏ రాష్ట్రం సమానంగా ఆస్తులు పంచాలన్నది ఆందోళన కలిగించే అంశం. ముఖ్యంగా అసమానతలు, పర్యావరణ సంక్షోభం వేళ ఈ పరిస్థితులు ఆందోళనకరం' అని ఎక్స్‌లో రాజా పేర్కొన్నారు. సమాజంపై,

- మిగతా 2 లో

ఏపీ డీఎస్సీ వాయిదా...

నిరుద్యోగుల్లో నిరాశ

- సాంకేతిక సమస్యలే కారణం 2లో
- నోటిఫికేషన్ విడుదలపై విద్యాశాఖ కసరత్తు
- ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణకు వారం రోజులు

AP DSC

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించే మెగా డీఎస్సీ-2024 నోటిఫికేషన్ వాయిదా పడింది. షెడ్యూలు ప్రకారం బుధవారమే నోటిఫికేషన్ విడుదలకు పాఠశాల విద్యాశాఖ సన్నద్ధమవ్వగా... సాంకేతిక కారణాల రీత్యా దానిని వాయిదా వేశారు.

నాన్సీ పెలోసీ వరుసగా 20వ సారి ఎన్నిక

వాషింగ్టన్: డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి నాన్సీ పెలోసీ చరిత్ర సృష్టించారు. వరుసగా 20వ సారి ప్రతినిధుల సభకు ఎన్నికయ్యారు. కాలిఫోర్నియాలోని 12వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆమె అక్కడ నుంచి మళ్లీ విజయం సాధించారు. మొదటిసారి 1987లో గెలిచారు. ఆ తర్వాత ఓటమి ఎరుగని నేతగా ముందుకు సాగారు. అమెరికా ప్రతినిధుల సభకు స్పీకర్‌గానూ పెలోసీ చరిత్ర సృష్టించారు.

తొలిసారి ట్రాన్స్‌జెండర్ ఎన్నిక

డెలవేర్‌లోని ఎట్ లార్జ్ హౌస్ డిస్ట్రిక్ట్ నుంచి డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన ట్రాన్స్‌జెండర్ సారా మెక్‌బ్రైడ్ విజయం సాధించారు. కాంగ్రెస్‌కు ఎన్నికైన తొలి ట్రాన్స్‌జెండర్‌గా నిలిచారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి జాన్ వేలెన్‌పై సారా మెక్‌బ్రైడ్ గెలుపొందారు. సారాకు 95శాతం ఓట్లు పోలవగా, వేలెన్‌కు 57.9 శాతం ఓట్లు వచ్చాయి.

ఇది చారిత్రక గెలుపు

ట్రంప్‌నకు ప్రపంచ నేతల శుభాకాంక్షలు

వాషింగ్టన్: అమెరికాకు 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికయ్యారు. ఓటమిని చవిచూసిన తర్వాత విజేతగా నిలిచిన నేతగా చరిత్రకెక్కారు. చారిత్రక ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. దీంతో ట్రంప్‌కు ప్రపంచ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. భారత, బ్రిటన్, ఇజ్రాయిల్, ఆస్ట్రేలియా, హంగారీ తదితర దేశాల ప్రధానులు, అధ్యక్షులు ఆయనకు అభినందనలు తెలియజేశారు. 'రాబోయే సంవత్సరాల్లో మీతో కలిసి పనిచేయాలని ఆశిస్తున్నాం. చారిత్రక విజయం సాధించినందుకు మీకు శుభాకాంక్షలు అంటూ ట్రంప్‌నుద్దేశించి బ్రిటన్ ప్రధాని కైర్ స్టార్మర్ అన్నారు. 'మిత్రదేశాలుగా పరస్పరం సహకరించుకుందాం, సమ్మిళిత స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం విలువలతో భద్రత బాధ్యత తీసుకుందాం. వృద్ధి నుంచి భద్రత వరకు పరస్పరం సహకారాన్ని అందించుకుందాం, అన్వేషణలు, సాంకేతిక సయోధ్యకు కట్టుబడదాం. అమెరికా, బ్రిటన్ మధ్య ప్రత్యేక బంధం రాబోయే సంవత్సరాల్లో మరింతగా వర్ధిల్లుతుందని నాకు తెలుసు' అని తన లేఖలో పేర్కొన్నారు. ఇది గొప్ప విజయమంటూ ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అన్నారు. 'మీ తిరిగి శ్వేతసౌధానికి రావడంతో అమెరికాలో కొత్త పొద్దు పొడిచినట్లు అయింది. ఇజ్రాయిల్, అమెరికా మధ్య బంధం మరింత శక్తిమంతమైనదిగా కొనసాగగలదని ఆశిస్తున్నా' అని నెతన్యాహు వెల్లడించారు. 'డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం అమెరికా రాజకీయ చరిత్రలో నిలిచిపోతుంది. ఆయన గెలుపు ప్రపంచానికి ఎంతో అవసరం' అని హంగేరి ప్రధాని విక్టర్ ఓర్బన్ అన్నారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోని అల్బనీస్ కూడా ట్రంప్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలు ప్రపంచానికే కాదు తమ ప్రాంతానికి, ఆస్ట్రేలియాకు ముఖ్యమన్నారు. కొత్తగా ఏర్పాటు కాబోయే ట్రంప్ ప్రభుత్వం కలిసి పనిచేస్తామని, పటిష్ఠ ఆర్థిక భాగస్వామ్యాన్ని రెండు దేశాలకు ప్రయోజనం ఉండేలా ఏర్పాటు చేసుకుంటామని ఆంటోని అల్బనీస్ అన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ స్పందిస్తూ ట్రంప్ శాంతి విధానాన్ని ప్రసంగించారు. ఆయన గెలుపుపై హర్షం వ్యక్తం చేశారు. అమెరికా సహకారం తమకు కొనసాగుతుందని ఆకాంక్షించారు. మిత్రుడా శుభాకాంక్షలు అంటూ టర్కీ అధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్డోగన్ ఓ సందేశాన్ని పంపించారు. గొప్ప పోరులో ట్రంప్ గొప్ప విజయాన్ని అందుకున్నట్లు పేర్కొన్నారు. యూరోపియన్ యూనియన్ అధ్యక్షురాలు ఉర్సులా వోన్ డెర్ లెయిన్ కూడా ట్రంప్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ట్రాన్స్‌అట్లాంటిక్ అజెండా విషయంలో వాషింగ్టన్, బ్రెసెల్స్ మధ్య సయోధ్య బలపడుతుందని ఆకాంక్షించారు. స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ కూడా ట్రాన్స్‌అట్లాంటిక్ భాగస్వామ్య బలోపేతాన్ని ఆకాంక్షిస్తూ ట్రంప్‌కు శుభాకాంలు తెలిపారు. పోలిష్ ప్రధాని డొనాల్డ్ టస్క్, జపాన్ ప్రధాని ఇషిబా, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ కూడా వేర్వేరు సందేశాల్లో శుభాకాంక్షలు తెలిపారు. తమ దేశాల మధ్య బలమైన సహకారాన్ని ఆకాంక్షించారు. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ డిప్యూటీ చీఫ్ అలీ... టెహ్రాన్ తరపున ట్రంప్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జో బైడెన్ తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోవాలని ట్రంప్‌కు ఈ సందర్భంగా తాము చెప్పదలిచినట్లు హమాస్ ఓ ప్రకటన చేసింది. అమెరికా అధ్యక్షుడిగా యుద్ధాన్ని ఆపుతానన్న ఆయన మాటకు ఎంత మేరకు కట్టుబడతారో చూడాలని హమాస్ సీనియర్ అధికారి సమీ అబు జుహ్రీ వెల్లడించారు.

మిత్రమా శుభాకాంక్షలు: మోదీ

భారత ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' మాధ్యమంగా ఆనందాన్ని వ్యక్తంచేశారు. మిత్రమా నీకు శుభాకాంక్షలు అంటూ పోస్టు పెట్టారు. 'చారిత్రక విజయం సాధించిన ట్రంప్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నా. గత పదవీకాలంలో సాధించిన విజయాలకు కొనసాగింపుగా భారత్-అమెరికా సమగ్రత, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి.. సహకారాన్ని పునరుద్ధరించడానికి సిద్ధంగా ఉన్నా. మన దేశాల ప్రజల అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దాం. ప్రపంచ శాంతి, స్థిరత్వం, శ్రేయస్సును ప్రోత్సహించేందుకు ఐక్యంగా కృషి చేద్దాం' అని మోదీ పేర్కొన్నారు.

అమెరికాతో కలిసి పనిచేస్తాం: కాంగ్రెస్

అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్‌కు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శుభాకాంక్షలు తెలిపారు. అంతర్జాతీయ శాంతి, సుస్థిరత, సౌభాగ్యం కోసం అమెరికాతో కలిసి పనిచేసేందుకు సిద్ధమన్నారు. 'ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. భారత్, అమెరికా దేశాలు అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వాములు, దీర్ఘకాలంగా ప్రజాస్వామిక విలువులకు కట్టుబడుతున్నాయి. పరస్పరం ప్రయోజనాల దృష్ట్యా పనిచేస్తున్నాయి. రెండు దేశాల ప్రజల మధ్య సంబంధాలు కొనసాగిస్తున్నాయి. అంతర్జాతీయ శాంతి, సౌభాగ్యం కోసం అమెరికాతో కలిసి పనిచేస్తాం' అని ఎక్స్‌లో మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

సుప్రీం తీర్పు పునఃపరిశీలన అవసరం

(మొదటిపేజీ తరువాయి)

పెరుగుతున్న అసమానతలు, పర్యావరణ మార్పుపై ప్రభావం దృష్ట్యా ఈ తీర్పును అధ్యయనం చేయాలన్నారు. సుప్రీం తీర్పు సహజ వనరుల ప్రైవేటీకరణకు ద్వారాలను బార్లా తెరిచేదిగా ఉందని వ్యాఖ్యానించారు. అలా జరగకుండా అడ్డుకోవాలని సూచించారు. ఈ తీర్పును ప్రజలు, న్యాయవ్యవస్థ, పార్లమెంటు లోతుగా అధ్యయనం చేయడం అవశ్యమని రాజా నొక్కిచెప్పారు.

కెనడా ఘటన తీవ్రమైనది

కెనడాలోని హిందూ దేవాలయంపై దాడిని డి.రాజా ఖండించారు. ఇది ఆందోళన కలిగించే విషయమని, ఏ వర్గంపై జరిగిన హింసనైనా ఖండించాల్సిందేనన్నారు. 'మైనారిటీలకు భద్రత కల్పించడం కెనడా ప్రభుత్వ బాధ్యత. ఇది ప్రతి దేశానికి వర్తిస్తుంది. ఇప్పటికే భారతదేశం, కెనడా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. తాజా ఘటనతో మరింత క్లిష్ట పరిస్థితులు నెలకొన్నాయి' అని రాజా అన్నారు. కెనడాలోని హిందూ దేవాలయంపై దాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) నాయకుడు మృత్యుంజయ్ తివారీ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యం, ఇతర దేశాలలో దాని విదేశాంగ విధానాల వల్ల ఇలాంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. 'కేంద్రం ఒత్తిడిని భరించాలి. ఇతర దేశాలలో ఇలాంటి పరిస్థితి ఎందుకు జరుగుతోంది? ఇది ప్రభుత్వ వైఫల్యంగా వారి విదేశాంగ విధానాలను చూడవచ్చు. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో ప్రధాని మాట్లాడాలి' అని చెప్పారు. ఆలిండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఏఐయూడీఎఫ్) ఎమ్మెల్యే, పార్టీ ప్రధాన కార్యదర్శి రఫీకుల్ ఇస్లాం కూడా కెనడాలోని హిందూ దేవాలయంపై దాడిని ఖండించారు. భవిష్యత్‌లో ఇలాంటి దాడులను నిరోధించడానికి కెనడా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని, దోషులకు కఠినమైన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా కెనడా ప్రభుత్వంతో మాట్లాడాలని కేంద్రాన్ని కోరారు. కెనడాలో ఇటీవలి సంవత్సరాలలో ఇలాంటి ఘటనలు పెరగడం గమనార్హం.

మళ్లీ ట్రంప్ వచ్చాడు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న అసంతృప్తి ట్రంప్‌కు చారిత్రక విజయాన్ని అందించింది. ఎలక్టోరల్ కాలేజీలో మెజారిటీ సీట్లు దక్కించుకోవడానికి దోహదమైంది. స్వింగ్ రాష్ట్రాలను ట్రంప్ స్వీప్ చేయగలిగారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తారుమారు చేసి ట్రంప్ చరిత్ర సృష్టించారు. మొత్తం 280 ఓట్లతో ట్రంప్ విజయాన్ని సాధించగా, హారిస్ 224 ఓట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అధ్యక్ష పదవికి ఎన్నిక కావాలంటే 270 ఓట్లు అవసరం కాగా ట్రంప్‌కు స్పష్టమైన మెజారిటీ వచ్చింది. అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన పెద్ద వయసు గల నేతగా 78 ఏళ్ల డొనాల్డ్ ట్రంప్ నిలిచారు. పాపులర్ ఓటును 20 ఏళ్లలో మొదటిసారి గెలుచుకున్న రిపబ్లికన్‌గానూ చరిత్రకెక్కారు. రెండు దశాబ్దాల ఓటర్ డేటాను పరిశీలిస్తే అత్యధిక పాపులర్ ఓట్లు పొందిన అధ్యక్షుడిగా బరాక్ ఒబామా (69.5 మిలియన్ ఓట్లు అంటే 52.9శాతం) నిలిచారు. 2008లో 365 ఎలక్టోరల్ ఓట్లు పొందారు. 2012లో రెండవసారి పగ్గాలు చేపట్టినప్పుడు పాపులర్ ఓటు శాతం స్వల్పంగా తగ్గి 51.1 శాతంగా నమోదైంది. అప్పట్లో ఒబామాకు 332 ఎలక్టోరల్ ఓట్లు లభించాయి. స్వల్ప విరామంతో అమెరికా అధ్యక్ష పీఠాన్ని దక్కించుకున్న అభ్యర్థిగానూ రికార్డు నెలకొల్పారు. ఇలా జరగడం 131 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. 2016 నాటి ఫలితాలకు భిన్నంగా 51 శాతానికి పైగా ఓట్లను ట్రంప్ గెలుచుకున్నారు. హారిస్ 47 శాతానికి పరిమితమయ్యారు. ఏడు స్వింగ్ స్టేట్స్‌లోనూ ట్రంప్ గాలి వీచింది. ద్రవ్యోల్బణం, ఉద్యోగాలు, వేతనాలు, అక్రమ చొరబాట్లు వంటి అంశాలు ఈ ఎన్నికలను ప్రభావితం చేసినట్లు కనిపిస్తోంది. అరబ్, ముస్లింలు అధికంగా ఉన్న జార్జియాలో కమలా హారిస్‌కు ఆదరణ లభించలేదు. గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణకు డెమొక్రాట్ ప్రభుత్వ మద్దతుపై ఇక్కడి ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

వీరిని బుజ్జగించేందుకు హారిస్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తాను అధికారంలోకి వస్తే యుద్ధం ఆపేస్తానని ట్రంప్ హామీ ఇచ్చి మార్కులు కొట్టేశారు. అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపుతానని చెప్పారు. ఎలియన్ ఎనిమీస్ యాక్ట్‌ను మళ్లీ తెస్తానని హామీ ఇచ్చారు. బైడెన్ హయాంలో ధరల పెరుగుదలతో ప్రజలు అవస్థపడ్డారు. తాను అధికారంలోకి వస్తే ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడతానని ట్రంప్ వాగ్దానం చేయడం ఆయనకు కలిసివచ్చింది. ట్రంప్‌కు గ్రామీణ ఓటర్ల నుంచి మద్దతు లభించింది.

ఉపాధ్యక్షుడు... ఆంధ్రా అల్లుడు

ట్రంప్ అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపట్టనుండటంతో ఉపాధ్యక్షుడిగా జేడీ వాన్స్ వ్యవహరించనున్నారు. వాన్స్ భార్య ఉష తెలుగమ్మాయి కావడంతో ఆయన ఆంధ్రాకు అల్లుడు అవుతారు. ఉషా వాన్స్ అమెరికాకు సెకండ్ లేడీగా ఉంటారు. ఒహాయో రాష్ట్ర సెనేటర్‌గా జేడీ వాన్స్‌ను ఉపాధ్యక్ష అభ్యర్థిగా ట్రంప్ ఎంపిక చేసుకున్నప్పటి నుంచే ఉష పేరు మార్మోగింది. ఉషా చిలుకూరి అమెరికాలో పుట్టి పెరిగిన తెలుగమ్మాయి. ఆమె పూర్వీకులది ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పామర్రుకు దగ్గర్లోని ఓ కుగ్రామం. తల్లిదండ్రులు రాధాకృష్ణ, లక్ష్మి 1980ల్లోనే అమెరికా వెళ్లారు. వీళ్ల ముగ్గురు సంతానంలో ఉష ఒకరు. తల్లి లక్ష్మి మాలిక్యులర్ బయాలజీ, బయో కెమిస్ట్రీ రంగ నిపుణులు. ప్రస్తుతం ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తూనే, శాన్‌డియాగో విశ్వవిద్యాలయంలో కీలకమైన అడ్మినిస్ట్రేటివ్ పదవిలో ఉన్నారు. తండ్రి రాధాకృష్ణ... క్రిష్ చిలుకూరిగా అందరికీ పరిచయం. ఆయన ఏరోస్పేస్ ఇంజినీర్. యునైటెడ్ టెక్నాలజీస్ ఏరోస్పేస్ సిస్టమ్స్ ఏరోడైనమిక్స్ స్పెషలిస్ట్‌గా పనిచేశారు. ఆపై కాలిన్స్ ఏరోస్పేస్‌లో అసోసియేట్ డైరెక్టర్‌గానూ వ్యవహరించారు.

అసాధ్యాన్ని సుసాధ్యం చేశాం

(మొదటిపేజీ తరువాయి)

రాగలరని స్పష్టం చేశారు. తన భార్య మెలానియాకు ఆయన ధన్యవాదాలు చెప్పారు. అలాగే కాబోయే ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఆయన భార్య ఉషాకు అభినందనలు తెలిపారు. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌తో తనకున్న అనుబంధాన్ని ట్రంప్ ప్రస్తావించారు. ప్రజలు ప్రకృతి వైపరీత్యంలో చిక్కుకున్నపుడు.. వారిని రక్షించే చర్యల్లో భాగంగా ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్ లింక్ ఎంతో సహాయం చేసిందని డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అమెరికన్లు తమ దేశంపై తిరిగి పట్టు సాధించుకున్నారని వ్యాఖ్యానించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంతో ఏ శక్తి తనను అడ్డుకోలేదని ట్రంప్ అన్నారు.

సామాజిక బాధ్యతతో పనిచేయాలి

(మొదటిపేజీ తరువాయి)

దోహద పడుతుందని అన్నారు. మహిళలు వ్యాపారాలు చేయాలి, ఆర్థికంగా బలోపేతం కావాలి, కుటుంబాలకు ఆర్థికంగా చేయూత ఇవ్వాలనేదే ఉచిత బస్సు ప్రయాణం వెనుక ఉన్న ఉద్దేశం అన్నారు. స్వయం సహాయక సంఘాలకు ఈ ఏడాది 20వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని యావత్ క్యాబినెట్ నిర్ణయించిందని అన్నారు. కార్పొరేట్ కమర్షియల్ బ్యాంకులు తొమ్మిది నుంచి 13 శాతం వరకు వడ్డీ వసూలు చేస్తున్నాయి... బ్యాంకర్లు సామాజిక బాధ్యతతో పనిచేయాలి... రుణాలు ఇచ్చే ముందు నిబంధనలు సరళతరం చేయాలని కోరారు. ప్రైవేటు విభాగాల్లో రుణాల రికవరీ శాతం తక్కువగా ఉంటుందని, అదే స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇచ్చిన రుణాల రికవరీ చూస్తే 98 శాతానికి పైగా ఉందని.. బ్యాంకర్లు స్వయం సహాయక సంఘాల మహిళలకు తక్కువ వడ్డీ రేట్లు ఎక్కువ మొత్తంలో రుణాలు ఇవ్వాలని కోరారు. ప్రతి నియోజకవర్గంలో సూక్ష్మ, మధ్య తరహా పారిశ్రామిక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వీటిని మహిళలకు ప్రత్యేకంగా కేటాయిస్తున్నట్టు చెప్పారు. బ్యాంకర్లు విశాలా దృక్పథంతో సహకరిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, ఆర్థిక అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుంది అన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు 12 వేల కోట్ల పైగా టర్నోవర్ చేస్తున్నారు... ఇదే సమయంలో గిరిజన ప్రాంతాల్లోని సంఘాలు సుమారు 200 కోట్ల వరకు తీసుకున్న రుణాలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. వారి రుణాలు మాఫీ చేయడం లేదా వన్ టైం సెటిల్మెంట్ చేసే అవకాశాన్ని పరిశీలించాలని తెలిపారు. హైదరాబాదులో మూడువేల కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళలకు ఇవ్వాలని నిర్ణయించాం, వాటిని ఐదు వేల కోట్లకు తీసుకువెళ్లాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్, సెర్ప్ సీఈఓ దివ్యదేవరాజన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ టీకే శ్రీదేవి పాల్గొన్నారు.

"బర్డ్స్ ఆఫ్ తెలంగాణ" భవిష్యతరాల అవగాహనకు దోహదం: భట్టి

"బర్డ్స్ ఆఫ్ తెలంగాణ" భవిష్యత్ తరాలకు అవగాహన కల్పించేందుకు దోహద పడుతుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాభవన్‌లో బుధవారం హైదరాబాద్ బర్డింగ్ పాల్స్ సభ్యులచే అనుసంధానం చేయబడిన "బర్డ్స్ ఆఫ్ తెలంగాణ" పాకెట్ గైడ్ ను ఆవిష్కరించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ... పక్షుల గురించి భవిష్యత్ తరాలకు అవగాహన కల్పించేందుకు ఇది దోహద పడుతుందన్నారు. హైదరాబాద్ బర్డింగ్ పాల్స్ ప్రెసిడెంట్ ఆడెపు హరికృష్ణ.. తొలుత పాకెట్ గైడ్ ప్రాముఖ్యత, ఆవశ్యకతను ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఈ పుస్తకం పక్షుల ఆహారం, వలసలు, పరిరక్షణ స్థితి తెలుసుకోవటానికి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని చెప్పారు. 252 ముఖ్య పక్షి జాతులను కలిగి ఉన్న ఈ పాకెట్ గైడ్ తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు... కళాశాల విద్యార్థులకు ఉచితంగా అందిస్తామన్నారు. పట్టణ సరస్సుల పరిరక్షణకు కృషి చేసిన మాజీ డీజీపీ తేజ్ దీప్ కౌర్ మీనన్, పక్షుల పరిశీలనను ప్రోత్సహించడంలో హెచ్ బీపీ ప్రత్యేక పాత్రను కొనియాడారు. ఈ బృందం నిర్వహించిన 490 ఉచిత బర్డ్ వాక్‌ల ద్వారా పర్యావరణ పరిరక్షణపై పౌరులకు అవగాహన కల్పించినట్టు చెప్పారు. ఈ పుస్తకాన్ని రూపొందించడానికి చిత్రాలను అందించిన 30కి పైగా హెచ్బీపీ సభ్యులైన వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ ల సహకారం ఎంతో అభినందనీయం అని అన్నారు.

ఏపీ డీఎస్సీ వాయిదా...

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించే మెగా డీఎస్సీ-2024 నోటిఫికేషన్ వాయిదా పడింది. షెడ్యూలు ప్రకారం బుధవారమే నోటిఫికేషన్ విడుదలకు పాఠశాల విద్యాశాఖ సన్నద్ధమవ్వగా... సాంకేతిక కారణాల రీత్యా దానిని వాయిదా వేశారు. వారం రోజుల్లోగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలపై ఒక స్పష్టత రానుంది. చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 16,347 పోస్టులతో డీఎస్సీ ప్రకటన విడుదలకు విద్యాశాఖ ఏర్పాట్లు చేయగా... ఊహించని రీతిలో వాయిదా పడటం నిరుద్యోగులకు నిరాశ మిగిల్చింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉపాధ్యాయ ఖాళీల వివరాలను సేకరించారు. సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ) 6,371 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్లు 7,725, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు (టీజీటీ) 1,781, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు (పీజీటీ) 286, ప్రిన్సిపల్స్ 52, పీఈటీ 132 పోస్టులు భర్తీ చేయనున్నారు. నోటిఫికేషన్‌లో ఈ పోస్టుల సంఖ్య పెరుగుతుందని నిరుద్యోగ అభ్యర్థులు ఆశిస్తున్నారు. కర్నూలు జిల్లాలో ఎస్జీటీ పోస్టులు అత్యధికంగాను, అత్యల్పంగా శ్రీకాకుళం జిల్లాలో ఉన్నట్లు సమాచారం. ఈనెల నాలుగో తేదీన ఏపీ టెట్ ఫలితాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. పాఠశాల విద్యాశాఖ అధికారులతో సమీక్షించి... డీఎస్సీకి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనుకున్న సమయానికే (బుధవారం) డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని ఆశించిన అభ్యర్థులకు నిరాశే ఎదురైంది. డీఎస్సీ వాయిదాపై విద్యాశాఖ స్పష్టత ఇచ్చింది. టెట్ పరీక్షల మాదిరిగానే డీఎస్సీ పరీక్షలనూ ఆన్‌లైన్‌లో నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఎస్జీటీ పోస్టులకు పోటీ పడేవారు అధికంగా ఉండటంతో ఈ పోస్టులకు సంబంధించిన పరీక్ష నిర్వహణకుగాను వారం రోజుల సమయం పడుతుందని విద్యాశాఖ వెల్లడించింది. పరీక్షల ఫలితాలను నార్మలైజేషన్ చేసి విడుదల చేయాల్సి వస్తుంది. ఈ సమస్య లేకుండా రెండు, మూడు జిల్లాలకు ఒకేసారి పరీక్ష నిర్వహిస్తే ఎలా ఉంటుందన్న కోణంలో విద్యా శాఖ యోచించింది. ఇది ఎంత వరకు సత్ఫలితాలను ఇస్తుందనే దానిపై కూడా ఆరా తీస్తున్నారు. విద్యాశాఖ డీఎస్సీ పరీక్షల నిర్వహణకు సరికొత్త ప్రణాళికతో సన్నద్ధమవ్వగా...సాంకేతిక కారణాలతో వాయిదా పడింది.

డీఎస్సీ పరీక్షలు ఆన్‌లైన్ విధానంలో ఫిబ్రవరి మూడోతేదీ నుంచి మార్చి నాల్గోతేదీ వరకు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. డీఎస్సీ మార్కులు+టెట్ వెయిటేజీ ఆధారంగా ప్రతిభావంతుల జాబితాను రూపొందిస్తారు. దీంతోపాటు కేటగిరీలు, రిజర్వేషన్ల ఆధారంగా ఆయా జిల్లాల్లో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. టెట్‌లో అత్యధికంగా వెయిటేజీ సాధించిన అభ్యర్థులు...అదే రీతిలో డీఎస్సీలో పోటీ పడేందుకు సిద్ధమవుతున్నారు. మెగా డీఎస్సీ వాయిదా కారణాల్లో ఒకటిగా గిరిజన ప్రాంతాల ఉపాధ్యాయ పోస్టుల సాంకేతిక సమస్య ఉంది. గిరిజనులకు రిజర్వేషన్ చట్టబద్ధత చేసి ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఏజెన్సీలో టీచర్ పోస్టులు భర్తీ చేయాలన్న డిమాండ్లు తెరపైకి వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ద్వారా ఏజెన్సీలోని గిరిజన సంక్షేమం, జిల్లా పరిషత్ పాఠశాలల్లో టీచర్ పోస్టు ఖాళీల భర్తీకి రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేస్తే ఆదివాసీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుంది. దీంతోపాటు ఎస్సీ రిజర్వేషన్ల అంశం ఒక కారణంగా ఉన్నట్లు సమాచారం. దీంతోపాటు గిరిజన సంక్షేమ పాఠశాలల్లో కాంట్రాక్టు/అవుట్ సోర్సింగ్ విధానంలో దాదాపు రెండువేల మంది ఉపాధ్యాయులు ఎంతో కాలంగా పనిచేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో ఆయా పోస్టులనూ ఖాళీలుగా చూపించారు. అదే జరిగితే వారి ఉద్యోగాలు ఊడిపోయి ఇంటికెళ్లిపోవాల్సి ఉంది. గతంలో ఇదే సమస్యపై సీఎం చంద్రబాబు ఇంటి ఎదుట గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా ఆందోళనకు దిగారు. ఉన్నతాధికారులు అక్కడికి వచ్చి వారికి భరోసా ఇచ్చారు.

అమిత్ షాతో పవన్ కల్యాణ్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి పవన్... అమిత్ షాతో సమావేశమయ్యారు. అమరావతి సచివాలయంలో బుధవారం మంత్రివర్గ సమావేశంలో పాల్గొన్న పవన్ కల్యాణ్ అనంతరం గన్నవరం విమానాశ్రయం చేరుకుని ఢిల్లీ బయలు దేరి వెళ్లారు. ముందుగానే అపాయింట్‌మెంట్ ఖరారు కావడంతో సాయంత్రం అమిత్ షాతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ఇతర అంశాలు ఇద్దరి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం.

కాంగ్రెస్ హిమాచల్ ప్రదేశ్ శాఖ రద్దు

న్యూఢిల్లీ: హిమాచల్ ప్రదేశ్‌లోని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ)తో పాటు జిల్లా, మండల స్థాయి శాఖలను రద్దు చేస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం ఆదేశాలిచ్చారు. ఈ శాఖలన్నీ వెంటనే రద్దు అవుతాయని తేల్చిచెప్పారు. హిమాచల్ ప్రదేశ్‌లో పార్టీ శాఖ పునర్నిర్మాణం ఆలోచనతోనే అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గిరి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి పార్టీలో శాఖపరంగా మార్పులు జరగలేదు. హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రెస్ కమిటీ పరిధి శాఖలన్నింటినీ తక్షణమే రద్దు చేయాలనే ప్రతిపాదనను కాంగ్రెస్ అధ్యక్షుడు ఆమోదించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు.

రాష్ట్రాన్ని దోచేది ఆ ముగ్గురే...

(మొదటిపేజీ తరువాయి)

మేఘా ఇంజినీరింగ్ సంస్థను ఈస్ట్ ఇండియా కంపెనీ అని రేవంత్ రెడ్డి మాట్లాడారని, ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా కమీషన్ల కోసమే అంటూ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ గురించి మాట్లాడారని గుర్తు చేశారు. నాడు కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి కూడా మేఘా కృష్ణారెడ్డిని పొలిటికల్ మాఫియా అంటూ మాట్లాడారని గుర్తు చేశారు. కేసీఆర్ ఎంతో గొప్పగా పనిచేసి దేశంలో ఎవరూ చేయని విధంగా కాళేశ్వరం కట్టారన్నారు. హైదరాబాద్ కు నీళ్లు తీసుకురావటానికి తాము సుంకిశాల ప్రాజెక్ట్ చేపట్టామని, ముఖ్యమంత్రి ఆ ప్రాజెక్ట్ ను పట్టించుకోలేదన్నారు. అలసత్వం కారణంగా రిటైనింగ్ వాల్ కూలిపోయిందని, ఈ విషయాన్ని ప్రభుత్వం దాచి పెట్టిందని చెప్పారు. కాళేశ్వరంలో లక్ష కోట్లు నీళ్లలో పోశారంటూ ప్రచారం చేసిన కాంగ్రెస్ వాళ్లు ఈ ప్రమాదాన్ని మాత్రం దాచి పెట్టి నలుగురు అధికారులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారన్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి... మేఘా సంస్థకు రాష్ట్రంలో ప్రాజెక్ట్ లను కట్టబెడుతున్నారని దుయ్యబట్టారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ కోసం రూ.4,350 కోట్ల టెండర్ ను మేఘా సంస్థకు అప్పగించారని, బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని చెప్పిన సంస్థకు ఎందుకు కాంట్రాక్ట్ కట్టబెట్టారో సీఎం చెప్పాలని నిలదీశారు. సుంకిశాల విషయంలో మేఘా సంస్థ పై చర్యలు తీసుకొని కాంట్రాక్ట్ రద్దు చేయాలని, కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్... పెద్ద కుంభకోణమే అని దానిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ రూ.4,350 కోట్లలో నీ వాటా ఎంత... ఢిల్లీ వాటా ఎంత అంటూ ప్రశ్నించారు. స్కిల్ వర్సిటీ కోసం రూ. 200 కోట్ల విరాళాన్ని ప్రాజెక్ట్ లు కట్టబెట్టినందుకే ఇచ్చారా అని ధ్వజమెత్తారు. కాళేశ్వరం నీళ్లను మూసీలోకి పంపిస్తారంట, దీనికి రూ.5,500 కోట్లు ఖర్చు చేస్తారంట, ఇది చూస్తుంటే ఇది మరొక కుంభకోణంగా కనిపిస్తుందన్నారు. కొండ పోచమ్మ సాగర్ నుంచి గోదావరి నీళ్లను హైదరాబాద్ తెచ్చేందుకు మేము రూ. 11 వందల కోట్లతో అన్ని సిద్ధం చేశామని, కానీ పెద్ద ఎత్తున కుంభకోణం చేసేందుకే దీన్ని రూ. 5,500 కోట్లకు పెంచారని ఆరోపించారు. ఈ ప్రాజెక్ట్ ను మేఘా సంస్థకే ఇవ్వటానికి అన్ని ఒప్పందాలు కుదుర్చుకున్నారన్నారు. బండి సంజయ్ ఎందుకు దీని పై మాట్లాడటం లేదని ధ్వజమెత్తారు. బావమరదికి అమృత్ టెండర్లు, మేఘా, రాఘవ సంస్థలకు ప్రాజెక్ట్ లను రేవంత్ రెడ్డి పంచుతున్నాడని విమర్శించారు. వీటిపై కేంద్రం సంస్థలు ఎందుకు విచారణ జరపటం లేదని ప్రశ్నించారు. రేవంత్, పొంగులేటి, మేఘా కృష్ణారెడ్డి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఈడీలు మాత్రం కేవలం బీఆర్ఎస్ మీదికే వస్తారన్నారు.

మహారాష్ట్ర, జార్ఖండ్‌లో రూ.558 కోట్లు స్వాధీనం

(మొదటిపేజీ తరువాయి)

ఓటర్లకు పంచేందుకు సమకూర్చున్నవే 40శాతం మేర ఉన్నట్లు పేర్కొంది. 2019 అసెంబ్లీ ఎన్నికలప్పటితో పోల్చితే ఈ రెండు రాష్ట్రాల్లో స్వాధీనం చేసుకున్న డబ్బు, మాదకద్రవ్యాలు, మద్యం తదితరాల విలువ 3.5రెట్లు పెరిగిందని ఎన్నికల సంఘం తెలిపింది. మహారాష్ట్రలోని 91, జార్ఖండ్‌లోని 19 కలిపి మొత్తం 110 అసెంబ్లీ నియోజకవర్గాలపై నిఘా పెంచినట్లు వెల్లడించింది.

యూపీ సర్కారుపై సుప్రీం ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

తుంగలో తొక్కి... పౌరుల హక్కులను రాష్ట్రం బుల్డోజ్ చేయలేదని స్పష్టం చేసింది. 'మీరు రాత్రికి రాత్రే బుల్‌డోజర్లతో వచ్చి ఇళ్లు కూల్చివేయలేరు. కుటుంబ సభ్యులను ఖాళీ చేయడానికి మీరు సమయం ఇవ్వరు. గృహోపకరణాల సంగతేంటి? తగిన ప్రక్రియను అనుసరించాలి' అని న్యాయమూర్తి జస్టిస్ పార్దీవాలా అన్నారు. పరిహారంతో పాటు అక్రమ కూల్చివేతలకు బాధ్యులైన అధికారులపై విచారణ ప్రారంభించాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోర్టు ఆదేశించింది. 2019లో రోడ్డు విస్తరణలో భాగంగా మహారాజ్‌గంజ్ నివాసి మనోజ్ తిబ్రేవాల్ ఆకాశ్ ఇంటిని అధికారులు కూల్చివేశారు. ఇంటిని ఖాళీ చేయమంటూ అతడికి ఎలాంటి నోటీసులు పంపించకుండానే ఈ చర్యలకు ఉపక్రమించారు. తనకు న్యాయం చేయమని కోరుతూ బాధితుడు సుప్రీం కోర్టును ఆశ్రయించాడు. నాడు దాఖలయిన పిటిషన్‌పై తాజాగా ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ ప్రభుత్వ భూమిని ఆక్రమించారని రాష్ట్ర అధికారులు వాదించినప్పుడు... ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ వారి ప్రతిస్పందనను ప్రశ్నించారు. 'అతను 3.7 చదరపు మీటర్ల ఆక్రమణదారుడని మీరు అంటున్నారు. మేము దానిని పరిగణనలోకి తీసుకుంటాం. దానికి మేము అతనికి సర్టిఫికెట్ ఇవ్వడం లేదు. కానీ మీరు అలాంటి వ్యక్తుల ఇళ్లను కూల్చివేయడం ఎలా ప్రారంభిస్తారు? ఎవరి ఇంటిలోకి అయినా అలా వెళ్లడం అక్రమం' అని ప్రధాన న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారిక నోటీసు జారీ చేయలేదని ధృవీకరించిన అఫిడవిట్‌లను ఉటంకిస్తూ అధికారులు ప్రామాణిక చట్టపరమైన విధానాలను దాటవేసినట్లు ధర్మాసనం గుర్తించింది. బదులుగా, నివాసితులకు ఆ ప్రాంతంలో లౌడ్ స్పీకర్ల ద్వారా కూల్చివేత గురించి సమాచారం అందించారు. ఈ చర్య సరిపోదని, ఏకపక్షంగా ఉందని కోర్టు గుర్తించింది. 'ప్రజలు తమ ఇళ్లను ఖాళీ చేయమని చెప్పడానికి మీరు డప్పు కొట్టలేరు. కూల్చివేతలను కొనసాగించడానికి సరైన నోటీసు ఉండాలి' అని స్పష్టం చేసింది. జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) కోర్టుకు సమర్పించిన నివేదిక ప్రకారం, కూల్చివేత పరిధి ఆరోపించిన ఆక్రమణల కంటే చాలా ఎక్కువ అని వెల్లడించింది. ఇది రాష్ట్ర చర్యలలో పర్యవేక్షణ, విధానపరమైన న్యాయపరమైన లోపాన్ని మరింత ఎత్తిచూపుతోందని పేర్కొంది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు మార్గదర్శకాలను జారీ చేస్తూ, రహదారి విస్తరణ ప్రాజెక్టుల కోసం ఆక్రమణలను తొలగించడానికి ముందు తీసుకోవాల్సిన చర్యలను సుప్రీం కోర్టు వివరించింది. ప్రస్తుత రహదారి వెడల్పును అధికారులు నిర్ణయించాల్సి వచ్చినప్పుడు, ఏదైనా ఆక్రమణ గురించి నివాసితులకు అధికారికంగా తెలియజేయాలని, అభ్యంతరాలు తెలిపేందుకు వారికి అవకాశం కల్పించడం అవసరమని పేర్కొంది. ఏదైనా ప్రతికూల నిర్ణయాలకు తప్పనిసరిగా సహేతుకమైన ఆదేశాలు ఇవ్వాలని, ప్రభావిత నివాసితులకు ఖాళీ చేయడానికి తగిన సమయం ఇవ్వాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

ప్రజాపోరాటాలకు వైకల్యం అడ్డుకాదు

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. దేశంలో మతోన్మాదం, మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. పేదలు మరింత పేదలవుతున్న పాలక ప్రభుత్వాలు ఒంటెద్దు పోకడ అనుసరిస్తున్నాయని మండిపడ్డారు. ప్రజా ఉద్యమాలు ఎర్రజెండా పార్టీలతోనే సాధ్యమవుతుందని చెప్పారు. సాయిబాబా వంటి ఉద్యమకారులు, అభ్యుదయవాదులు, మేధావులు, విద్యావంతులు ఏకతాటి పైకి వచ్చి హక్కుల సాధనకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడితే ఊపా కేసులు: వేణుగోపాల్

బడుగు, బలహీన ఆదివాసి వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన దీశాలి సాయిబాబా అని మరో ముఖ్య అతిథి, వీక్షణం పత్రిక సంపాదకులు ఎన్.వేణుగోపాల్ కొనియాడారు. ఓవైపు విద్యార్థులకు విద్యాబోధన చేస్తూ, మరోవైపు ప్రజలకు జరుగుతున్న అన్యాయాలపై ప్రభుత్వాలను ప్రశ్నించాడన్నారు. బీజేపీ ప్రభుత్వ నియంతృత్వ విధానాలను ప్రశ్నించే వాళ్లపై అర్బన్ నక్సలైట్లని ఊపా కేసులు, పీడి యాక్ట్ కేసులు పెట్టి జైల్లో నిర్బంధించి ఉద్యమాల నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. మేకల వీరన్న యాదవ్, ద్యాగల సారయ్య, సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కె. లింగమూర్తి, నిర్బంధ వ్యతిరేక కమిటీ కో కన్వీనర్ కే రవిచందర్, డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్క అనిల్ గౌడ్, పౌర హక్కుల సంఘం నాయకులు మాదాని కుమారస్వామి, విరసం నాయకులు బాలసాని రాజయ్య, సీపీఐ నాయకులు గడిపె మల్లేష్, చెప్యాల ప్రభాకర్, ఇల్లందుల లక్ష్మణ్ గౌడ్, నాంపల్లి సమ్మయ్య , డాక్టర్ ఎదులపురం తిరుపతి, కోయడ కొమురయ్య, వడ్డేపల్లి మల్లేశం, వెన్న రాజు, బత్తుల చంద్రమౌళి, కుమార్ పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయాన్ని పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : జిల్లా కేంద్రం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని గ్రంథాలయాన్ని మంగళవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. ఇక్కడ అందుబాటులో ఉన్న సౌకర్యాలు, పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, శాశ్వత సభ్యత్వం ఎంత, విద్యార్థులకు ఇచ్చే పుస్తకాలను రిజిస్టర్ మైంటైన్ చేస్తున్నారా లేదా అనే వివరాలను గ్రంథాలయ అధికారిని అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలో స్టోర్ రూమ్ లోని పుస్తకాలను పరిశీలించారు. గ్రంథాలయంలో ఎంతో విలువైన, పురాతనమైన పుస్తకాలు ఉన్నాయన్నారు. వాటిని సరైన పద్ధతిలో భద్రపరచాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పుస్తకాలు చదివేలా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. సుదూరం నుండి విద్యార్థులు చదువుకోవడానికి గ్రంథాలయానికి వస్తారని, మహిళా సంఘాల ద్వారా వారికి అందుబాటులో రూ.20 లకే భోజనం క్యాంటీన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన స్వామి, జిల్లా గ్రంథాలయ అధికారి నవీన్ కుమార్, లైబ్రేరియన్ మృదులామణి అధికారులు పాల్గొన్నారు.

రూ.1.87 కోట్ల విలువ చేసే గంజాయి దహనం చేసిన ఎక్సైజ్ అధికారులు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : రూ.1.87 కోట్ల విలువ చేసే 750 కిలోల గంజాయిని బుధవారం ఎక్సైజ్ అధికారులు దహనం చేశారు. భద్రాచలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 34 కేసుల్లో ఈ గంజాయిని పట్టుబడింది. తల్లాడ మండలం గోపాల్ పేట గ్రామంలోని ఎడబ్ల్యూ ఎమ్ కన్సల్టింగ్ లిమిటెడ్ దహన కేంద్రాంలో ఈ మొత్తం గంజాయిని అధికారులు దగ్ధం చేయించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి అదేశాలిచ్చారు. గంజాయిని దహనం చేసే సమయంలో ఖమ్మం డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, అసిస్టేంట్ కమిషనర్ గణేష్, భద్రాది కొత్తగూడెం ఎక్సైజ్ సూపరిండెంట్ జనాయ్య, భద్రాచలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సీఐ రహీమ్ ఉన్నీషా ప్రత్యక్షంగా ఉన్నారు.

నాణ్యమైన సరకులను విక్రయించి ప్రజల మన్ననలను పొందాలి

విశాలాంధ్ర-కారేపల్లి : నాణ్యమైన సరుకులను విక్రయించి ప్రజల మన్ననలు పొందాలని వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ అన్నారు. బుధవారం సింగరేణి మండల కేంద్రంలో డాక్టర్ రాఘవులు కాంప్లెక్స్ లో డాక్టర్ సామినేని రాఘవులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన వ్యాపార సముదాయం సీతమార్ట్ వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యాపారం సేవా దృక్పథంతో నాణ్యమైన వస్తువులను విక్రయించి వినియోగదారుల అభిమానం చేరగొనాలని,లాభాలు మాత్రమే కాకుండా నాణ్యమైన వస్తు సేవలతో వినియోగదారులకుఎల్లప్పుడు సేవా భావంతో అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్అధినేత డాక్టర్ సామినేనిరాఘవులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రమహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, మాజీ జెడ్పిటిసి సభ్యులు బానోత్ దేవులనాయక్, పార్టీ జిల్లా నాయకులు బానోతురామ్మూర్తి నాయక్, ఇమ్మడి తిరుపతిరావు, గుగులోత్ భీముడునాయక్, సొసైటీ డైరెక్టర్లు అడ్డగోడ ఐలయ్య, బానోత్ హిరాలాల్, దేగల ఉపేందర్,ఎస్సీ సెల్ జిల్లా నాయకులు మేదరి వీరప్రతాప్ (టోనీ), నాయకులు వాంకుడోత్ గోపాల్,బానోత్ రామచందర్, ధారావత్ భద్రునాయక్, పోలగాని శ్రీనివాస్,సపావట్ నాగులు, బానోత్ రాందాస్, బోడ సెత్రామ్, బోడ రవి, అజ్మీర ఈర్య, షబ్బీర్ జానీ, గౌస్, యాకూబ్ అలీ, ఈసాల ఛాయాదేవి, షేక్ మజీద్ పాష తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలు వేధిస్తే షీ టీంకు సమాచారం ఇవ్వండి...

విశాలాంధ్ర - ఖమ్మం : షి టీమ్స్ గూర్చి అవగాహన కార్యమము సోషల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కాలేజ్, కోదాడ క్రాస్ రోడ్ విద్యార్థినులకు అవగాహన కల్పించడం జరిగినది. ఈ కార్యమములో సత్యనారయణ సిఐ షి టీమ్స్ మాట్లాడుతూ, మహిళలు, యువతులు, బాలికలు ఆకతాయిల వలన గానీ, మరే విధమైన వేధింపుల వలన గానీ ఇబ్బందులు ఎదుర్కొంటే షి టీమ్స్ కి సమాచారమివ్వలని తెలిపారు.జిల్లాలో మహిళల రక్షణ కోసం షీటీమ్స్,యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు,మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు.కళాశాల, పాఠశాలల విద్యార్థినులు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ లకు గురైనా,మహిళలు పని చేసే ప్రదేశాల వద్ద వేధింపులకు గురైనా, బాలికలపై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడినా వెంటనే నిర్భయంగా షీ టీమ్ పోలీసులను ఆశ్రయిస్తే సత్వర న్యాయం చేకూరుస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా షీటీమ్స్ ద్వారా మహిళలు సామాజిక మాధ్యమాలైన ఫేస్బుక్, వాట్సాప్, ఇన్స్టాగ్రామ్ వినియోగంలో జాగ్రత్తలు వహించాలని, వాటిలో ఫొటోలు, వీడియోలు పోస్టుచేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధిం చి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.నేరుగా సంప్రదిం చలేని వారు 8712659222ఫోన్ నంబరుకు లేదా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, షి టీం సభ్యులు చక్రధర్ రాజు, కిరణ్, 250 విద్యార్థినిలు హజరైనారు.

ఫిర్యాదు దారుల పట్ల మర్యాదగా మెలగాలి : ఎస్పీ

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబుబాబాద్ : పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా మెలగాలని జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేక అన్నారు. బుధవారం జిల్లాలోని పెదవంగర మండలలో పోలీస్ స్టేషన్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెద్దవంగర పాత పోలీస్ స్టేషన్ను ఇంకొక స్థలానికి మార్చడం జరిగిందని తెలిపారు.పోలీస్ స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు.ఫిర్యాదుదరుల పట్ల మర్యాదపూర్వకము గా మెలగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో తొర్రుర్ డిఎస్పీ కృష్ణ కిషోర్, తొర్రుర్ సీఐ జగదీష్, పెద్దవంగర ఎస్.ఐ క్రాంతి కిరణ్, తొర్రుర్ ఎస్.ఐ ఉపేందర్, దంతాలపల్లి ఎస్. ఐ రాజు, నర్సింహులపేట ఎస్.ఐ సురేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్యాగాలు, పోరాటాల సమ్మిళితమే సీపీఐ

ఖమ్మం జిల్లా కౌన్సిల్‌లో కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : త్యాగాలు, పోరాటాల సమ్మిళతమే భారత కమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. నిర్బంధాలతో మొదలై త్యాగాలు, పోరాటాలతో ఎదిగిందని తెలంగాణ వ్యాపితంగా లక్ష కుటుంబాలు కమ్యూనిస్టుపార్టీ నీడన ఉన్నాయని ఆయన అన్నారు. భారత కమ్యూనిస్టుపార్టీ సిపిఐ ఖమ్మం జిల్లా కౌన్సిల్ సమావేశం బుధవారం పగడాల మల్లేష్ అధ్యక్షతన స్థానిక గిరిప్రసాద్భవన్లో జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సాంబశివరావు మాట్లాడుతూ సిపిఐ ఆవిర్భావంలోనే అనేక నిర్బంధాలు ఎదుర్కొన్నదని, దేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ కమ్యూనిస్టులు అనేక పోరాటాలు చేశారని బ్రిటీష్కు వ్యతిరేకంగా భారతదేశ సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపు నిచ్చింది కమ్యూనిస్టులే నన్నారు. కమ్యూనిస్టులు లేకుంటే ప్రస్తుత కశ్మీర్‌ల భారతదేశ నడిబొడ్డున తెలంగాణ రగులుతునే ఉండేదని సాంబశివరావు పేర్కొన్నారు. 4 వేల మంది బలిదానం తెలంగాణ స్వరూపాన్ని, జీవన శైలిని మార్చడంతోపాటు పేదల తెలెత్తుక బ్రతికేలా చేసిందన్నారు. జమిందారులు, జాగీరుదారీ వ్యవస్థలు పోయి పేదలకు భూమి దక్కిందని అదికమ్యూనిస్టుపార్టీ పోరాట ఫలితమేనన్నారు. 99 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్తానం కమ్యూనిస్టుపార్టీ కార్మికుల, కర్షకుల, మహిళలు, యువజన, విద్యార్థుల పక్షాన అనేక పోరాటాలు నిర్వహించి అపూర్వవిజయాలు అందుకొని ఎందరికో బాసటగా నిలిచిందన్నారు. అనేక మంది వీరుల త్యాగాలపైన కమ్యూనిస్టుపార్టీ నిర్మతమైనదని ఇక ముందుకూడా ఆదిశగానే కమ్యూనిస్టుపార్టీ ప్రయాణం సాగుతుంద న్నారు. డిశంబర్ 26 నుండి జరుగనున్న వందేళ్ళ సంబురంలో పార్టీ విస్తరణే లక్ష్యంగా కార్యచరణ రూపొందించినట్లు సాంబశివరావు తెలిపారు. మారిన రాజకీయ పరిస్థితులు, పాలకుల తీరు, ఆర్థిక అంతరాలు, కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తుచేస్తున్నాయని కమ్యూనిస్టుల అవసరాన్ని ప్రజలు కోరుకుంటున్న నేపద్యంలో వారి అవసరాలకనుగుణంగా పార్టీని విస్తరిస్తూ బలోపేతం చేస్తామన్నారు. గ్రామ గ్రామన వందేళ్ళ ఉద్యమ చరిత్ర వివరిస్తూ నూతన శక్తులను, వ్యక్తులను పార్టీ ఉద్యమం వైపు ఆకర్షిస్తూ యువతను కార్యోన్ముకులను చేస్తూ ఏడాదిపొడువునా కార్యక్రమాలు నిర్వహిస్తామని సాంబశివరావు తెలిపారు. వందేళ్ళ సంబుర సభ నల్లగొండలో డిశంబర్ 30న జరుగనున్నదని ఆ తరువాత తెలంగాణ రాష్ట్ర వ్యాపితంగా సంబురాలు మొదలవుతాయని ఆయన తెలిపారు. ఖమ్మం జిల్లాలో ప్రతీ చెట్టుకు, పుట్టకు, ప్రతి ఇంటికి ఉద్యమ చరిత్ర ఉన్నదని ఆ చరిత్రను నేటి తరాలకు తెలియజెప్పటమే లక్ష్యంగా ఖమ్మం జిల్లా సమతి ముందుకు సాగలని ఆయన తెలిపారు. దేశంలో బీజేపీ పాలనలో మంచిఏమి జరుగకపోగా అనేక ప్రజా వ్యతి రేక విధనాలు చోటు చేసుకున్నాయన్నారు. ఆర్థిక అంతరాలు పెరిగి సంపద ప్రాగు పడుతుందని ఇది భవిష్యత్లో లో అరాచకానికి దారితీస్తుందని ఆయన హెచ్చరించారు. బీజేపీ అభివృద్ధిని మరచి మతాన్ని నమ్ముకున్నదని మత ప్రాతిపదికనే ప్రభుత్వ కార్యకలాలపాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. మతం అధికారం కార్పోరేట్ సంపద కలగలిసి దేశాన్ని పాలిస్తున్నాయని కూనంనేని తెలిపారు. కాంగ్రెస్పార్టీ ప్రజా వ్యతిరేకతను దేశవ్యాపితంగా సొమ్ముచేసుకోవడంలో వైఫల్యం చెందుతుందన్నారు. సి.పి.ఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు వందేళ్ళ సంబుర కార్యక్రమాలను వివరించగా, జిల్లాలోజరిగిన పార్టీ కార్యక్రమాల నివేదికను జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ప్రవేశపెట్టారు. సి.పి.ఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోకమీషన్ చైర్మెన్ మహ్మద్ మౌలానా, డి.హెచ్.పి.ఎస్. రాష్ట్ర అధ్యక్షులు ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

వేగంగా జర్నలిస్టుల ఇళ్ళ స్థలాల పక్రియ...

విశాలాంధ్ర - ఖమ్మం ప్రభాత వార్త ప్రత్యేక ప్రతినిధి : ఖమ్మం నియోజక వర్గంలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు దక్కే పక్రియను మరింత వేగవంతం చేయాలని బుధవారం ఖమ్మం నగరంలో జెడ్పి అతిథిగ్రహంలో జరిగిన స్థంభాద్రి జర్నలిస్ట్ హౌజింగ్ సోసైటీ ,రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన మూడు జర్నలిస్టు యూనియన్ల సంయుక్త సమావేశం నిర్ణయించింది .జర్నలిస్ట్ సోసైటీ చైర్మన్ కనకం సైదులు అధ్యక్షన జరిగిన ఈ సమావేశంలో టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, టియుడబ్ల్యుజె (టిజెఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, టిడబ్ల్యుజెఎఫ్ అధ్యక్షులు పల్లా కోండల్ రావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సోసైటీ ద్వారా వీలైనంత తొందరగా అర్హులైన జర్నలిస్టులకు సభ్యత్వం ఇవ్వడం గురించి, ప్రభుత్వం కేటాయించిన స్థలాన్నికి నగదు జమ అంశంపై చర్చించారు. వీలైనంత త్వరగా అర్హులైన వారికి సభ్యత్వాలను చెల్లించాలని ఈ సమావేశం ఏకగ్రీవంగా తీర్మాణించింది సొసైటి పాలకవర్గం, మూడు జర్నలిస్టు సంఘాలు ఉమ్మడిగా, ఐక్యంగా కలిసి పనిచేసి జర్నలిస్టుల అకాంక్షను వీలైనంత తొందరగా నేరవేర్చేందుకు క్రీయాశీలంగా పనిచేయాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు డైరెక్టర్లు మాట్లాడ్తూ జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు అందడమే లక్ష్యంగా మూడు యూనియన్లు సోసైటీకి వెన్నుదన్నుగా నిలబడటం అభినందనీయమని పేర్కోన్నారు. మూడు ప్రధాన జర్నలిస్టు సంఘాలు సొసైటి వెనక నిలబడటం సొసైటికి కొండంత బలాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సోసైటి డైరెక్టర్లతో పాటు టియుడబ్ల్యుజె (ఐజెయు) ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర నాయకులు సర్వనేని వెంకట్రావ్, టియుడబ్ల్యుజె (టిజెఎఫ్) జిల్లా కార్యదర్శి చిర్రా రవి, సొసైటి సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక సాధికారత కోసమే కులగణన : ఎమ్మెల్యే కోరం

ఇల్లందు - విశాలాంధ్ర : సమాజంలో సామాజిక న్యాయం చేయడం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన సర్వేను చేపట్టిందని ఈ కార్యానికి ప్రజలందరూ సహకరించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. బుధవారం ఇంటింటికి కుటుంబ సర్వే మొదటి రోజున 10వ వార్డులో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ప్రతి పథకాన్ని కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తుందన్నారు. అందులో భాగంగా గడచిన ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మేరకు కులగణన సర్వేను చేపట్టిందని వివరించారు. నమోదు చేయనున్న 75 అంశాలతో కూడిన వివరాలను ఎన్యుమరేటర్లకు స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరూ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, మేనేజర్ అంకుల్ షావలి, ఆర్ఐ శ్రీనివాస్, మున్సిపల్, మెప్మా, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐటీయూసీపై ఆరోపణలు మనుకోవాలి

ఇల్లందు - విశాలాంధ్ర : సింగరేణి కార్మికుల వద్ద ఎలాంటి అనుమతి లేకుండా ఏఐటీయూసీ బోనస్ లాభాల్లో రూ.500 లచందా రికవరీపై ఐఎన్టీయూసీ నేతలు చేస్తున్న తప్పుడు ఆరోపణలు సరికాదని యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే.సారయ్య, బ్రాంచి కార్యదర్శి ఎండి. నజీర్ అహ్మద్ బుధవారం ప్రకటనలో అభ్యంతరం. ప్రతి ఏటా సింగరేణి ఏరియా కార్మికులకు పిఎల్ఆర్ బోనస్ లో భాగంగా ఆనవాయితీగా ఏఐటీయూసీ యూనియన్ కు చందాతో స్వచ్ఛందంగా సహకరించారని గుర్తుచేశారు. తమ యూనియన్ పట్ల కార్మికుల ఆదరణను ఓర్వలేకే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాగా కొన్ని టెక్నికల్ కారణాల వల్ల యూనియన్ చందా టెంపుల్ కోడ్ ద్వారా రికవరీ చేశామని స్పష్టం చేశారు. దిక్కుతోచక మిడిమిడి జ్ఞానంతో ఐఎన్టియుసి నాయకులు కొంతమంది కార్మికులను తప్పు దోవపట్టిస్తున్నారని ఆరోపించారు. అధికారంలోనైనా ప్రతిపక్షమైన కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడతామన్నారు. అభ్యంతరకర నిందారోపణలు మానుకోవాలని హితవు పలికారు.

పేద విద్యార్థినికి బీవీకే సహాయం...

విశాలాంధ్ర - ఖమ్మం : ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన వైరా మున్సిపాలిటీ పరిధిలోని దుద్దేపూడి గ్రామానికి చెందిన అత్యంత నిరుపేద విద్యార్థిని పి హర్షితకు వైద్య విద్య ఎంబీబీఎస్ కోర్సు చదవడానికి అవసరమైన 90 వేల రూపాయల పాఠ్యపుస్తకాలను బోడేపూడి విజ్ఞాన కేంద్రం వారు టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కే గీత సహకారంతో ఉచితంగా అందజేశారు ఈ కార్యక్రమంలో బోడెపుడి విజ్ఞాన కేంద్రం మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు టి శివన్నారాయణ ఎస్.కె అఫ్జల్ మియా సిపిఎం వైరా మండల నాయకులు పారుపల్లి శ్రీనాథ్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు షమ్మీ విద్యార్థిని తాత కొనకంచి జోజి పాల్గొన్నారు.

సమగ్ర ఇంటింటి సర్వేకు సహకరించండి

విశాలాంధ్ర - పినపాక : పినపాక మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, భూమి, రుణాలు, స్థిరాస్తుల సహా పలు అంశాలపై ఎన్యుమరేటర్లు వివరాలు సేకరిస్తున్నారు. బుధవారం పినపాక మండలంలో ఉపాధ్యాయులతో పాటు సెక్రటరీలు వివిధ శాఖల అధికారులు ఇంటింటికీ తిరిగి వివరాలు నమోదు చేస్తున్నారు. 10 మంది ఎన్యుమరేటర్లకు ఒక పరిశీలకుడిని నియమించారు. 10 శాతం కుటుంబాలను వీరు మరోసారి సర్వే చేస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం టార్గెట్ పెట్టింది. దింతో సర్వే ముమ్మరంగా కొనసాగుతున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ అద్దంకి నరేష్ తెలిపారు. ఈనెల 8 వరకు మూడు రోజులపాటు ఇండ్ల జాబితా నమోదు (హౌస్‌లిస్టింగ్) కార్యక్రమం చేపట్టనున్నారని గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామం (ఆవాసం) పేర్లను కోడ్ రూపంలో సేకరిస్తారన్నారు. 56 ప్రధాన ప్రశ్నలు, 19 అనుబంధ ప్రశ్నలు కలిపి మొత్తం 75 ప్రశ్నలకు సంబంధించిన సమాచారం సేకరిస్తారన్నారు. ప్రతి ఒక్కరు ఎన్యుమరేటర్‌కు సరైన సమాధానం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ సమ్మయ్య, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఏపీవో వీరభద్ర స్వామి, ఏపీఎం జ్యోతి, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు బాలకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

అపోలో హాస్పిటల్‌లో 'మైక్రోవాస్కులర్ రీప్లాంటేషన్ శస్త్రచికిత్స' విజయవంతం

హైదరాబాద్: అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో మొదటిసారి అత్యంత కష్టమైన 'మైక్రోవాస్కులర్ రీప్లాంటేషన్ శస్త్రచికిత్స'ను విజయవంతంగా పూర్తి చేశారు. ఇంత పెద్ద ప్రాక్సిమల్ లింబ్ రీఅటాచ్‌మెంట్ చేయడం ఇదే తొలిసారి. రోగి 26 రోజులలో కోలుకోనున్నారు. వేళ్లు కదలిక మరింత మెరుగుపరిచేందుకు ఆరు నెలల్లో అదనపు శస్త్రచికిత్సలు చేయనున్నారు. ఈ మైక్రోవాస్కులర్ రీప్లాంటేషన్ శస్త్రచికిత్స ఆధునిక ట్రామా కేర్‌లో అపోలో నాయకత్వానికి నిదర్శనంగా నిలిచింది. ఇది తీవ్ర గాయాలతో ఉన్న రోగులకు ఆశలను చిగురింప చేస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని అపోలో హాస్పిటల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అపోలో హాస్పిటల్స్ (హైదరాబాద్) కన్సల్టెంట్ హ్యాండ్, రిస్ట్, రీకన్స్ట్రక్టివ్ మైక్రోసర్జన్ డాక్టర్ జీఎస్ బండారి మాట్లాడుతూ 'మంచిర్యాలకు చెందిన ఏ పవన్ కుమార్ కుడి మోచేయి విరిగి పోయింది. ప్రాక్సిమల్ హ్యూమరస్‌లో గ్రేడ్ 3సీ విరిగిన గాయాలతో అపోలో హాస్పిటల్స్ హైదరాబాద్‌లో అక్టోబర్ 11వ తేదీన చేరారు. ఈయన వయస్సు 32. ఇది భుజం మోచేయిని కలుపుతూ ఉన్న భాగం. రీప్లాంటేషన్ కోసం కీలకమైన 4 నుంచి 6 గంటల 'గోల్డెన్ అవర్' సమయం దాటింది. అయినా, అపోలో వైద్య బృందం వేగంగా స్పందించింది.

ఉత్కర్ష ఎస్ఎఫ్బీ సస్టైనబిలిటీ రిపోర్ట్ విడుదల

హైదరాబాద్: ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ 2023-24 ఆర్థిక సంవత్సరానికి తన తొలి సస్టైనబిలిటీ రిపోర్ట్‌ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. పర్యావరణ, సామాజిక పాలన సూత్రాలను దాని ప్రధాన కార్యకలాపాలలో ఏకీకృతం చేసే దిశగా బ్యాంక్ యొక్క ప్రయాణంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందనీ బ్యాంకు డైరెక్టర్ గోవింద్ సింగ్ చెప్పారు. యూ సస్టైన్ పేరుతో రూపొందించబడిన ఈ సమగ్ర నివేదిక, స్థిరమైన అభివృద్ధి మరియు బాధ్యతాయుతమైన బ్యాంకింగ్‌ను ప్రోత్సహించడంలో బ్యాంక్ యొక్క వ్యూహాత్మక కార్యక్రమాలు, విజయాలను హైలైట్ చేస్తుందన్నారు.ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌లో, స్థిరమైన బ్యాంకింగ్ అనేది ఒక బాధ్యత మాత్రమే కాకుండా మా వాటాదారులకు దీర్ఘకాలిక విలువను సృష్టించే మార్గం అని మేము నమ్ముతున్నామన్నారు.

పావ్నా ఇండస్ట్రీస్ నక్షత్ర ఆదాయాల వెల్లడి

విశాలాంధ్ర - హైదరాబాద్: ఫ్లేయర్ పావ్నా ఇండస్ట్రీస్ లిమిటెడ్, 28 అక్టోబర్ 2024న జరిగిన బోర్డు మీటింగ్‌లో ఆడిట్ చేయని ఆర్థిక ఫలితాలను ఆమోదించిందనీ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. 30 సెప్టెంబర్ 2024తో ముగిసిన త్రైమాసికంలో (స్టాండలోన్), కంపెనీ కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం రూ. 7952.26 లక్షలు, 16 శాతం పెరుగుదల అన్నారు.ముందుగా, కన్వర్టిబుల్ వారెంట్ల ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా 410.81 కోట్ల వరకు నిధులను సమీకరించదానికి తమ బోర్డు ఆమోదించినట్లు కంపెనీ ప్రకటించిందన్నారు. ప్రతిపాదిత కేటాయింపుల్లో ఎఫ్ఐఐలు యునికో గ్లోబల్ ఆపర్చునిటీస్ ఫండ్ లిమిటెడ్, నెక్స్‌పాక్ట్ లిమిటెడ్, నార్త్ స్టార్ ఆపర్చునిటీస్ ఫండ్ విసిసి, ఎమినెన్స్ గ్లోబల్ ఫండ్ పిసిసి, ఏజీ డైనమిక్ ఫండ్స్ లిమిటెడ్.సభ్యులు, ఇతర వర్తించే అనుమతులకు లోబడి కంపెనీ చెల్లించిన ఈక్విటీ మూలధనం/ఓటింగ్ హక్కులలో 49 శాతం వరకు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల హోల్డింగ్ పరిమితిని పెంచడాన్ని బోర్డు ఆమోదించిందన్నారు.

విశ్వసించగల రియల్ ఎస్టేట్ బ్రాండ్‌గా బీబీజీ

హైదరాబాద్: రియల్ ఎస్టేట్ రంగంలో విశ్వసించగల బ్రాండ్ బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్ (బీబీజీ) అని సంస్థ సీఎండీ ఎంవీ మల్లికార్జున రెడ్డి తెలిపారు. బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్ 2007లో స్థాపించబడిందన్నారు. హైదరాబాద్‌లో ప్రధాన కార్యాలయం కలదన్నారు. ప్లాట్ డెవలప్‌మెంట్‌లో హైపర్ స్పెషలైజ్డ్ ఆర్గనైజేషన్‌గా స్థిరపడిందన్నారు. ఇది భారతీయులు భూమిపై పెట్టుబడి పెట్టే విధానాన్ని మారుస్తుందన్నారు. 21 క్లస్టర్లలో 240 ప్రాజెక్ట్‌లతో 1.4 లక్షల కస్టమర్లకు భూమి రూపంలో నిజమైన సంపదను అందిస్తుందన్నారు. ఇరవై వేల వ్యాపార సహచరుల ఆర్థిక స్వాతంత్ర్యానికి దోహదపడిందని పేర్కొన్నారు. మూడు వందల మంది ఉద్యోగుల కెరీర్ వృద్ధిని ప్రోత్సహించిందన్నారు. విద్య ద్వారా రెండు లక్షల మంది బాలికలకు సాధికారత కల్పించామని తెలిపారు. షాద్‌నగర్, సదాశివపేట, యాదగిరిగుట్ట, షాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, ఖమ్మం, నెల్లూరు, ఒంగోలు తదితర ప్రాంతాలలో విస్తరించిందన్నారు.

స్పార్క్స్ ఆటమ్ వింటర్ 2024 కలెక్షన్ సిద్ధం

ముంబయి: భారతదేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న, యువత ఎక్కువగా ఇష్టపడుతున్న నమ్మకమైన బ్రాండ్ స్పార్క్స్. ఆటమ్-వింటర్ 2024 కోసం స్పార్క్స్.. సరికొత్త స్నీకర్స్ కలెక్షన్‌ను లాంచ్ చేసింది. ఇప్పటి యువత ఎప్పటికప్పుడు సరికొత్త ట్రెండ్స్‌ని ఫాలో అవుతుంది. వారి అభిరుచులకు అనుగుణంగా కట్టింగ్ ఎడ్జ్ స్టైల్, అనితర సాధ్యమైన కంఫర్ట్... రెంటిని జోడించి సరికొత్త స్నీకర్స్ కలెక్షన్‌ను రూపొందించింది. ఇంకా చెప్పాలంటే ఈ సీజన్ కు హీరో లాంటివి ఈ సరికొత్త స్నీకర్ కలెక్షన్. ఎందుకంటే ఇందులో పురుషుల కోసం బోల్డ్ డిజైన్స్ ఉంటాయి. అలాగే మహిళల కోసం వారి వ్యక్తిత్వాన్ని ప్రతింబించే డిజైన్స్, సరికొత్త ఆవిష్కరణలను ఆధారంగా రూపొందించారు. హై అండ్ మైండ్ యాంకిల్స్ నుంచి ఫ్లాట్ సోల్స్ మరియు లో యాంకిల్స్ వరకు.. ఈ సరికొత్త స్నీకర్స్ మీ స్టైల్ మరియు ఫ్యాషన్ స్టేట్ మెంట్ ను మరింత కొత్తగా చాటిచెప్తాయి. మీరు మీ నగరం రోడ్లమీద నడుస్తున్న సమయంలో లేదా మీ ఫ్రెండ్స్ తో సరదాగా ఉన్నప్పుడు మరి ఒక్కరూ తలతిప్పి మిమ్మల్ని చూసేలా చేస్తాయి స్పార్క్స్ యొక్క సరికొత్త స్నీకర్స్ కలెక్షన్.

టాటా మోటార్స్‌తో ఇండియన్ బ్యాంక్ అవగాహన ఒప్పందం

ముంబై: భారతదేశంలోని ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఒకటైన ఇండియన్ బ్యాంక్ వాణిజ్య వాహన కస్టమర్లు, అధీకృత డీలర్‌షిప్‌లకు ఆకర్షణీయమైన ఫైనాన్సింగ్ సొల్యూషన్‌లను అందించడం కొరకు భారతదేశపు అతిపెద్ద వాణిజ్య వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దేశవ్యాప్తంగా. సరసమైన వడ్డీ రేట్లు స్ట్రీమ్‌లైన్డ్ క్రెడిట్ ప్రాసెసింగ్‌తో అనుకూలీకరించిన ఆర్థిక ప్యాకేజీలను బ్యాంక్ అందిస్తుంది. ఈ భాగస్వామ్యం వారి ఎల్ఎన్‌జీ (లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్), ఎలక్ట్రిక్ శ్రేణితో సహా టాటా మోటార్స్ మొత్తం వాణిజ్య వాహన పోర్ట్‌ఫోలి యోలో తగిన ఆర్థిక పరిష్కారాలను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. అదనంగా, టాటా మోటార్స్ మరియు ఇండియన్ బ్యాంక్ డీలర్ ఫైనాన్సింగ్‌పై తమ సహకారాన్ని గణనీయంగా విస్తరించాలని యోచిస్తున్నాయి, కంపెనీ వాణిజ్య వాహనాల కార్యకలాపాలకు ఆర్థిక పర్యావరణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని ఇండియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశుతోష్ చౌదరి తెలిపారు.

బజాజ్ ఫిన్‌సర్వ్ ఏఎంసీ 'బజాజ్ ఫిన్‌సర్వ్ కన్సప్షన్ ఫండ్' ప్రారంభం

ముంబై/పుణె: బజాజ్ ఫిన్‌సర్వ్ ఏఎంసీ బజాజ్ ఫిన్‌సర్వ్ కన్సప్షన్ ఫండ్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇది కన్సప్షన్ థీమ్‌ను అనుసరించి ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ స్కీమ్. ఈ ఫండ్ నవంబర్ 8న సబ్‌స్క్రిప్షన్ కోసం తెరవబడుతుంది కొత్త ఫండ్ ఆఫర్ వ్యవధి 22 నవంబర్ 2024న ముగుస్తుంది. బజాజ్ ఫిన్‌సర్వ్ కన్సప్షన్ ఫండ్ అనేది ట్రూ-టు-లేబుల్ ఫండ్, ఇది అభివృద్ధి చెందుతున్న కన్సప్షన్ మెగాట్రెండ్‌లతో సమలేఖనం చేయబడిన రంగాలలో వ్యూహాత్మకంగా పెట్టుబడి పెడుతుంది. ఇవి భారతదేశం అంతటా కన్సప్షన్ అలవాట్లను రూపొందించే ప్రభావవంతమైన మెగాట్రెండ్‌లు. ఈ మార్పుల తరంగంలో, ఎఫ్ఎంసీజీ, ఆటోమొబైల్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, కన్స్యూమర్ గూడ్స్, హెల్త్‌కేర్, రియల్టీ, టెలికాం, పవర్, సర్వీసెస్ వంటి రంగాలలో అవకాశాలను గుర్తించడం ఈ ఫండ్ లక్ష్యం.పొటన్షియల్ గ్రోత్ స్టోరీలను గుర్తించడం ద్వారా అభివృద్ధి చెందుతున్న కన్సప్షన్దారుల విజృంభణ నుండి ప్రయోజనం పొందే సంస్థలపై ఫండ్ దృష్టి సారిస్తుంది. ఇది మార్కెట్ క్యాప్-ఆగ్నోస్టిక్ విధానాన్ని అనుసరిస్తుంది, వివిధ మార్కెట్ క్యాపిటలైజేషన్‌లలో పెట్టుబడి పెట్టడానికి సౌలభ్యాన్ని అందిస్తుంది.

నిజ-సమయ ట్రాకింగ్ సేవల్లో ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ ముందంజ

ముంబై: విదేశాలకు పంపిన డబ్బు కోసం స్విఫ్ట్‌తో కలిసి నిజ-సమయ ట్రాకింగ్ సేవను అందించే మొదటి భారతీయ బ్యాంక్‌గా ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ అవతరించింది. ఇది బ్యాంక్ అవార్డు గెలుచుకున్న మొబైల్ అప్లికేషన్ మరియు ఇంటర్నెట్ బ్యాంకింగ్ ప్లాట్‌ఫారమ్‌లలో అందుబాటులో ఉంది. ఇది భారతీయ బ్యాంకింగ్ పరిశ్రమలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది, సౌకర్యవంతమైన, సమర్థవంతమైన బ్యాంకింగ్ పరిష్కారాలను అందించడంలో బ్యాంక్ నిబద్ధతను ప్రదర్శిస్తూ, దాని "కస్టమర్ ఫస్ట్" విధానాన్ని పునరుద్ఘాటిస్తుంది. భారతదేశంలోని కస్టమర్‌లు యుపిఐ లేదా ఐఎంపిఎస్ ద్వారా డిజిటల్ చెల్లింపులకు రియల్ టైమ్ స్టేటస్ అప్‌డేట్‌లు, ట్రేస్‌బిలిటీని డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లతో పొందవచ్చు. అయితే, విదేశాలకు పంపిన డబ్బు విషయానికి వస్తే అదే లేదు. కస్టమర్‌లు తమ ఫుడ్ డెలివరీ లేదా పార్శిల్‌ని ఎండ్ టు ఎండ్ ట్రాకింగ్‌ని ఆశించడంతో, ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ క్రాస్-బోర్డర్ పేమెంట్‌ల వంటి కీలకమైన సేవను అందించడంలో ముందుంది.

అక్టోబర్ 2024 సేల్స్‌లో నెంబర్‌వన్ ఎలక్ట్రిక్ కారుగా ఎంజి విండ్సర్

ముంబయి: జేఎస్ డబ్ల్యూ ఎంజి మోటార్ ఇండియా తమ ఇటీవల విడుదల చేసిన భారతదేశపు మొదటి ఇంటెలిజెంట్ సియువి ఎంజి విండ్సర్ కోసం అక్టోబర్ 2024లో గణనీయమైన సేల్స్‌ను నమోదు చేసింది. కంపెనీ 3116 సియువిల యూనిట్లను విక్రయించింది, ఇది అక్టోబర్‌లో మొత్తం ప్యాసింజర్ ఎలక్ట్రిక్ కార్ సేల్స్‌లో సుమారు 30%గా ఉంది. కంపెనీ 31% వైఓవై సాధించింది, అక్టోబర్ 2024లో 7045 యూనిట్లను విక్రయించింది, కంపెనీ ఆరంభమైన నాటి నుండి అత్యధిక సేల్స్ గణాంకాలు ఇవి. పరిశుభ్రమైన భవిష్యత్తు కోసం సుస్థిరమైన సంచార పరిష్కారాల పైన కారు తయారీదారు చురుకైన కేంద్రీకరణ సంస్థ ఎన్ఈవీ పోర్ట్ ఫోలియో అక్టోబర్‌లో, ఎం-ఓ-ఎం, గణనీయంగా సేల్స్ వృద్ధికి చేసిన తోడ్పాటుతో ప్రోత్సాహకర ఫలితాలను ఇస్తున్నాయి. ఎన్ఈవీలు జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా వారి మొత్తం సేల్స్‌లో 70% తోడ్పాటు అందించాయి, కస్టమర్లలో కంపెనీ ఎలక్ట్రిక్ వెహికిల్ పోర్ట్ ఫోలియోకు ఉన్న ఆదరణలో వేగవంతమైన పెంపుదలను చూపించాయి.

'పద్మరాగ రెస్టారెంట్ అండ్ బాంక్వెట్' ప్రారంభం

హైదరాబాద్: భోజన ప్రియులకు నోరూరించే ఆహార పదార్థాలు అందించడమే లక్ష్యంగా కొంపల్లిలోని డీమార్ట్ వద్ద ఆధునికరించిన 'పద్మరాగ రెస్టారెంట్ అండ్ బాంక్వెట్'ను ఆదర్శ ఫౌండేషన్‌కు చెందిన అనాథ పిల్లల చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం పిల్లలకు స్కూల్ బ్యాగ్స్, యూనిఫామ్స్, పుస్తకాలు, షూస్ పంపిణీ చేశారు. పిల్లలకు రెస్టారెంట్‌లోని రుచికరమైన వివిధ రకాల వంటకాలను వడ్డించారు. ఈ సందర్భంగా పద్మరాగ గ్రూప్ ఆఫ్ రెస్టారెంట్స్ డైరెక్టర్ సంతోష్ రెడ్డి మాట్లాడుతూ ఈ రెస్టారెంట్ ఆహార ప్రియులను ఆకట్టుకుంటుందన్నారు. ఆదర్శ ఫౌండేషన్ చిన్నారులు రెస్టారెంట్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

విశాలాంధ్ర

సంపాదకీయం

ప్రధాన న్యాయమూర్తి తప్పటడుగులు

అధికారాంతంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అన్నీ తప్పటడుగులే వేస్తున్నట్టున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని వినాయక చవితి పూజకు ఆహ్వానిస్తే తప్పేమిటి అని ఎదురు ప్రశ్న వేస్తున్నారు. రాజకీయ నాయకులను న్యాయమూర్తులు కలుసుకునే సందర్భాలు రావచ్చు. అధికారిక కార్యక్రమాల్లో ఇది అనివార్యం. లేదా పెళ్లిళ్ల లాంటి కార్యక్రమాల్లో పరస్పరం తారసపడొచ్చు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు పెళ్లిళ్లకు పేరంటాలకు వెళ్లకూడదని లేదు. అక్కడ ఇతరులూ ఉంటారు కనక ఎవరూ ఆక్షేపించరు. కానీ వారికి వృత్తి రీత్యానే కొన్ని కట్టుబాట్లు ఉంటాయని, స్వేచ్ఛగా ఎక్కడికిపడితే అక్కడికి వెళ్లడానికి వీలుండదని ప్రధాన న్యాయమూర్తికి ఇప్పటికీ తట్టకపోవడం ఆశ్చర్యకరమే. పైగా తన నడవడికను సమర్థించుకోవడానికా అన్నట్టు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నిర్వహించే "అడ్డా" అనే కార్యక్రమంలో పాల్గొని తాను చేసిన పనిని ఆయన సమర్థించుకున్నారు. సాధారణంగా న్యాయమూర్తులు అందరితో కలివిడిగా ఉండరు. సభలు, సమావేశాల్లో విరివిగా పాల్గొనరు. ఉపన్యాసాలకు లంకించుకోరు. వారు మాట్లాడదలచుకున్నది వారి తీర్పుల ద్వారానే వ్యక్తం కావడం రివాజు. న్యాయమూర్తులకు సొంత అభిప్రాయాలు, సిద్ధాంతాలూ ఉండొచ్చు. కానీ వృత్తిరీత్యా వారు ఇచ్చే ఏ తీర్పు అయినా రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలి. చట్టాలను విడమర్చే రీతిలో ఉండాలి. ఇది చాలా కాలంగా కొనసాగుతున్న సంప్రదాయం. అనేక మంది న్యాయమూర్తులు ఈ ఆనవాయితీని పాటించారు. ప్రధానమంత్రిని తన ఇంటికి ఆహ్వానించడాన్ని "అడ్డా" కార్యక్రమంలో సమర్థించుకోవడం విచిత్రమే. అయోధ్య వివాదంలో తీర్పు చెప్పిన అయిదుగురు న్యాయమూర్తులలో అప్పటి ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్, ఎస్.ఎ.బోబ్డే, డి.వై.చంద్రచూడ్, అశోక్ భూషణ్, ఎస్.అబ్దుల్ నజీర్ ఉన్నారు. సాధారణంగా తీర్పు ఏకాభిప్రాయంతోనే వెల్లడైనా అందరు న్యాయమూర్తులు కలిసి రాకుండా ఎవరో ఒకరు ఆ బాధ్యత తీసుకుంటారు. తీర్పు రాసిన న్యాయమూర్తి దాని మీద సంతకం చేస్తారు. విచిత్రం ఏమిటంటే ఆ తీర్పుపై ఏ న్యాయమూర్తి సంతకమూ లేదు. కానీ అయోధ్య విషయంలో ఏం తీర్పు ఇవ్వాలోనన్న క్లిష్ట సమస్య ఎదురైనప్పుడు తాను భగవంతుడిని ప్రార్థించానని, భగవదాజ్ఞ ప్రకారమే తీర్పు చెప్పానని చంద్రచూడ్ అనడాన్నిబట్టి ఆయనే ఆ తీర్పు రాశారనుకోవాలి. ఆ తీర్పు వల్ల బాబరీ వివాదం ఓ కొలిక్కి వచ్చి ఉండొచ్చు. ఆ తీర్పు వెలువరించినప్పుడు న్యాయమూర్తులు బాబరీ మసీదును కూల్చడం కిరాతకం అని వ్యాఖ్యానించారు. కానీ తీర్పు ఈ అభిప్రాయానికి ఆమడ దూరంలో కూడా లేదు. అసలు ఆ వివాదమే ఓ సివిల్ కేసు. అది కేవలం స్థల వివాదం. అక్కడ నాలుగు వందల ఏళ్లకు పై నుంచి ఉన్న బాబరీ మసీదును కూల్చేశారు. ఆ స్థలం ముస్లింలది కాదని భావించి ఆ స్థలాన్ని హిందువులకు అప్పగించిన తీరే విస్మయం కలిగిస్తోంది. అక్కడితో ఆగకుండా ఏదో తాయిలం పెట్టినట్టు ముస్లింలు మసీదు కట్టుకోవడానికి ఐదెకరాల స్థలం కేటాయించాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించడం విచిత్రాల్లోకెల్లా విచిత్రం. దైవాజ్ఞ ప్రకారం తీర్పు వెలువరించినట్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ చెప్పడం అత్యంత ఆశ్చర్యకరం. తీర్పులు చట్టాలకు, రాజ్యాంగానికి అతీతంగా ఉండడం అంటే న్యాయమూర్తులు తమ కర్తవ్యాన్ని నెరవేర్చనట్టే లెక్క. చంద్రచూడ్ దేవుడిని ప్రార్థించి దైవాజ్ఞ ప్రకారం తీర్పు చెప్తే ఆయన కచ్చితంగా ఏదో హిందూ దేవుడినే ప్రార్థించి ఉంటారు. అదే బెంచిలో ఉన్న అబ్దులు నజీర్ కూడా భగవంతుడిని ప్రార్థించి తీర్పు చెప్పాల్సి వచ్చిందని మాట వరసకు అనుకుందాం. ఆ బెంచీలో ఉన్న అబ్దుల్ నజీర్ ఏ దేవుడిని ప్రార్థించాలి. కచ్చితంగా ఆయన అల్లాను ప్రార్థించేవారే కదా. రెండు మతాలకు మధ్య ఉన్న వివాదాన్ని పరిష్కరించడానికి ఒక మతానికి సంబంధించిన దేవుడినే ప్రార్థించడం అంటే రెండవ మతం వారి దేవుడి మాటకు విలువే లేనట్టు కదా!

ఈ దేశం సెక్యులర్ విధానాలను అనుసరిస్తుంది అని రాజ్యాంగ పీఠికలో పేర్కొన్నాం. అంటే సెక్యులరిజం అన్న మాటను అద్వానపు అడవిలో వదిలేసి నట్టేనా! అయినా ఏ తీర్పులోనైనా మత ప్రస్తావన ఎందుకు రావాలి. తన మతానికి అనుగుణంగా తీర్పు చెప్పే అధికారం ఏ న్యాయమూర్తికైనా ఉంటుందా? దీన్నిబట్టి ప్రధాన న్యాయమూర్తి హిందూ మతానికి అనుగుణంగా వ్యవహరించారనుకోవాల్సి వస్తుంది. రాజ్యాంగంలోని ఏ సూత్రం దీనికి అనుమతిస్తుందో తెలియదు. మన రాజ్యాంగం ప్రకారం మతం వ్యక్తిగత వ్యవహారమే తప్ప ప్రభుత్వ కార్యకలాపాల్లో గానీ, న్యాయస్థానాల తీర్పుల్లోగానీ మతం ప్రసక్తే ఉండకూడదు. అయితే అదే సమయంలో న్యాయమూర్తులకు తమ తమ మతాల్లో విశ్వాసం ఉండవచ్చు. ఆ విశ్వాసం వ్యక్తిగతమే తప్ప తీర్పులకు ఆధారం కాకూడదు. ఈ విషయాన్ని గమనంలోకి తీసుకోకుండా ప్రధాన న్యాయమూర్తి "అడ్డా" కార్యక్రమంలో తాను చేసిన పనులను సమర్థించుకోవడం ఆ పదవిలోకి వచ్చే ముందు రాజ్యాంగం మీద ఆయన చేసిన ప్రమాణాన్ని ఉల్లంఘించడమే. కోర్టుల్లో విచారణ సందర్భంగా కక్షిదారులు, సాక్షులు తమకు విశ్వాసం ఉన్న మత గ్రంథాలను చేతబూని ప్రమాణం చేసే అవకాశం ఉంది. కానీ న్యాయమూర్తులకు ఆ అవకాశం లేదు. కార్యనిర్వాహకవర్గంలోని ఎవరికీ ఆ అవకాశం లేదు. రాష్ట్రపతి దగ్గరి నుంచి కేంద్ర, రాష్ట్రమంత్రులు, కడకు చట్టసభల సభ్యులు కూడా రాజ్యాంగం మీద ప్రమాణం చేయాల్సిందే. రాజ్యాంగానికి కట్టుబడి పని చేస్తామని ఈ ప్రమాణంలో నిర్దిష్టంగా ఉంటుంది. ప్రధాన న్యాయమూర్తి మత విశ్వాసాలతో ఎవరికీ పేచీ లేదు. కానీ మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత నిరాఘాటంగా కొనసాగుతున్న విద్వేష ప్రచారం సందర్భంలో, కార్యనిర్వాహక వర్గం రాజ్యాంగాన్ని బాహాటంగా ఉల్లంఘిస్తున్న సందర్భంలో డి.వై. చంద్రచూడ్ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. కార్యనిర్వాహక వర్గం, చట్టసభలపై ప్రజలు విశ్వాసం కోల్పోయి చాలా కాలం అయింది. ప్రధాన న్యాయమూర్తిగా చంద్ర చూడ్ ఇటీవలి కాలంలో ఏ ప్రధాన న్యాయమూర్తికి లేనట్టుగా రెండేళ్లుఆ బాధ్యత నిర్వర్తించే అవకాశం వచ్చింది. ఆయన ఇచ్చిన కొన్ని తీర్పులు, సభలు సమావేశాల్లో ఆయన చేసిన వ్యాఖ్యలు న్యాయవ్యవస్థ మీద ప్రజల్లో బోలెడు ఆశలు రేకెత్తాయి. కానీ ప్రధాన న్యాయమూర్తిగా చంద్రచూడ్ ఎన్ని గొప్ప తీర్పులు ఇచ్చినా ప్రధానిని తన ఇంట్లో పూజకు ఆహ్వానించడం, దైవాజ్ఞ మేరకు అయోధ్య తీర్పు చెప్పానని ఒకటికి నాల్గు సార్లు రెట్టించి చెప్పడం, ఆ వాదనకు మరింత బలం చేకూర్చడం కోసం అధికారాంతంలో ఇంటర్ వ్యూలు ఇవ్వడం ఇదివరకెన్నడూ అనుభవంలోకి రాని అనౌచిత్యమే. ప్రధాన న్యాయమూర్తి హిందుత్వవాది కాకపోవచ్చు. కానీ ఆ మార్గంలో ఉన్నారన్న అనుమానం కూడా రాకుండా చూసుకోవడం ఆయన బాధ్యత. దాన్ని ఆయన బలాదూరుగా విస్మరించడం చూస్తే హిందుత్వ వాదులను ఆయన పరోక్షంగా సమర్థిస్తున్నారేమోనన్న అనుమానం కలుగుతోంది. ఇది ఆయన పదవీ కాలంలో మాయని మచ్చే.

చట్టబద్ధ ఎంఎస్‌పి లభిస్తుందా!

కుణాల్ బోస్

దేశంలోని ఆహార ధాన్యాల ధరలు రిజర్వు బ్యాంకును ఇంకా ఆందోళన కలిగిస్తూనే ఉన్నాయి. ఎందుకంటే, రిజర్వుబ్యాంకు ద్రవ్యవిధానాన్ని రూపొందించడానికి ఆహారధాన్యాల ధరలు ఉపయోగపడతాయి. ఈ ధరలు మూలంగా ద్రవ్యోల్బణం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇది ఇంకా పెరగడానికే అవకాశం కలుగుతోంది. ఆర్థికవృద్ధిసైతం ఆహారధాన్యాల ధరలపైన ఆధారపడి ఉంటుంది. ఖరీఫ్ పంటలు వ్యవసాయ మంత్రిత్వశాఖ అంచనాప్రకారం, 2024-25 పంటల ఉత్పత్తి గత ఏడాదికంటే ప్రస్తుత సంవత్సరంలో పెరుగనున్నాయి. వరి ధాన్యం, పప్పుధాన్యాలు, జొన్న లాంటి పంటల ఉత్పత్తి ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. కనీస మద్దతుధర (ఎంఎస్‌పీ) ఉత్పత్తిపై కనీసం 50శాతం ధర హామీ ఇస్తే రైతులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఉత్పత్తి మరింత పెరుగుతుంది. ఖరీఫ్, రబీ పంటల సీజన్‌లోనూ ఉత్పత్తి పెంచుతారు. అయితే అభివృద్ధిచెందిన దేశాలలో ఎంఎస్‌పీని చెల్లిస్తున్నారు. అయితే మనదేశంలో ఎమ్ఎస్‌పీ తక్కువగా ఉన్నది. రైతులు ఆందోళన చేస్తున్నప్పటికీ కేంద్రప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు ఎంఎస్‌పీని పెంచడంలేదు. మనదేశంలో సగటున 1.08 హెక్టార్ల భూమినికలిగిన రైతులు మార్కెట్‌లో పెద్దగా ప్రయోజనాన్ని పొందడంలేదు. అత్యధిక ఉత్పత్తి జరిగినప్పుడు మార్కెట్‌లో అధిక ధర రాదు. ఎంఎస్‌పీకి దగ్గరగా ఉండే ధరలకు మార్కెట్‌లో ప్రవేశించి రైతుల ఉత్పత్తులను కొనుగోళ్లు చేయడానికి ప్రభుత్వం అంతగా ముందుకురాదు. ప్రస్తుత సంవత్సరం పంటల కొనుగోళ్లకు వత్తిడి చేసినప్పటికీ ప్రభుత్వం సరైన ధరకు కొనుగోలుచేయడంపై ఆసక్తి చూపించడంలేదు.

ప్రస్తుత సీజన్‌లో రుతువు ఎక్కువ సమయం తీసుకున్నది. ఇది ప్రభుత్వాన్ని, ప్రజలను ఆందోళన కలిగించే విషయమే. ఎందుకంటే ద్రవ్యోల్బణం పెరగడానికి దోహదంచేసే స్థితిలో ఈ సీజన్ ఉన్నది. సెప్టెంబరు చివరివరకు కురిసిన వర్షాలు సాధారణంకంటే 8శాతం అధికంగా ఉన్నాయి. 2020నుంచి నైరుతి రుతువు కాలం జూన్ నుంచి సెప్టెంబరు వరకు సాధారణంకంటే అధికంగా వర్షాలు కురిశాయి. మనదేశంలో పంటపండించే భూమి పెరుగుతోంది. 142 మిలియన్ హెక్టార్లలో సగానికిపైగా ఈ సీజన్‌లో సేద్యం జరుగుతోంది. రుతువుపై ఆధారపడి విశాలప్రాంతంలో పంటలు పండుతాయా లేదా అనేది ఉంటుంది. ఈశాన్యం, నైరుతి ప్రాంతాలతో

నిమిత్తంలేకుండా దేశంలోని ఇతర ప్రాంతాల్లో వర్షాలు పెరుగుదల కేంద్ర ప్రభుత్వం 341 మిలియన్ టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తిని

> **మనదేశంలో సగటున 1.08 హెక్టార్ల భూమినికలిగిన రైతులు మార్కెట్‌లో పెద్దగా ప్రయోజనాన్ని పొందడంలేదు. అత్యధిక ఉత్పత్తి జరిగినప్పుడు మార్కెట్‌లో అధిక ధర రాదు. ఎంఎస్‌పీకి దగ్గరగా ఉండే ధరలకు మార్కెట్‌లో ప్రవేశించి రైతుల ఉత్పత్తులను కొనుగోళ్లు చేయడానికి ప్రభుత్వం అంతగా ముందుకురాదు.**

లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ లక్ష్యం సాధించినందున 2023-24లో ఉత్పత్తి 9మిలియన్ టన్నులు అధికంగాఉండి నూతన రికార్డు నెలకొల్పింది. ప్రకృతి ప్రోత్సాహంవల్ల మంచి వర్షాలుకురిసి ప్రభుత్వం జోక్యం చేసుకుని ఎంఎస్‌పీని ప్రకటిస్తే, రైతులు తమ భూమిలో ఎంతవరకు పండించవచ్చునని నిర్ణయం తీసుకుంటారు. అంతేకాదు, ఏ రకం పంట పండించాలనేది కూడా వర్షాలపై ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వం కనీసమద్దతు ధరను సిఫారసు చేసినట్లయితే అధికారిక మండీలలో (వ్యవసాయ ఉత్పత్తి కొనుగోలు మార్కెట్‌లు) రైతులు పంటను విక్రయిస్తారు.

చిన్న, సన్నకారు రైతులు ఎక్కువగా వ్యవసాయరంగంలో ఉన్నారు. దీనివల్ల అధికార యంత్రాంగం ఎంఎస్‌పీని తగ్గించడమో సమాంతరంగా ప్రైవేటు మార్కెట్ ఉన్నట్లయితే వ్యాపారులు, చిల్లర దుకాణాలు కొనుగోలు చేస్తాయి. జాతీయ ప్రజాస్వామ్య సంఘటన సంస్కరణలో భాగస్వామ్యం, రైతులు ప్రత్యేకించి శిరోమణి అకాళీదళ్ న్యాయబద్ధమైన ధరకోసం ఆందోళన జరిపారు. వ్యవసాయరంగానికి సంబంధించిన మూడు దుష్ట చట్టాలను ఉపసంహరించి రైతుల మహత్తర పోరాటాన్ని ప్రభుత్వం విరమింప చేయగలిగింది. రైతు సంఘాలు కనీస మద్దతుధరను అమలు చేయడానికి చట్టం చేయాలని ఆందోళన చేశాయి. ఆర్ఎస్ఎస్ అనుబంధ భారతీయ కిసాన్‌సంఘ్ కూడా చట్టంలో ఎంఎస్‌పీ భాగం కావాలని కోరింది.

రైతులకు ఎల్లవేళలా న్యాయమైన కనీసమద్దతు ధరను ఇవ్వాలని రైతులు చేసిన ఆందోళన ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరిచేసింది. ఎమ్ఎస్‌పీని బలహీనపరచబోమని పార్లమెంటులో వ్యవసాయమంత్రి, ప్రధానమంత్రి చెప్పినప్పటికీ చట్టం చేయడానికి మాత్రం ముందుకు రాలేదు. ప్రస్తుత పంటల సంవత్సరంలో ఎస్‌బీఐ ప్రధాన ఆర్థిక సలహాదారు సౌమ్యకాంత్ ఘోష్ ఒక నివేదికలో ఇలా తెలిపారు. వ్యవసాయరంగంలో 6శాతం మందికిమాత్రమే ఎంఎస్‌పీ ధర పొందుతున్నారని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం మాత్రం అన్ని పంటలకు మద్దతు ధర ఇస్తున్నట్లుగా చెబుతోంది.

2023-24 జీడీపీలో ప్రభుత్వ ధనాగారం నుంచి 13.5 ట్రిలియన్ రూపాయలు ఖర్చు చేయవలసిన పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. ప్రస్తుత పంటల సంవత్సరంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి 341 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని చేరినప్పటికీ 150 మిలియన్ టన్నుల ధాన్యం నిల్వచేసే శక్తి మాత్రమే ఉన్నది. రానున్న 5ఏళ్ల కాలంలో అదనంగా 1.25లక్షల కోట్లు పెట్టుబడులుపెట్టి అదనంగా 70 మిలియన్ టన్నుల ధాన్యం నిలుపుదల చేసే శక్తిగల గిడ్డంగులను నిర్మించవలసి ఉంటుంది.

ప్రాణాలు హరించే యురేనియం

జాలయ్య

ప్రజల ప్రాణాలు హరించడం, పొలాలలో పంటలు పండకుండా చేయడం, అనేకరకాల అనారోగ్యాలు కలిగించడం యురేనియం లక్షణం. అణు విద్యుత్ ఉత్పత్తి అత్యంత హానికరమైన అణ్వాయుధాల ఉత్పత్తిలాంటి వాటికోసం యురేనియంను ఉత్పత్తికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యతనిస్తూ, ప్రజాందోళనలు పట్టించుకోవడం లేదు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో యురేనియం ఉత్పత్తిని చాలాకాలంగా నిర్వహిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో గతంలో యురేనియాన్ని పాలకులు నిర్వహిస్తూనే ఉన్నాయి. పర్యావరణం కలుషితమై మానవాళి మనుగడకే ముప్పు కలిగించేవాటిలో యురేనియం ఒకటి.ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లా కప్పట్రాళ్ల అడవుల్లో యురేనియం తవ్వకాలు చేపట్టరాదని దేవరకొండ, బేతపల్లి, జల్లెలబుడకల, మాదాపురం, గుండ్లకొండ, నెల్లిబండ్ల, ఈదులదేవరబండ, చెల్లెలిచెలిమిల, బంటుపల్లి, గుడిమిల్ల తదితర 12 గ్రామాల ప్రజలు ఐక్యంగా ఆందోళన చేస్తున్నారు. తవ్వకాలు వద్దే వద్దు, మా ప్రాణాలతో చెలగాటం ఆడవద్దు, కప్పట్రాళ్లను పల్లెసీమలు రక్షించండి అంటూ ప్రజల ఆందోళన పోరాటం ప్రారంభమైంది. కర్నూలు జిల్లా దేవరకొండ మండలంలో 468.25 హెక్టార్ల అటవీ భూములు ఉన్నాయి. కౌలుట్లయ్య మలగా పిలిచే ఈ అటవీ ప్రాంతం ఆదోని రేంజ్ పత్తికొండ సెక్షన్ పరిధిలోకి వస్తుంది. ఈ అటవీ ప్రాంతంలో 20 వేల మంది ప్రజలు జీవిస్తున్నారు. 30 వేల ఎకరాల్లో వ్యవసాయ భూములు ఉన్నాయి.

దేశంలో మొదట యురేనియం నిక్షేపాలు మేఘాలయ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని దట్టమైన అడవుల్లో ఉన్నట్లు గుర్తించారు. 1950లో యురేనియం గనులు ఏర్పాటు చేశారు. 1967లో జాదుగూడలో గని ప్రారంభించారు. యురేనియం ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరిగే ప్రక్రియలో యురేనియం శుద్ధి అవుతుంది. శుద్ధి అయిన యురేనియంతో అణుబాంబులు తయారు చేస్తారు. అణుబాంబులపై ఆంక్షల ఒప్పందం వలన భారతదేశం వాటి తయారీ విరమించింది. శుద్ధి అయిన యురేనియంను బోరు బావుల్లోకి పంపిస్తున్నారు. 2002లో చంద్రబాబు అనుమతితో జరిగిన సర్వేలో కడప జిల్లా తుమ్మలపల్లి, గుంటూరు జిల్లాలోని కోపూరులో 2,300 ఎకరాల్లో యురేనియం నిల్వలు ఉన్నట్లు కనుగొన్నారు. తుమ్మలపల్లిలో లక్షా 40 టన్నులు, కోపూరులో 2500 టన్నులు బయటకు తీశారు. 2004లో రాజశేఖరరెడ్డి కూడా యురేనియం తవ్వకాలకు అనుమతి ఇచ్చారు. 2017లో మరలా చంద్రబాబు అనుమతితోనే ప్రజలను మభ్యపెట్టి కప్పట్రాళ్ల రిజర్వుఫారెస్టు పరిధిలో యురేనియం పరిశోధనలకు 9 చోట్ల బోర్ల తవ్వకాలు జరిపారు. వైసీపీ పాలనలో యురేనియం నిల్వల నిర్ధారణకోసం 6.80 హెక్టార్ల అటవీ భూమిలో 68 బోర్‌హోల్స్ డ్రిల్లింగ్ చేయటానికి ఆటమిక్ మినరల్ డైరెక్టరేట్ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్ (ఏఎండి) ప్రాంతీయ డైరెక్టర్ కు కేంద్ర మంత్రిత్వ శాఖ 2022-23 లో అనుమతి ఇచ్చింది. తెలంగాణలోని నల్లమడ అటవీ ప్రాంతంలో కూడా యురేనియం తవ్వకాలకు కేంద్రం అనుమతించింది. యురేనియం తవ్వకాలు జరిగినప్పుడు దాని ధూళి 80 కిలోమీటర్ల వరకు వ్యాపిస్తుంది. ధూళి పడిన ప్రాంతమంతా విషపూరితం అవుతుంది. పిల్లల మరణాలు జాతీయ సగటును మించిపోతాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్, పిల్లలు పుట్టకపోవటం, రుతుక్రమం సరిగా రాకపోవటం, చర్మ వ్యాధులు వంటి సమస్యలు సంభవిస్తాయి. వ్యవసాయ భూములు కూడా ధూళి ప్రభావానికి లోనౌతాయి.

1896లో హెన్రీ బెకరల్ రేడియో ధార్మిక శక్తి 92వ మూలకాన్ని కనిపెట్టాడు. ఒక చదరపు యురేనియం 500 కేజీల బరువు ఉంటుంది. న్యూక్లియర్ ఎనర్జీ ద్వారా అమెరికా అణుబాంబులు తయారుచేసింది. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిలపై అమెరికా అణుబాంబులువేసి లక్షలాది మంది ప్రాణాలు హరించింది. సామ్రాజ్యవాదులు యురేనియాన్ని అణుబాంబుల తయారీకి ఉపయోగించి ప్రపంచ దేశాలను బెదిరిస్తున్నది. యురేనియంతో అణు విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి తేలికగాను, ఎక్కువగా చేయవచ్చని భారత పాలకులు యురేనియం తవ్వకాలకు అనుమతిస్తున్నట్లు చెప్పటం ప్రజలను మోసం చేయటమే. అణు విద్యుత్ కేంద్రాలు చాలా ప్రమాదం. రష్యాలో చెర్నోబిల్, జపాన్‌లోని ఫుకుషీమాలో యురేనియం విద్యుత్ కేంద్రాలు పేలిపోవటంతో వేలాదిమంది మరణించటమే కాకుండా నేటికి ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నట్లు అనేక నివేదికలు తెలియచేస్తున్నాయి. అణు విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేసిన తర్వాత వాటిని మూసివేయటంలో కూడా అనేక ప్రమాదాలు ఉన్నాయి. రష్యాతో సహా అనేక దేశాలు వాటిని మూసివేయటం, ఇతర దేశాలకు అమ్మటం చేస్తుంటే, భారతదేశ పాలకులు మాత్రం అణు విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామంటున్నారు. విద్యుత్ ఉత్పత్తికి అణు రియాక్టర్లే అవసరంలేదు. గ్యాస్, జల, పవన్, బొగ్గు విద్యుత్ కేంద్రాల ఏర్పాటు ద్వారా దేశంలో కరెంట్ ఉత్పత్తికి అపార వనరులు ఉన్నాయి. విద్యుత్ పేరుతో ప్రజల ప్రాణాలను, పంట పొలాలను యురేనియం తవ్వకాలకు బలిపెట్టాల్సిన అవసరంలేదు. ప్రజల ప్రాణాలకు విలువఇవ్వని దేశ పాలకులు యురేనియం తవ్వకాలను జరపటమే కాకుండా విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. యురేనియం వినియోగంలో భారతదేశం 80శాతం కజకిస్తాన్ నుంచి దిగుమతి చేసుకుంటున్నది. ఇప్పటి వరకు 9 వేల టన్నుల యురేనియం సరఫరా చేసింది. 2020-24 వరకు యురేనియం సరఫరాకోసం మోదీ ప్రభుత్వం కజకిస్తాన్‌తో



ఒప్పందం చేసుకుంది. 2015-16లో రష్యా, కెనడాల నుంచి 600 టన్నుల యురేనియం దిగుమతి జరిగింది. దేశంలో ప్రస్తుతం 7 అణు రియాక్టర్లు నిర్మాణంలో ఉన్నాయి. వాటి అవసరాల కోసమే యురేనియం దిగుమతి. అణుశక్తిని ఉత్పత్తి చేయటానికి అనేక దేశాల పోటీ మధ్య యురేనియంకు డిమాండ్ పెరిగింది. యురేనియం తవ్వకాలకోసం బహుళజాతి కంపెనీలు పేదరికంలో ఉన్న ఆఫ్రికా దేశాల ప్రజలను బలిచేస్తున్నాయి. ఈ దేశాల్లో యురేనియం బయటకు తీయటానికి అక్కడి ప్రభుత్వాలకు ఆర్థికంగా ఎర చూపటంతో అనుమతిస్తున్నాయి. కడప జిల్లా పులివెందులలోని వేముల మండలం తుమ్మలపల్లె, కేర్తేకొట్టాల, మబ్బు చింతల పల్లె, భూమయ్య గారి పల్లెల్లో 2002లో యురేనియం తవ్వకాలు కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. యురేనియం తవ్వకాల వల్ల ఎదజల్లే ధూళి వల్ల పంట పొలాలు విషపూరితంగా మారాయి. అనేక ఆరోగ్య సమస్యలు ఏర్పడ్డాయి. ప్రజల జీవితాలు కల్లోల భరితంగా మారాయి. దీన్ని గమనించిన కర్నూలు జిల్లా కప్పట్రాళ్ల తదితర గ్రామ ప్రజలు, ఆ పరిస్థితులు తమకు రాగూడదనే నిర్ణయానికి వచ్చారు. యురేనియం తవ్వకాలను అడ్డుకోవటానికి సంఘటితంగా నిలబడ్డారు. బోర్ యంత్రాలను అడ్డుకుంటామని ప్రకటించారు. అందుకోసం ఆందోళనను తీవ్రతరం చేశారు. అధికారులు గ్రామాల్లోకి వస్తే పురుగుమందుల డబ్బాలు, పెట్రోల్ సీసాలతో అడ్డుకుంటామని రాస్తారోకోలు ప్రారంభించటంతో ఉద్రిక్తత నెలకొంది. అధికారులు గ్రామ సమావేశాలకు బయలుదేరి మధ్యలోనే వెనుతిరిగారు. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు యురేనియంగనులను, అణు రియాక్టర్లను మూసివేస్తున్నాయి. ఇతర దేశాలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాయి. ప్రమాదకరమైన అణు రియాక్టర్లను భారతదేశం రష్యా నుంచి దిగుమతి చేసుకుంది. అణు విద్యుత్ కేంద్రాల విస్తరణ చేయ చూస్తున్నది. యురేనియం తవ్వకాలు చేస్తున్నది. ప్రజల ప్రాణాలకు, వ్యవసాయ భూములకు ముప్పు తెస్తున్నది. కప్పట్రాళ్ల అటవీ ప్రాంతంలో యురేనియం తవ్వకాల ప్రయత్నాలను విరమించాలని, అణు విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేయరాదని డిమాండ్ చేస్తున్న కప్పట్రాళ్ల అటవీప్రాంత గ్రామప్రజలు చేస్తున్న పోరాటానికి రాష్ట్ర ప్రజలందరూ మద్దతు ఇవ్వాలి.

సెల్: 9491935968

బీజేపీ చేతిలో పావు పి.కె.

రాజకీయ పార్టీలు ఎన్నికల్లో ఎలా గెలవాలో వ్యూహ రచన చేసిన ప్రశాంత్ కిశోర్ (పి.కె.గా ప్రసిద్ధులు) పాండే చివరకు తానే నేరుగా రాజకీయ రంగంలోకి దూకారు. అక్టోబర్ 2న జన సురాజ్ పార్టీ నెలకొల్పారు. అంతకు ముందు ఆయన బీహార్ లో దాదాపు మూడువేల కిలోమీటర్లు పాదయాత్రచేసి జనం నాడీ నిదానం కోసం ప్రయత్నించారు. వనరుల లేమితో కొట్టు మిట్టాడుతున్న బీహార్ లోనూ ప్రశాంత్ కిశోర్ జన సమీకరణకు ప్రయత్నిస్తున్నారు. ఆయన ప్రచార సరళి సగటు రాజకీయ పార్టీలకు భిన్నమైంది. ఆయన పాద యాత్ర చేసినప్పుడు జనం తమ సద్ది మూటలు తామే తెచ్చుకుని వచ్చారు. చాలా కాలం నుంచి ప్రశాంత్ కిశోర్ "మాకు అభివృద్ధి అక్కర్లేదు. మాకు ఆత్మ గౌరవం కావాలి" అన్న నినాదాలు జనాన్ని ఆకర్షించినట్టున్నాయి. ఆ తరవాత ముందు ఒద్దనుకున్న అభివృద్ధి, సుపరిపాలన ఆయన ప్రధాన నినాదాలయ్యాయి. స్వాభిమానం సాధించడం ఇంకా పూర్తి కాలేదు కాబట్టే ప్రశాంత్ కిశోర్ జన సురాజ్ పార్టీ స్థాపించినట్టున్నారు. పిల్లలకు పేరు పెట్టేటప్పుడు తమ ఆదర్శాలకు తగ్గ పేర్లు ఎంపిక చేసుకుంటారు. ఏ పేరు పెట్టినా ఆ పేరుకు భిన్నమైన వ్యక్తిత్వం వారిలో కనిపించవచ్చు. పి.కె. పెట్టిన పేరు జన సురాజ్ సార్థక నామధేయం అవుతుందో

ఒకే ఒక్కడు

సగటు రాజకీయ పార్టీగా మిగిలిపోతుందో ఇప్పుడే చెప్పలేం. ఈ పార్టీ ఆత్మ గౌరవం మలిదశగా పరిణమిస్తుందో లేదో చూడాల్సిందే. ఒక వైపు ఎన్నికల వ్యూహకర్తగా ఉంటూనే మధ్యలో ఆయన నితీశ్ కుమార్ నాయకత్వంలోని జె.డి.(యు)లో 2018 సెప్టెంబర్‌లో చేరి ఆ పార్టీ ఉపాధ్యక్షుడయ్యారు. కానీ నితీశ్ కుమార్ తో ఆయనకు అంతగా పొసగినట్టు లేదు. ఆ తరవాత కాంగ్రెస్ లో చేరాలనుకున్నారు. అయితే తనకు కీలక బాధ్యతలు అప్పగించాలన్న కోర్కెను కాంగ్రెస్ అంగీకరించక పోవడంతో చివరకు అందులో చేరలేదు. ఆ సమయంలో ఆయన కాంగ్రెస్ అగ్ర నాయకులైన సోనియా, ప్రియాంకతో కూడా సంప్రదించారు. 2013లో ఆయన సిటిజన్స్ ఫర్ అకౌంటబుల్ గవర్నెన్స్ (సి.ఎ.గి.) నెలకొల్పారు. ఇది మీడియా, ప్రచారానికి సంబంధించిన సంస్థ. ఇది 2014 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించింది. నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గెలుపు మంత్రాలు పి.కె.నే రూపొందించారు. చాయ్ పై చర్చ, 3డి ర్యాలీలు, మంథన్ లాంటి అనేక కార్యక్రమాలకు రూపు దిద్దారు. ప్రశాంత్ కిశోర్ ప్రచార వ్యూహంలో సామాజిక మాధ్యమాలను వినియోగించుకోవడమే ప్రధానం. ఆయన ముందు నెలకొల్పిన సి.ఎ.గి.ని తరవాత ఐ-పాక్‌గా మార్చేశారు. 2015లో నితీశ్ కుమార్ మూడోసారి ముఖ్యమంత్రి కావడానికి అనువుగా ప్రచార వ్యూహాన్ని రూపొందించారు. వనరులను, వ్యూహాలను, కూటముల ఏర్పాటును ఎలా ఏర్పాటు చేయాలి అన్న పకడ్బందీ వ్యూహాలు నితీశ్ కుమార్‌కు ఉపకరించాయి. ఎన్నికలలో విజయం దక్కిన తరవాత నితీశ్ కుమార్ పి.కె.ను ప్రణాళిక, పథకాల అమలు రంగాల సలహాదారులుగా నియమించారు. ఎన్నికలలో విజయంకోసం ఏడు సూత్రాల పథకానికి రూపుదిద్దారు. 2020 బీహార్ ఎన్నికలలో కూడా పి.కె. ఎన్నికల వ్యూహకర్తగా వ్యవహరించారు.

2014లో మోదీ ఎన్నికల వ్యూహాన్ని రూపొందించి విజయం సాధించిన తరవాత కాంగ్రెస్ 2017లో ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికల ప్రచారానికి పి.కె. సేవలను వినియోగించుకుంది. అయితే ఆ ఎన్నికలలో కాంగ్రెస్ కు విజయం దక్కలేదు. ఇది ప్రశాంత్ కిశోర్ వైఫల్యాలలో ప్రధానమైంది. ఆ ఎన్నికలలో బీజేపీ 300కు పైగా సీట్లు సంపాదిస్తే పి.కె. వ్యూహరచన పనిచేయనందువల్ల కాంగ్రెస్ ఏడు సీట్లకే పరిమితం కావాల్సి వచ్చింది. ప్రశాంత్ కిశోర్ మొదటి అపజయం ఇదే.2017 పంజాబ్ శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకుడు కెప్టెన్ అమరేంద్ర సింగ్ కూడా పి.కె. సేవలను వినియోగించుకున్నారు. 2019 లో ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల సమయంలో వై.ఎస్.జగన్ కూడా ప్రశాంత్ కిశోర్ వ్యూహ రచన మీద ఆధారపడ్డారు. 2020 ఢిల్లీ శాసనసభ ఎన్నిలలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు అరవింద్ కేజ్రీవాల్ కూడా పి.కె. వ్యూహాలనే అనుసరించారు. 2021 బెంగాల్ శాసనసభ ఎన్నికలలో మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ కూడా అదే పనిచేసింది. అదే సంవత్సరం డి.ఎం.కె. నాయకుడు స్టాలిన్ సైతం పి.కె. మీదే ఆధార పడ్డారు.

2021లో తృణమూల్, డి.ఎం.కె. కోసం పనిచేసిన తరవాత వ్యూహ రచన బాధ్యతల నుంచి తప్పుకుంటానని పి.కె.ప్రకటించారు. "ఇప్పుడు చేస్తున్న పని ఇక చేయకూడదనుకుంటున్నాను. ఇక చాలు. కాస్త విశ్రాంతి తీసుకుని జీవితంలో మరేదైనా పని చేస్తాను" అని పి.కె. ప్రకటించారు. ఆ తరవాత ఒక సంవత్సరానికి 2022 మే రెండో తేదీన తానే రాజకీయ పార్టీ పెడ్తానని ప్రకటించారు. ఆ సంకల్పం గత అక్టోబర్ రెండున నెరవేరింది. ఆ తరవాతే సుదీర్ఘ పాదయాత్ర చేపట్టారు. జన సురాజ్ పార్టీ అన్న పేరు అప్పటి నుంచే ఆయన మదిలో మెదులుతున్నట్టుంది. ఆ పాదయాత్రను కూడా జన సురాజ్ పాదయాత్ర అనే పేరు పెట్టారు. ఆ యాత్రను "బాత్ బీహార్ కి" అని కూడా అన్నారు. దీన్నిబట్టి ప్రస్తుతానికి తన పార్టీ రాజకీయాలను బీహార్ కే పరిమితం చేసేట్టున్నారు. 2025లో బీహార్ శాసనసభ ఎన్నికలలో పాల్గొనే ఆలోచనలో ఉన్నారు. పి.కె. తండ్రి కాంగ్రెస్‌లో ఉండేవారు. తల్లికి మాత్రం రాజకీయాలంటే సహించేవి కావు. తండ్రి శ్రీకాంత్ పాండే వృత్తి రీత్యా వైద్యుడు. ఆయన భార్య జాహ్నవి దాస్ అసోంకు చెందినవారు. ఆమె వైద్య వృత్తిలో ఉన్నారు. ఏ పనిచేసినా ఆయన కష్టపడి చాలా శ్రద్ధగా చేస్తారంటారు. ఆయనకు ఖరీదైన జోళ్లు అంటే ఇష్టం. అవి 12-13 వేల ఖరీదు ఉంటాయంటారు. తన పార్టీకి ఎవరైనా విరాళాలు ఇస్తే చెక్కు ద్వారా ఇస్తేనే అంగీకరిస్తానంటున్నారు. ఆయనకు డబ్బు కొరత లేదు. ఒక్కో రాజకీయ పార్టీ తరఫున వ్యూహకర్తగా పని చేసినప్పుడు ఆయన తీసుకున్న మొత్తం రూ. వంద కోట్ల పై మాటే.

ఆయనకు ఎన్నికల వ్యూహాలు రూపొందించడం మీదే కాకుండా స్వయంగా రాజకీయాల్లో పాల్గొనాలన్న ఆసక్తి మెండుగానే ఉందని ఆయన నడవడికనుబట్టి అర్థం అవుతోంది. ఒకప్పుడు నితీశ్ కుమార్ కు అతి సన్నిహితంగా మెలగిన పి.కె. ఇప్పుడు నితీశ్ పేరెత్తితే మండి పడ్తున్నారు. ఎవరికైనా ఓటు వేయండి కానీ నితీశ్ కుమార్ పార్టీకి మాత్రం వేయకండి అని ప్రచారం చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో విఫలమైనప్పటికీ వ్యూహ రచనలో పి.కె. నిపుణుడే కావచ్చు. ఆయన దాదాపు అన్ని ప్రసిద్ధ పార్టీల తరఫున వ్యూహ రచన బాధ్యతలు నిర్వహించారు. అయితే ఆయన రాజకీయ సిద్ధాంతం ఏమిటో ఇంతవరకు ఎన్నడూ విడమర్చలేదు. బహుశ: అనేక ప్రాంతీయ పార్టీలకు లాగే అస్తిత్వ పోరాటమే ఆయన రాజకీయ సిద్ధాంతం కావొచ్చు. ఒక్క లాలూ యాదవ్ నాయకత్వంలోని రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్.జె.డి.) మినహా బీజేపీతో కలిసి నడవని ప్రాంతీయ పార్టీ ఏదీలేదు. ప్రశాంత్ కిశోర్ ఇందుకు మినహాయింపు కాకపోవచ్చు. ఆయన బీజేపీ చేతిలో పావు అని ఇప్పటికే చాలా మంది అభిప్రాయ పడ్తున్నారు. ఎన్నికలను కార్పొరేటీకరించిన వ్యక్తి ప్రశాంత్ కిశోర్.

అనన్యవర్మ

రాజ్యాంగ విలువల ధ్వంసానికి ప్రయత్నం

బీజేపీ, ప్రధాని మోదీపై ప్రియాంక ధ్వజం

వయనాడ్ (కేరళ) : బీజేపీ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాజ్యాంగ విలువలైన సమానత్వం, న్యాయం, లౌకికవాదాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో యూడీఎఫ్ అభ్యర్థి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా బుధవారం విమర్శించారు. గత 10 సంవత్సరాలుగా బీజేపీ దేశంలో విభజన రాజకీయాలకు పాల్పడిందని, అధికారంలో ఉండేందుకు ప్రజలను వారి అసలు సమస్యల నుంచి మరల్చడానికి ప్రయత్నించిందని తెలిపారు. మలప్పురం జిల్లా వాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని చెరుకోడ్‌లో జరిగిన కూడలి సభలో ఆమె మాట్లాడుతూ ఒక దేశంలో ఇలాంటి రాజకీయాలు శక్తివంతంగా మారినప్పుడు ప్రజలు తమ

జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడం లేదన్నారు. వయనాడ్ నియోజకవర్గంలో తన ఐదు రోజుల ఉప ఎన్నికల ప్రచారంలో నాలుగో రోజు కాంగ్రెస్ నాయకురాలు... బీజేపీ పాలనలో దేశంలో రైతులకు లేదా మధ్య తరహా, చిన్న వ్యాపారాలకు మద్దతు ఇచ్చే వ్యవస్థ లేదని ఆరోపించారు. చిన్న, మధ్యతరహా వ్యాపారాలు 'దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక' అని, అవి చాలా ఉపాధిని అందిస్తున్నాయని, 'కానీ రైతుల మాదిరిగానే వారికి మద్దతు అవసరం' అని ఆమె అన్నారు. వయనాడ్ సుగంధ ద్రవ్యాలతో సహా అధిక నాణ్యత కలిగిన పంటలను ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, చాలా మంది రైతులు వ్యవసాయంలో భవిష్యత్‌ను చూడలేకపోతున్నారని, విద్యార్థులతో సహా నివాసితులు మెరుగైన ఉద్యోగ అవకాశాలు, ఉన్నత విద్య కోసం విదేశాలకు వలస వెళుతున్నారని ఆమె పునరుద్ఘాటించారు. పర్వత ప్రాంత నియోజకవర్గంలో కనీస తాగునీరు, విద్య, వైద్యం వంటి సౌకర్యాల కొరత తదితర అంశాలను కూడా ఆమె ప్రస్తావించారు. తాను ఒక పోరాట యోధురాలిని, తనకు అవకాశం ఇస్తే వయనాడ్ ప్రజల కోసం పార్లమెంటులోనూ, ఇతర ప్రతి వేదికలోనూ వారి సమస్యల పరిష్కారానికి పోరాడతానని ప్రియాంక అన్నారు. 'నేను వెనక్కి తగ్గను... మీ కోసం పోరాడతా... మిమ్మల్ని నిరాశ పరచను... ఇప్పుడు మనం కుటుంబ సభ్యులం' అని చెప్పారు. చెరుకోడ్‌లో కూడలి సభతో పాటు వండూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని తువ్వూరు, కలికావు టౌన్‌లో, నిలంబూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని పూకొట్టుంపాడులో కూడా ప్రియాంక అదే తరహా సమావేశాలు నిర్వహించనున్నారు. వయనాడ్ స్థానానికి నవంబరు 13న ఉప ఎన్నిక జరగనుంది.

కులగణనతో అన్యాయాన్ని నిరూపిస్తాం

రాహుల్

నాగ్‌పూర్: దేశంలో కుల గణన జరుగుతుందని...దీని ద్వారా దళితులు, ఓబీసీలు, ఆదివాసీలకు జరిగిన అన్యాయాన్ని బట్టబయలు చేస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. నాగ్‌పూర్‌లో జరిగిన సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్‌లో రాహుల్ మాట్లాడుతూ... 'కుల గణన ప్రతి విషయాన్ని స్పష్టం చేస్తుంది. ప్రతి ఒక్కరూ వారు ఎంత అధికారాన్ని కలిగి ఉన్నారో, వారి పాత్ర ఏమిటో తెలుసుకుంటారు' అన్నారు. కుల గణన అభివృద్ధికి ఒక ఉదాహరణ అని రాహుల్ చెబుతూ... "మేము 50 శాతం రిజర్వేషన్ పరిమితి గోడను కూడా విచ్ఛిన్నం చేస్తాం" అన్నారు. దేశంలో 90 శాతానికి పైగా అణగారిన ప్రజలకు న్యాయం జరిగేలా పోరాడుతున్నామని దేశానికి చెప్పాలన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం కేవలం పుస్తకం మాత్రమే కాదని, అది ఒక జీవన విధానం అని రాహుల్ తెలిపారు. ఆర్ఎస్ఎస్, బీజేపీకి చెందిన వ్యక్తులు రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని విమర్శించారు. మోదీ సర్కారు కేవలం 25 మంది మీకు విధేయులైన సంపన్నులకు రూ. 16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిందని మండిపడ్డారు.

అంబేద్కర్‌కు నివాళులు

నాగ్‌పూర్ పర్యటన సందర్భంగా రాహుల్ గాంధీ మధ్యాహ్నం 12:45 నిమిషాలకు దీక్షాభూమికి చేరుకుని... రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాహుల్ గాంధీకి 'బాబాసాహెబ్ అంబేద్కర్ దీక్షాభూమి స్మారక్ సమితి' సభ్యులు ఘన స్వాగతం పలికారు. సుమారు 20 నిమిషాలు గడిపిన తర్వాత దీక్షభూమి నుండి బయలుదేరే ముందు ఐదు నిమిషాల పాటు రాహుల్ ధ్యానంలో నిమగ్నమయ్యారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు రమేష్ చెన్నితాల, ముకుల్ వాస్నిక్, నానా పటోలే తదితరులు ఉన్నారు.

వరి రైతుకు రూ.25 వేల బోనస్

ఎన్సీపీ మేనిఫెస్టో హామీల వరద

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అజిత్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీ బుధవారం మేనిఫెస్టో విడుదల చేసింది. ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే కొత్త మహారాష్ట్ర విజన్‌ను అందజేస్తామని మేనిఫెస్టో హామీ ఇచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, వ్యవసాయ సదుపాయాలను అభివృద్ధి చేస్తామని తెలిపింది. పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సునీల్ తట్కరే ముంబైలో, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రఫుల్ పటేల్ గోండియాలో మేనిఫెస్టోను విడివిడిగా ఆవిష్కరించారు. గ్రామీణ ప్రాంతాల్లో 25 లక్షల ఉద్యోగాల కల్పన, లడ్కీ బహిన్ పథకం నెలవారీ సాయం రూ.1,500 నుంచి రూ.2,100కు పెంపు, వరి రైతులకు హెక్టారుకు 25వేల బోనస్, వృద్ధాప్య పింఛను రూ.1,500 నుంచి రూ.2,100కు పెంపు చేస్తామని వాగ్దానం చేసింది. షెట్కారీ సన్మాన్ నిధి పథకం ద్వారా రైతులకు ఏడాదికి రూ.15 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో 45 వేల 'పసంద్' రోడ్ల నిర్మాణం, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లకు రూ.15 వేల నెలవారీ జీతం, సౌర, పునరుత్పాదక ఇంధనానికి ప్రాధాన్యత, విద్యుత్తు బిల్లుల్లో 30 శాతం తగ్గింపు వంటి హామీలు గుప్పించింది. 288 మంది శాసనసభ స్థానాలు కలిగిన మహారాష్ట్రలో నవంబరు 20న ఒకేవిడతలో పోలింగ్ జరగనుంది. నవంబరు 23న ఫలితాలు ప్రకటించనున్నారు.

రూ.450కే గ్యాస్ సిలిండర్

జేఎంఎం కూటమి మేనిఫెస్టో హామీలు

రాంచీ: జారండ్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం), కాంగ్రెస్, ఆర్జేడీ, సీపీఐ-ఎం కూటమి ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం హేమంత్ సోరెన్ పాల్గొన్నారు. ఉమ్మడి మేనిఫెస్టోలో ఏడు హామీలు పొందు పర్చారు. హేమంత్ సోరెన్ మాట్లాడారు. 'రాష్ట్రంలో మేం మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అనంతరం ప్రాధాన్యతాపరంగా ఈ ఏడు హామీలు అమలు చేస్తాం. మహాఘట్‌బంధన్ నాయకులందరూ సమావేశమై... మేనిఫెస్టోను ప్రజల ముందుకు తీసుకువచ్చాం' అని అన్నారు. హామీల విషయాన్ని పరిశీలిస్తే...1932 నాటి ఖతియాన్ విధానం ఆధారంగా సర్నా మత నియమావళి అమలు చేస్తామని, డిసెంబర్ 2024 నుంచి మైయా సమ్మాన్ పథకం కింద రూ.2,500 అందిస్తామని, మైనారిటీల ప్రయోజనాల పరిరక్షణ కోసం వెనుకబడిన తరగతుల కమిషన్ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టో హామీ ఇచ్చింది. ఒక్కో కుటుంబానికి రూ.450 చొప్పున ఎల్పీజీ సిలిండర్లు, ఒక్కో వ్యక్తికి రేషన్ పరిమాణాన్ని ఏడు కిలోలకు పెంచుతామని, 10 లక్షల మంది యువకులకు ఉపాధి, రూ.15 లక్షల వరకు కుటుంబ ఆరోగ్య భృతి కల్పిస్తామని, ప్రతి బ్లాక్‌లో డిగ్రీ కాలేజీలు, ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీలు, యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తామని, ప్రతి జిల్లాలో 500 ఎకరాల ఇండస్ట్రియల్ పార్క్ నిర్మిస్తామని, బియ్యం ఎంఎస్‌పీ రూ.2,400 నుంచి రూ.3,200కి పెంచడంతో పాటు ఇతర పంటల ధరలు 50 శాతానికి పెంచుతామని వాగ్దానం చేసింది.

మేము పోటీచేస్తే... మరాఠాలు విడిపోయేవారు: జరంగే

ఛత్రపతి సంభాజీనగర్: మహారాష్ట్ర ఎన్నికల్లో తాము పోటీచేసినట్లయితే మరాఠాలు విడిపోయి ఉండేవారని మరాఠా కోట ఉద్యమానికి నేతృత్వం వహించిన మనోజ్ జరంగే అభిప్రాయపడ్డారు. అలాగే రాబోయే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు వారు రాజకీయ దృశ్యాన్ని మార్చగలరని పేర్కొన్నారు. ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకోవడం ద్వారా మరాఠా రిజర్వేషన్ల పోరాటాన్ని సజీవంగా ఉంచుకున్నానని జరంగే తెలిపారు. నవంబర్ 20న జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులకు మద్దతు ఇవ్వడంపై తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కొంతమంది అభ్యర్థులకు మద్దతు ఇవ్వడం లేదా వ్యతిరేకించడానికి సంబంధించిన కొన్ని నియోజకవర్గాలను జరాంగే ముందుగా గుర్తించారు. కానీ అసెంబ్లీ ఎన్నికల్లో తాము అభ్యర్థులను బరిలో నిలపడంలేదని, వేరెవరికీ మద్దతు ఇవ్వబోవడం లేదని సోమవారం ప్రకటించారు. తన భవిష్యత్తు వ్యూహంపై మాట్లాడుతూ... "ఎన్నికలలో పోటీ చేయకూడదనే నిర్ణయం వల్ల కొంతమంది ఎన్నికల ఆశావహులు అసంతృప్తి చెంది ఉండవచ్చు. కానీ ఈ నిర్ణయంతో నేను రిజర్వేషన్ కోసం పోరాటాన్ని సజీవంగా ఉంచాను. ఎన్నికలు స్వల్ప కాలానికి సంతోషాన్నిస్తాయి. వాటి నుంచి మనం తప్పించుకోవాలి. ఎన్నికలకు ఇంకా కొన్ని రోజుల సమయం ఉన్నందున ఎవరిని ఓడించాలనుకుంటున్నారో తగిన సమయంలో ప్రకటిస్తాం" అని జరంగే స్పష్టం చేశారు. 'మా మద్దతు కోరుతున్న వారికి మేము మునాయిదా (మరాఠా రిజర్వేషన్‌కు మద్దతుగా) ఇస్తాము. ఎవరికి మద్దతివ్వాలో మళ్లీ కూర్చుని నిర్ణయిస్తాం. చివరి దశలో రాజకీయ వాతావరణాన్ని మార్చగల సామర్థ్యం మాకు ఉంది. బలమైన అభ్యర్థి ఎవరనేది పరిశీలించి... ఎవరికి మద్దతివ్వాలో నిర్ణయిస్తాం' అని చెప్పారు.

మహారాష్ట్ర కాంగ్రెస్ ఎన్నికల ప్రచార కమిటీ ఇదే

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార కమిటీని ఏర్పాటు చేసింది. ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ కమిటీకి ఆమోదం తెలిపినట్లు తాజాగా విడుదల చేసిన ఆ పార్టీ ప్రకటన పేర్కొంది. కాగా, ఈ ఎన్నికల ప్రచార కమిటీకి చంద్రకాంత్ హందోరే చైర్మన్‌గా, నానా గవాండే కన్వీనర్‌గా కాంగ్రెస్ పార్టీ నియమించింది. ప్రచార కమిటీ సభ్యులుగా వర్షా గైక్వాడ్, కుమారి ప్రణతి షిండే, ఇమ్రాన్ ప్రతాప్ గర్హి, కల్యాణ్ కాలే, విలాస్ ముత్తెంవార్, సతీష్ చతుర్వేది, సునీల్ కేదార్, సురేష్‌శెట్టి, ఉల్హాస్ పవార్, హుస్సేన్ దల్వారు, కుమార్ కేత్కర్, అశోక్ పాటిల్, అశోక్ (భారు) జగ్తాప్, అనీస్ అహ్మద్, మోహన్ జోషి, చారులత తోక్స్, వజాహత్ మీర్జా, ప్రద్న్య సతవ్, రాంహరి రూపన్వర్, ఎంఎం షేక్, మునాఫ్ హకీమ్, చరణ్‌సింగ్, సప్రా, రాజారామ్, పంగవాహనే, రాజేష్‌శర్మ సభ్యులుగా ఉన్నారు. వీరితోపాటు సచిన్ సావంత్, శరద్ అహేర్, మహేంద్ర ఘరత్, కిషోర్ బోర్కర్, జానెట్ డిసౌజా, సంధ్యా సవాలాఖే, సిద్ధార్థ హత్తియాంబిర్రే, భానుదాస్ మాలి, డాక్టర్ ఇబ్రహీం భాయిజాన్, కమల్ ఫరూక్, అనీషా బగుల్, సూర్యకాంత్ పాటిల్, హేమలతా పాటిల్, దేశ్‌ముఖ్, ప్రవీణ్ దేశ్‌ముఖ్, సునీల్ అహిరే, అనీష్ ఖురేషి, అశోక్ ధావత్ ఉన్నారు.

దిల్లీలో మరిన్ని మద్యం దుకాణాలు

న్యూదిల్లీ: రాబోయే క్రిస్మస్, కొత్త సంవత్సర వేడుకలను దృష్టిలో ఉంచుకుని దిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నూతన సంవత్సరానికి ముందే ప్రీమియం మద్యం షాపులు తెరవాలని యోచిస్తోంది. ఈ విషయాన్ని ఓ ప్రభుత్వ అధికారి వెల్లడించారు. మీడియాకు అందిన సమాచారం ప్రకారం నూతనంగా ఏర్పాటు చేయబోయే మద్యం దుకాణాలు 500 చదరపు మీటర్ల కంటే అధిక విస్తీర్ణంలో ఉండనున్నాయి. వినియోగదారులు దుకాణంలోని షెల్ఫ్ నుండి తమకు ఇష్టమైన బ్రాండ్‌ను ఎంచుకునే అవకాశం ఏర్పడనుంది. ఈ నూతన ప్రీమియం స్టోర్లు... మాల్స్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఏర్పాటుకానున్నాయి. దిల్లీలోని నాలుగు కార్పొరేషన్లు ఈ దుకాణాలు ఏర్పాటు చేయనున్నాయి. నూతనంగా ఈ ప్రీమియం దుకాణాలు తెరవడం వల్ల ప్రభుత్వానికి మరింత ఆదాయం సమకూరనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో దిల్లీ ప్రభుత్వ ఎక్సైజ్ శాఖ మద్యం అమ్మకాలపై సుంకం ద్వారా రూ.3,047 కోట్లు ఆర్జించగా, గత ఏడాది ఇదే కాలంలో రూ.2,849 కోట్లు సంపాదించింది.

'గడియారం' గుర్తుపై నిరాకరణ ప్రచురించండి

అజిత్ పవార్ వర్గానికి సుప్రీం ఆదేశం

న్యూదిల్లీ : 'గడియారం' గుర్తు కేటాయింపు అంశం కోర్టులో పెండింగ్‌లో ఉందని, మరాఠీ సహా వార్తా పత్రికలలో నిరాకరణను ప్రచురించాలని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ నేతృత్వంలోని వర్గాన్ని సుప్రీం కోర్టు బుధవారం ఆదేశించింది. కోర్టు ఆదేశాలిచ్చిన 36 గంటల్లోగా నిరాకరణను దినపత్రికల్లో ప్రచురించాలని ఆదేశించింది. న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం 'గడియారం' చిహ్నాన్ని ఉద్దేశపూర్వకంగా ఉపయోగించడం, దుర్వినియోగం చేయడంపై శరద్ పవార్, అజిత్ పవార్ నేతృత్వంలోని వర్గాల వాదనలు విన్న తర్వాత రెండు గ్రూపులు ఓటర్లపై దృష్టి పెట్టాలని సూచించింది. 'కోర్టుల్లో మీ శక్తిని వృధా చేసుకోకండి. మీరిద్దరూ వెళ్లి ఓటర్లపై దృష్టి పెట్టండి' అని రెండు వర్గాల తరపు న్యాయవాదులకు తెలియజేసింది. అజిత్ పవార్ వర్గం తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది బల్బీర్ సింగ్‌ను 36 గంటల్లోగా మరాఠీ సహా ప్రముఖ వార్తాపత్రికలతో నిరాకరణను తెలియజేయాలని అదేశించింది. అయితే ఇప్పటికే అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారని, పేర్ల ఉపసంహరణ దశ ముగిసిందని, శరద్ పవార్ వర్గం మొత్తం ఎన్నికల ప్రక్రియను అంత రాయం కలిగించే ప్రయత్నం చేస్తోందని న్యాయవాది సింగ్ తెలిపారు. దీనిపై శరద్ పవార్ వర్గం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ... గత 30 సంవత్సరాలుగా 'గడి యారం' గుర్తుకు ప్రముఖ నాయకుడితో సంబంధం ఉందని, ప్రత్యర్థి పక్షం దానిని దుర్వినియోగం చేయడానికి ప్రయత్నిస్తోందని

వాదించారు. అందువల్ల కొత్త గుర్తు కోసం అజిత్ పవార్ నేతృత్వంలోని వర్గానికి దిశానిర్దేశం చేయాలని న్యాయవాది సింఘ్వీ కోరారు.

'స్వర కోకిల' శారదా సిన్హా కన్నుమూత

న్యూదిల్లీ: ప్రముఖ జానపద గాయని శారదా సిన్హా(72) దిల్లీలోని ఎయిమ్స్‌లో తుది శ్వాస విడిచారు. మంగళవారం రాత్రి శారదా సిన్హా ఆరోగ్యం అకస్మాత్తుగా క్షీణించింది. దీంతో ఆమెను వెంటిలేటర్ సపోర్టుపై ఉంచారు. ఆమెను బీహార్‌కు చెందిన 'స్వర కోకిల' అని పిలుస్తారు. బుధవారం పాట్నాలో ప్రభుత్వ లాంఛనాలతో శారదా సిన్హా అంత్యక్రియలు జరిగాయి. శారదా సిన్హా భర్త మెదడులో రక్తనాళాలు చిట్లి ఇటీవలే కన్నుమూశారు. ఆ తర్వాత ఆమె ఆరోగ్యం కూడా క్షీణించసాగింది. ఇటీవలే శారదా సిన్హాకు బోన్ మ్యారో క్యాన్సర్ సోకింది. నాటి నుంచి ఆమె ఎయిమ్స్‌లోని అంకాలజీ మెడికల్ విభాగంలో చికిత్స పొందుతున్నారు. శారదా సిన్హా 1952 అక్టోబర్ ఒకటిన బీహార్‌లోని సుపాల్ జిల్లాలోని హులాస్‌లో జన్మించారు. ఆమె సంగీతంలో ఎంఏ చేశారు. ఆమెకు ఇద్దరు పిల్లలు. కుమారుడి పేరు అన్షుమన్ సిన్హా, కుమార్తె పేరు వందన. శారదా సిన్హా మృతికి ప్రధాని మోదీ సంతాపం ప్రకటించారు. 'సుప్రసిద్ధ జానపద గాయని శారదా సిన్హా మృతితో నేను చాలా బాధపడ్డాను. ఆమె పాడిన మైథిలి, భోజ్‌పురి జానపద పాటలు కొన్ని దశాబ్దాలుగా ఎంతో ప్రాచుర్యం పొందాయి. ఆమె మరణం సంగీత ప్రపంచానికి తీరని లోటు' అని మోదీ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

చిన్నారికి రూ.16 కోట్ల ఖరీదైన ఇంజక్షన్

కోల్‌కతా: గత కొద్ది కాలంగా స్పైనల్ మస్కులర్ అట్రోఫీ అనే అరుదైన జన్యు వ్యాధితో బాధపడుతు ఓ చిన్నారికి సరైన సమయంలో చికిత్స అందించి వైద్యులు ప్రాణం పోశారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన దిన్ ముమహ్మద్ అనే చిన్నారికి ఆరు నెలల వయస్సు ఉన్నప్పుడే అతడి చేతులు, కాళ్లు కదపలేకపోవడం తన తల్లి గమనించింది. తల ఎత్తడం, కూర్చోవడం కూడా కాష్టంగా మారింది. దీంతో తల్లిదండ్రులు వైద్యులకు చూపించగా.. 'స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ' వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. అరుదైన ఈ వ్యాధికి రెండేళ్లు నిండకుండా కొన్ని రకాల ఔషధాలు వాడితేనే చికిత్సకు వీలవుతుందని కోల్‌కతా వైద్యులు సూచించారు. ఈ వ్యాధిని నయం చేయాలంటే నొవార్టిస్ ఫార్మా తయారు చేసిన రూ.16 కోట్లు ఖరీదైన జొల్జెన్‌స్మా ఇంజక్షన్ తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అయితే, వారి వద్ద అంత డబ్బు లేకపోవడంతో.. దాతలు, ప్రభుత్వ సాయంతో తాజాగా బాలుడికి ఆ ఇంజక్షన్ ఇచ్చారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉన్నట్లు కోల్‌కతా వైద్యులు తెలిపారు. స్పైనల్ మస్క్యులార్ అట్రోఫీ... ఇదొక నరాల వ్యాధి. కండరాలు బలహీనంగా ఉండటం, శరీరంలో ఏదో ఒక అవయవంలో కదలికలు లేకపోవడం దీని ప్రధాన లక్షణం. చికిత్స తీసుకోకుంటే మంచానికే పరిమితమవ్వాల్సి ఉంటుంది. ఒక్కోసారి ప్రాణాలు కూడా దక్కవు. ఈ వ్యాధిని నయం చేయాలంటే నొవార్టిస్ ఫార్మా తయారు చేసిన రూ.16 కోట్లు ఖరీదైన జొల్జెన్‌స్మా ఇంజక్షన్ తీసుకోవాల్సి ఉంటు ంది. ప్రపంచంలోనే ఇది అత్యంత ఖరీదైన ఔషధం. దీన్ని విదేశాల నుంచి తెప్పించుకోవాల్సి ఉంటుంది. బిడ్డ పుట్టిన రెండేళ్ల లోపే దీన్ని తీసుకోవాలి. ఇప్పటికే ఇలాంటి కేసులు మన దేశంలో చాలానే వెలుగు చూశాయి. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా విరాళాల ద్వారానే ఆ ఇంజక్షన్ తెప్పించుకుని తమ చిన్నారి ప్రాణాలను కాపాడుకున్నారు.

కుప్పకూలిన బుల్లెట్ రైలు బ్రిడ్జి

ఆనంద్ : గుజరాత్‌లోని ఆనంద్ జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రతిష్ఠాత్మక బుల్లెట్ రైలు ప్రాజెక్టులో భాగంగా నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి మంగళవారం కుప్పకూలింది. శిథిలాల కింద అనేక మంది కార్మికులు చిక్కుకోవడంతో స్థానిక అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి కుప్పకూలిన సమాచారం తెలియగానే ఆనంద్ పోలీసులు, బ్రిగేడ్ అధికారులు ఘటనా స్థలికి చేరుకుని ముమ్మర సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఇద్దరు కార్మికులను రక్షించారని, మరో ఇద్దరు శిథిలాల కింద చిక్కుకున్నారని ప్రాథమిక సమాచారం. కాగా, మహి నది వద్ద బుల్లెట్ రైలు ప్రాజెక్టు స్థలంలో కాంక్రీట్ బ్లాక్‌ల మధ్య ముగ్గురు కార్మికులు చిక్కుకుపోయారని, క్రేన్లు, ఎక్స్‌వేటర్లతో సహాయక ఆపరేషన్ చేపట్టామని 'నేషనల్ హై స్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్' సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో తెలిపింది.

ముడాపై అంతా నిజమే చెప్పాను

లోకాయుక్త పోలీసుల విచారణపై సీఎం సిద్దరామయ్య

మైసూరు : ముడా కేసులో లోకాయుక్త పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు తాను సమాధానమిచ్చానని, వారికి 'నిజం' చెప్పానని కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య బుధవారం తెలిపారు. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) ద్వారా తన భార్య బి.ఎం.పార్వతి 14 స్థలాల కేటాయింపులో అక్రమాలకు పాల్పడినట్లు లోకాయుక్త పోలీసులు నమోదు చేసిన కేసులో ముఖ్యమంత్రి మొదటి నిందితుడుగా ఉన్నారు. బుధవారం లోకాయుక్త పోలీసులు సిద్దరామయ్యను సుమారు రెండు గంటల పాటు ప్రశ్నించారు. అంతా చట్టబద్ధంగానే జరిగిందని, బీజేపీ, జేడీఎస్‌లు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని, లోకాయుక్త పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు తాను సమాధానమిచ్చానని, దానిని నమోదు చేశారని సీఎం చెప్పారు. లోకాయుక్త పోలీసుల ఎదుట హాజరయిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'నాపై తప్పుడు కేసు బనాయించారు. నన్ను ప్రశ్నించగా నిజమే చెప్పాను' అని అన్నారు. మరోసారి హాజరు కావాలని లోకాయుక్త పోలీసులు కోరారా అని అడిగిన ప్రశ్నకు, 'లేదు...' అని అన్నారు. కాగా, తనకు సమన్లు జారీ చేయడంతో లోకాయుక్త పోలీసుల ముందు సిద్దరామయ్య హాజరయ్యారు. లోకాయుక్త పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) టి.జె.ఉదేశ్ నేతృత్వంలోని బృందం అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ కేసులో రెండవ నిందితురాలిగా ఉన్న సీఎం సిద్దరామయ్య భార్య బి.ఎం.పార్వతిని అక్టోబరు 25న వారు ప్రశ్నించారు. ముడాకు సంబంధించిన కేసులో మరికొందరి పేర్లను మైసూరులోని లోకాయుక్త పోలీసులు సెప్టెంబరు 27న నమోదు చేశారు.

వాయు కాలుష్యంతో దిల్లీ ఉక్కిరిబిక్కిరి

ఏక్యూఐ 358గా నమోదు

న్యూదిల్లీ: దిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకూ తీవ్రమవుతోంది. దీంతో దిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఓ వైపు ఊపిరితీసుకోవడం ఇబ్బందికరంగా మారగా.. మరో వైపు నీటి కాలుష్యంతోనూ సతమతమవుతున్నారు. యమునా నదిలో కాలుష్య స్థాయి విపరీతంగా ఉంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వివరాల ప్రకారం... దేశ రాజధాని నగరంలో బుధవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో గాలి నాణ్యత సూచి 358గా నమోదైంది. అలీపూర్‌లో ఏక్యూఐ 372గా, బావన ప్రాంతంలో 412, ద్వారకా సెక్టార్ 8లో 355, ముంద్కాలో 419, నజాఫ్‌గఢ్ ప్రాంతంలో 354, న్యూ మోతి భాగ్‌లో 381, రోహిణిలో 401, పంజాబి బాగ్‌లో 388, ఆర్కేపురంలో 373గా ఏక్యూఐ నమోదైంది. ఆయా ప్రాంతాల్లో గాలి నాణ్యత అధ్వాన స్థితిలో ఉన్నట్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ పేర్కొంది. విజిబులిటీ సైతం తగ్గింది. వివిధ ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కమ్మేసింది. వివేక్ విహార్, ఆనంద్ విహార్, ఇండియా గేట్ తదితర ప్రాంతాల్లో 500 మీటర్ల వరకు దృశ్యమానత తగ్గింది. కాలుష్యంతో ప్రజల కళ్లల్లో మంటలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులుపడుతున్నారు. వైద్య నిపుణులు హెచ్చరికలు చేస్తున్నారు. గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనవసరంగా బయటకు రావొద్దని సూచిస్తున్నారు.

దిల్లీలో వాయుకాలుష్యం పెరుగుతోందని దిల్లీ ప్రభుత్వ పర్యావరణ శాఖ మంత్రి గోపాల్ రాయ్ పేర్కొన్నారు. కాలుష్యాన్ని తగ్గించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగలపెట్టడానికి తోడు... మంచు రాజధానిని కమ్మేయడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. కాలుష్య నియంత్రణకు పాలకులు ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం ఉండటం లేదు. రోజురోజుకూ గాలి నాణ్యత క్షీణిస్తోంది.

కమర్షియల్ వాహనాలు నడపొచ్చు

ఎల్‌ఎంవీ లైసెన్స్ వివాదంపై సుప్రీంకోర్టు తీర్పు

న్యూదిల్లీ: లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్(ఎల్‌ఎంవీ) వివాదంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఎల్‌ఎంవీ లైసెన్స్ ఉన్నవారు రవాణా వాహనాన్ని కూడా నడపొచ్చని, దానికి మరో లైసెన్స్ తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టంచేసింది. వ్యాపారం చేసుకొనే వ్యక్తులు, ఆటోలు, క్యాబ్‌లు నడిపేవారు ఎల్‌ఎంవీ లైసెన్స్‌తో 7,500 కిలోల కంటే తక్కువ బరువున్న వాణిజ్య వాహనాలు నడపొచ్చని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం వెల్లడించింది. 2017 ముకుంద్ దేవాంగన్ వర్సెస్ ఓరియెంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ కేసులో త్రిసభ్య ధర్మాసనం 7500 కిలోల గరిష్ఠ బరువుకు మించని రవాణా వాహనాన్ని తేలికపాటి వాహనం(ఎల్‌ఎంవీ) పరిధి నుంచి మినహాయించవద్దని తీర్పునిచ్చింది. అయితే దానికి అనుమతిస్తే ఎల్‌ఎంవీ లైసెన్స్ ఉన్న వ్యక్తి బస్సు, ట్రక్కు లేదా రోడ్ రోలర్ కూడా నడపడానికి వీలు కల్పిస్తుందని, దీనివల్ల పౌరుల జీవితాలు ప్రమాదంలో పడతాయని పేర్కొంది. నష్టపరిహారం చెల్లించడానికి బీమా కంపెనీలపై భారం పెరిగే అవకాశం ఉందని భావించిన ఇన్సూరెన్స్ కంపెనీలు త్రిసభ్య ధర్మాసనం తీర్పును సవాలు చేస్తూ సుప్రీంలో 75 పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ పిటిషన్లపై తాజాగా విచారణ చేసిన జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పునే పూర్తిగా సమర్థిస్తూ ఇన్సూరెన్స్ కంపెనీలు వేసిన పిటిషన్లు కొట్టేసింది. మోటారు వాహనాల చట్టం కింద పేర్కొన్న అదనపు శిక్షణ, అర్హత ప్రమాణాలు 7,500 కిలోల కంటే తక్కువ బరువును రవాణా చేసే వాహనాలను నడపాలనుకొనే వ్యక్తులకు వర్తిస్తాయని పేర్కొంది. అంతకంటే ఎక్కువ బరువున్న వాహనాలు ఈ పరిధిలోకి రావని స్పష్టం చేసింది. ఇది డ్రైవర్ల జీవనోపాధికి సంబంధించిన సమస్య కాబట్టి చట్టానికి సవరణలు తీసుకువచ్చి... వారికి మార్గాన్ని చూపాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఈ సవరణలు రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ (ఎంఓఆర్‌టీహెచ్) వద్ద పెండింగ్‌లో ఉన్నాయని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి న్యాయస్థానానికి తెలిపారు. సరైన సమయంలో వాటిని నోటిఫై చేస్తామన్నారు.

విశాలాంధ్ర హైదరాబాద్

టీటీడీ బోర్డు సభ్యులుగా నన్నూరి నర్సిరెడ్డి ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - హైదరాబాద్ : నన్నూరి నర్సిరెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యులుగా ప్రమాణ స్వీకారానికి ముందు వరహాస్వామిని కుటుంబ సమేతంగా దర్శనం చేసుకుని అనంతరం ధ్వజస్తంభానికి మొక్కుకుని అంతరాలయంలోకి వెళ్లి బుధవారం ఉదయం ప్రమాణ స్వీకారం చేశారు. తరువాత కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానంతరం రంగనాయక మండపంలో నన్నూరి నర్సిరెడ్డిని వేద పండితులు ఆశీర్వదించగా టిటిడి దేవస్థానం జేఈవో వెంకయ్య చౌదరి వేంకటేశ్వర స్వామి వారి చిత్రపటాన్ని నన్నూరి నర్సిరెడ్డికి బహూకరించి తీర్థప్రసాదాలు అందజేశారు. టిటిడి బోర్డు సభ్యులుగా ప్రమాణ స్వీకారం అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, పెద్దకూరపాడు ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్, చిత్తూరు మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున మిత్రులు నన్నూరి నర్సిరెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా నన్నూరి నర్సిరెడ్డి మాట్లాడుతూ టిటిడి బోర్డు సభ్యునిగా అవకాశం కల్పించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటి మంత్రి నారా లోకేష్‌కి ప్రత్యేక ధన్యవాదాలను తెలియజేశారు. తనకు సహకరించిన వారందరికీ పేరు పేరున ధన్యవాదాలు తెలియజేశారు.

రొయ్యల కృష్ణమూర్తికి శుభాకాంక్షలు తెలిపిన బీసీ నేతలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : బీసీ కులాల ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రొయ్యల కృష్ణమూర్తిని ఆయన పుట్టిన రోజు సందర్భంగా శాలువాలతో బిసి సంఘాల నాయకులు బుధవారం ఘనంగా సన్మానించి, కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు కామల్ల ఐలన్న, బీసీ కులాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు కామల్ల ఐలన్న ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జినుకుంట్ల రమేష్ గౌడ్, కోశాధికారి బత్తిని నర్సింహా గౌడ్, కార్యదర్సులు చేగూరి రామ్ మోహన్ కురుమ, పిట్టల భాస్కర్ నేత, కాసర్ల నాగరాజు, పేపర్ శ్రీనివాస్ నేత, జోగు శ్రీను కురుమ, గోపాల్ గౌడ్, గద్వాల వంశీ ముదిరాజ్, ఎమ్. బాల్ రెడ్డి, జోగు కుమారస్వామి కురుమ, బీజేపీ శ్రీను ముదిరాజ్, చెరుకు సాంబరాజ్ ముదిరాజ్, బొల్లు సంపత్ ముదిరాజ్, దండు ప్రసాద్ ముదిరాజ్, ధరబోయిన వెంకటేష్ ముదిరాజ్, కర్రె సాయి ముదిరాజ్, శివంది ఆంజనేయులు ముదిరాజ్, బండ లక్ష్మి నారాయణ కురుమ, కంపల్లి కురుమూర్తి ముదిరాజ్, దేవుడి దేవేందర్ ముదిరాజ్, దశరథ్ ముదిరాజ్, గద్వాల జంగయ్య ముదిరాజ్, సురేష్ ముదిరాజ్, దళిత నాయకులు స్వామి, దుర్గేష్, పెద్దమేతరీ లక్ష్మణ్, సురేష్ కుమార్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేను ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మల్కాజిగిరి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమం బుధవారం మల్కాజిగిరి సర్కిల్ పరిధి ప్రారంభించారు. ఈ సర్వేలో 56 ప్రశ్నలతో కూడిన ఫారంలో పూర్తి వివరాలను సేకరించడానికి ప్రత్యేకంగా ఎన్యుమరేటర్లను నియమించడం జరిగింది. ఈ సర్వేను 15 రోజుల్లో పూర్తికి జీహెచ్ఎంసీ నిర్ణయించింది. నవంబర్ నెలాఖరు వరకు సర్వేకు సంబంధించిన పూర్తి ఫలితాలను వెల్లడించేలా కసరత్తు చేస్తున్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేయడానికి మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో ఉద్యోగులతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ప్రభుత్వ టీచర్లను ఎన్యుమరేటర్లుగా నియమించారు. ఎన్యుమరేటర్లను పర్యవేక్షించడానికి సూపర్‌వైజర్‌లుగా అధికారులను సైతం నియమించారు. అయితే మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో మొత్తం ఆరు డివిజన్‌లకు గాను 1054 ఎన్యుమరేషన్ బ్లాకులు ఉన్నాయి. సర్కిల్‌లోని మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని విష్ణుపురి కాలనీలో మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి సర్వేను ప్రారంభించారు. ఈ కార్యక్రమములో భాగంగా ఉప కమిషనర్ జి.రాజు మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల మేరకు సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రజలందరూ ఇంటికి వచ్చే ఏన్యూమరేటర్లకు సహకరించాలని మల్కాజిగిరి ప్రజలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, సర్కిల్ సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఎల్లికల్లులో 400 ఏళ్ల నాటి సూక్ష్మ ఆంజనేయ విగ్రహం

పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

విశాలాంధ్ర - కల్వకుర్తి : మండల కేంద్రమైన కల్వకుర్తికి 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్లికలు గ్రామంలోని శివాలయం లో 400 ఏళ్ల నాటి అరుదైన అతి చిన్న ఆంజనేయ స్వామి విగ్రహం ఉందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా, సీఈవో, డా. ఈమని శివనాగిరెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు ఎనుముల జగదీశ్వర్ రెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు ఆయన బుధవారం గ్రామ శివారులోని శిథిల శివాలయాన్ని, అందులో ఉన్న భిన్నమైన మూడు నంది విగ్రహాలను, కప్పు రాలి పగిలిపోయిన మండపం, నిధుల వేటగాళ్ల గడ్డపారులకు బలైన గర్భాలయంను పరిశీలించారు. చుట్టూ ప్రాకారంతో ఉన్న శిథిల శివాలయాలను పదిలపరిచి, నంది శిల్పాలను కాపాడుకోవాలని శివ నాగిరెడ్డి గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్రామంలోని శివాలయం ధ్వజస్తంభం పీఠం పైన 6 అంగుళాల ఎత్తు నాలుగు అంగుళాల వెడల్పు రెండు అంగుళాల మందంగల సున్నపురాతితో చెక్కిన సూక్ష్మ ఆంజనేయ విగ్రహం, గణేష్ విగ్రహం ఉన్నాయన్నారు. విజయనగర కాలానికి చెందిన 400 ఏళ్ల నాటి చారిత్రక ప్రాధాన్యత గల ఈ అరుదైన చిన్న శిల్పాలను కాపాడుకొని, భావితరాలకు అందించాలని శివనాగిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మామిడాల ముత్యాల రెడ్డి, బడే సాయికిరణ్ రెడ్డి పాల్గొన్నారని ఆయన చెప్పారు.

కుటుంబ సర్వేపై ఎలాంటి అపోహలొద్దు

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నవంబర్ 6 నుండి 30 వరకు చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని, ఈ సర్వేపై ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ హైదరాబాద్ జిల్లా ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను బుధవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, డిప్యూటీ మేయర్‌లతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నేటి నుండి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభమైందని తెలిపారు. సర్వే నిర్వహణకు 150 కోట్ల రూపాయలు రిలీజ్ చేస్తూ జీవో విడుదల చేశామని, ప్రభుత్వం సర్వేకి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుండి 30 వ తేదీ వరకు సర్వే జరుగుతుందని, ముందుగా ఎన్యుమరేటర్ బ్లాక్‌గా గుర్తించిన మ్యాప్ ప్రకారంగా ఇళ్లను సర్వే చేసి స్టికర్ వేసి ఇంటి యజమానులకు సమగ్ర కుటుంబ సర్వే పై సమాచారం ఇచ్చి, 9వ తేదీ నుండి ఇంటింటి కుటుంబ సమగ్ర వివరాలు సేకరించడం జరుగుతుందని తెలిపారు. సర్వే పై ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఒక కోటి 17 లక్షల 44 వేల ఇండ్లు సర్వే చేయడానికి 88 వేల ఎన్యూమరేటర్లను నియమించడం జరిగిందని తెలిపారు. ఒక్కో ఎన్యూమరేటర్‌కు 150 ఇండ్లు కేటాయించారని, కుటుంబానికి సంబంధించిన అన్ని రకాల సమాచారం తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురి కావద్దని, ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ స్థితిగతులు తెలుసుకునే ప్రయత్నమే ఈ సర్వే అన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న సమాచారంతో భవిష్యత్‌లో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ సర్వేతో ఎవరికీ అన్యాయం జరగదని, ఇబ్బందులు కలగవని, ఈ సర్వే భవిష్యత్తులో అందరికీ న్యాయం జరిగే విధంగా దోహదపడుతుందన్నారు. ఈ సర్వేతో తెలంగాణ రాష్ట్రం దేశానికే దిక్సూచి కాబోతుందన్నారు. సర్వేకు ఆటంకాలు కల్పిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమానికి తెలంగాణ సమాజంలోని అన్ని వర్గాల వారు సహకరించాలని కోరారు. సమాచార సేకరణ అధికారికి పూర్తిగా సహకరించి సమగ్ర సమాచారాన్ని అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని 29,58,277 ఇండ్ల సర్వేకు 20,920 మంది ఎన్యూమరేటర్లను, 1728 మంది సూపర్ వైజర్లను నియమించినట్లు తెలిపారు. సర్వే సమయంలో ఎన్యూమరేటర్లు ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలని సూచించారు. నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నేటి నుంచి 30వ తేది వరకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జరుగుతుందన్నారు. ఎన్యుమరేటర్లు వారికి కేటాయించిన ఇంటింటికి వెళ్లి ఓపికగా సమాచారాన్ని సేకరించాలని సూచించారు. రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్, ఎన్.జి.ఓలు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు సర్వేకు సహకారం అందించాలని కోరారు. అనంతరం ఎన్యుమరేటర్లకు సర్వేకు సంబంధించిన (పెన్ను, ప్యాడ్, పెన్సిల్, షార్పనర్, సీడీ రైటర్‌తో పాటుగా ఎన్యుమరేటర్ మార్గదర్శి బుక్ లెట్) సామాగ్రి కిట్‌లను మంత్రి, మేయర్, డిప్యూటీ మేయర్, కలెక్టర్, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కమీషనర్లు ఎన్యుమరేటర్లకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, స్నేహ శబరీష్, అలివేలు మంగతాయారు, చంద్రకాంత్ రెడ్డి, జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, జోనల్ ఫైనాన్స్ అడ్వైజర్ శరత్ చంద్ర, డిప్యూటీ కమిషనర్ రజినీ కాంత్, ఎన్యుమరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు అందించేందుకే సమగ్ర కుటుంబ సర్వే

విశాలాంధ్ర - హైదరాబాద్ : పేదలకు రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా ప్రయోజనాలు కల్పించేందుకే సోషియో ఎకనామికల్ సర్వే. చేస్తున్నామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మహబూబ్ నగర్ పురపాలక పరిధిలోని ఏనుగొండలో సోషియో ఎకనామికల్ సర్వే ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల నుంచి దోచుకోవడం తప్ప ఏమి చేయలేదని, గత పది సంవత్సరాల కాలంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేకపోయిందని ఇప్పటికైనా ప్రతిపక్షాలు మొద్దునిద్ర వీడాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పేద ప్రజలకు సంపద అందించే ప్రభుత్వం అని, అందుకే అర్హులైన పేదలను గుర్తించి, వారికి చెందాల్సిన హక్కు అందించేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుంది అని ఆయన స్పష్టం చేశారు. ప్రతి పది సంవత్సరాలకు ఒక సారి ఈ కుటుంబ సర్వే నిర్వహించాలి కానీ, గత 10 సంవత్సరాల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుటుంబ సర్వే చేయకుండా విస్మరించారని ఆయన మండిపడ్డారు. బిసి కమ్యునిటీ నుంచి తమ వాట తమకు ఇవ్వాలని బలమైన డిమాండ్ వస్తుందని ఆయన తెలిపారు. అందుకే ప్రతి కుటుంబానికి చెందిన సమగ్రమైన సమాచారాన్ని సేకరించి అసలైన పేదలకు ప్రభుత్వం నుంచి ఇచ్చే సంక్షేమ పథకాలు ఇంకా సమర్థవంతంగా అందించేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. రైతును రాజు చేయడమే ఈ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. దివిటి పల్లి రైతు వేదిక వద్ద వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బిఆర్ఎస్ నాయకులు కావాలని ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తూ, రైతులను కావాలని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. రైతులకు మద్దతు ధరను కల్పిస్తున్నామని, మొట్టమొదటి సారిగా సన్నాలకు 500 రూపాయల బోనస్ ప్రభుత్వం ప్రకటించిందని, చివరి గింజ వరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తామని, కొనుగోలు చేసిన 48 గంటల లోపే రైతు అకౌంట్ లోకి డబ్బులు జమచేస్తామని స్పష్టం చేశారు. రైతులకు సేవ చేయాల్సిన సమయం వచ్చింది కాబట్టి రైతులకు అందరికీ ఒక కాల్ సెంటర్ ఏర్పాటు చేసి, రైతులందరూ మన ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దనే ధాన్యం అమ్మే విధంగా రైతులను చైతన్యం చేయాల్సిన బాధ్యత డైరెక్టర్ల మీద ఉందని ఆయన చెప్పారు. జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కౌన్సిలర్లు వనజ, ఖాజా పాషా, శాంతయ్య, తిరుమల వెంకటేష్, నాయకులు రామస్వామి కిరణ్, మంజుల వెంకటేష్ గౌడ్, పురుషోత్తం, శ్రీనివాస్ యాదవ్, మరియు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మౌలాలి గుట్టపై ర్యాంపు పనులు పూర్తి చేయాలి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మౌలాలి గుట్ట మీద దైవ దర్శనానికి వెళ్లే భక్తులు నేరుగా గుట్ట మీదికి వాహనాలు తీసుకెళ్లే విధంగా ర్యాంప్ నిర్మించేందుకు గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసింది. అయితే 2021వ సంవత్సరం జనవరి నెలలో పనులు ప్రారంభించిన వై.వి.ఆర్. ప్రాజెక్ట్స్ వారు ఈ సంవత్సరం డిసెంబర్ నాటికి పనులు పూర్తి చేయాలని నిబంధనలున్నా, ఇప్పటి వరకు కేవలం 50 శాతమే పనులు జరిగిన నేపథ్యంలో మల్కాజిగిరి వాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమావేశం ఏర్పాటు చర్చించారు. పనుల్లో సాంకేతిక పరమైన విషయాలపై చర్చించి, పనులు ఎత్తులో జరుగుతున్న కారణంగా భద్రత ప్రమాణాలు పాటించి, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. లేనట్టైతే ఈ విషయంపై శాసన సభలో మాట్లాడుతానని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జి.హెచ్.యం.సి.ప్రాజెక్ట్స్ డి.ఈ. రేణుకా, ఎ.ఈ. ప్రశాంత్.స్థానిక నాయకులు భాగ్యనంద్ రావు, ఉస్మానుద్దీన్, ఇబ్రాహీం, వంశీ ముదిరాజ్, రజా అలీ, నవాబ్ తదితరులున్నారు.

కుల గణన సర్వే ప్రారంభించిన మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి : పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో మేయర్ అమర్ సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్ పలువురు కార్పొరేటర్లు సుభాష్ నాయక్, కౌడే పోచయ్య, కుర్ర షాలిని శ్రీకాంత్ గౌడ్, పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి, భీమ్ రెడ్డి నవీన్ రెడ్డి, అనంత్ రెడ్డి, సీనియర్ నాయకులు పాశం బుచ్చి యదవ్, కమిషనర్ త్రిలేశ్వర్‌రావు ఇతర అధికారుల చేతుల మీదుగా కుల గణన సర్వేను బుధవారం ఉదయం ప్రారంభించారు. ఈ సర్వేను తెలంగాణా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ సర్వేలో భాగం కావాలని, ప్రతి కుటుంబ సభ్యులు వచ్చే అధికారులకు సహకరించాలని సూచించారు. అనంతరం ఎన్యుమరేటర్లకు, సూపర్వైజర్లకు కేటాయించిన ఏరియాలలో సర్వే చేస్తారని డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ సర్వే ద్వారా మన సమాజంలోని ప్రతి కుటుంబం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కులగణన సర్వే కీలకం అని డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ పేర్కొన్నారు.

సర్వే పూర్తయ్యేనాటికి ఖచ్చితమైన సంఖ్య రావాలి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : రాష్ట్ర ప్రభుత్వం ఏంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) పూర్తయ్యే నాటికి ఖచ్చితమైన కుటుంబాల సంఖ్య రావాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం అన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా బుధవారం కీసర మండలంలోని రాంపల్లి దాయర, గోధుమకుంట, శామీకర్ పేట్‌లోని అంతాయి పల్లిలలో నిర్వహిస్తున్న సర్వేను జిల్లా అదనపు కలెక్టరు రాధికా గుప్తాతో కలిసి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ సర్వే పూర్తయ్యేనాటికి ఖచ్చితమైన కుటుంబాల సంఖ్య రావాలని ఎంపిడిఓలకు సూచించారు. ఇక్కడ ఇళ్లు ఉండి, ఇతర జిల్లాలలో నివాసముంటున్న వారు స్వచ్ఛంధంగా ఎక్కడైన ఒక చోట మాత్రమే వారి వివరాలు నమోదు అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్యుమరేటర్లకు అవసరమైనచో అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలని నోడల్ అధికారులకు సూచించారు. సర్వేకు సంబంధించిన ప్రొఫార్మలను భద్రపరిచేందుకు అవసరమైన ఫైల్ ఫోల్డర్లను, బ్యాగులను ఎన్యుమరేటర్లకు అందించాలను సూచించారు. కలెక్టరు ఇంటింటికి అతికించిన స్టిక్కర్లను పరిశీలించి, సర్వేకు సంబంధించిన ప్రొఫార్మలను పరిశీలించి ఏ విధంగా నమోదు చేస్తున్నారని, కుటుంబ సభ్యులను ఏమేమి ప్రశ్నలు అడుగుతున్నారని, మీకు ఎన్ని ఇండ్లు కేటాయించారని సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్‌ను అడిగి తెలుసుకున్నారు. సూపర్ వైజర్లు, ఎన్యుమరేటర్లు హాజరవుతున్నారా అని ఎంపిడిఓ గ్యాం నాయక్‌ను కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. ఈ సర్వేలో ఇంటి యజమానుల వివరాలను కలెక్టరు నేరుగా అడిగి తెలుసుకొని, స్టిక్కర్ అతికించారు. ఈ పర్యటనలో జిల్లా ఎస్సీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వినోద్ కుమార్, కీసర ఎంపిడిఓ గీన్యా నాయక్, నోడల్ ఆఫీసర్ సుకీర్తి, తహసీల్దారు అశోక్ కుమార్, శామీర్‌పేట్ తహసీల్దారు యాదగిరిరెడ్డి, తూంకుంట మున్సిపల్ కమీషనర్ వెంకట గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సిబ్బంది సమయపాలనపై మేయర్ విజయలక్ష్మి బుధవారం పలు విభాగాలను ఆమె ఆకస్మికంగా తనికి చేశారు. కొంత మంది సిబ్బంది సమయానికి రాకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది సమయపాలను ప్రతి నిత్యం పర్యావేక్షించాల్సిన పరిపాలనాధికారులు సరిగా లేకపోవడంతోనే ఈ విధంగా జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అడ్మినిస్ట్రేషన్ అధికారి ఉద్యోగుల సమయపాలనపై ఏ నాడు కూడ దృష్టి సారించిన సందర్భం లేకపోవడంతోనే ఉద్యోగులు ఈ విధంగా ఇష్టానుసారంగా వస్తున్నారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. పరిపాలన అధికారిపై దృష్టి సారించాల్సిన మేయర్ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేయడంలో ఆంతర్యం ఏంటని పలువురు ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలన చేయాలని అడిషనల్ కమీషనర్ అడ్మిన్ నళిని పద్మావతిని ఆదేశించగా తాను చెపితే ఎవరు వినడం లేదని చెప్పడం గమనార్హం. హెల్త్ సెక్షన్‌లో కొందరు పని పక్కన పెట్టి సెల్ ఫోన్ చూస్తుండడంతో మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎక్కడ తనిఖీలు చేస్తున్నారు? ఎంత మంది పని చేస్తున్నారని ఇంఛార్జి అసిస్టెంట్ కమిషనర్ ముత్యం రాజును మేయర్ అడగడంతో 23 మంది మాత్రమే పని చేస్తున్నారని, కొందరికి ఇతర సర్కిళ్లకు కూడా ఇంఛార్జి బాధ్యతలు ఉన్నట్లు తెలిపారు. అనంతరం వెటర్నరీ విభాగంలో కార్యాలయానికి సిబ్బంది సకాలంలో హాజరు అవుతున్నారా అంటూ ప్రశ్నించడంతో సిబ్బంది కార్యాలయానికి త్వరగానే వస్తున్నామంటూ చెప్పడంతో మేయర్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతకు ముందు కూడా రెండు సార్లు అన్ని విభాగాల్లో ఆకస్మిక తనిఖీలు చేయడం జరిగిందని, ఆయా విభాగాల సిబ్బంది ఉదయం 10:30 వరకు రావాలని, గ్రేస్ టైం మరో 10 నిమిషాలు ఉంటుందని, 10:40 నిమిషాల వరకు ఆఫీస్‌కు రాని సిబ్బందికి ఒక మాసంలో మూడు లేట్‌లకు గాను ఒక క్యాజువల్ లీవ్ కట్ చేయడం జరుగుతుందని, క్యాజువల్ లీవ్ లేనట్టైతే ఈ.ఎల్ కట్ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి నెల నివేదిక అందజేయాలని జీహెచ్ఎంసిలోని అన్ని విభాగాలకు మేయర్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మేయర్ వెంట అడ్మిన్ అడిషనల్ కమిషనర్ నళిని పద్మావతి ఉన్నారు.

భవిష్యత్ తరాల కోసం భూగర్భ జలాలను సంరక్షించుకోవాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : భవిష్యత్ తరాల కోసం నీటి సంరక్షణపై దృష్టి సాగించాలని భూగర్భజల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జగన్నాథం తెలిపారు. బుధవారం జవహర్ నగర్ అమీర్ పెట్ -01 ప్రభుత్వ పాఠశాలలో "భవిష్యత్ తరాల కోసం భూగర్భ జలాల సంరక్షణ పై దృష్టి సారించాలని, సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల జవహర్ నగర్ ఖైరతాబాద్ మండలంలో నేషనల్ హైడ్రాలోజి ప్రాజెక్ట్ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. భూగర్భ శాఖ హైదరాబాద్ వారి సహకారముతో సీడ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమానికి అతిధులుగా విచ్చేసిన జిల్లా భూగర్భ జలశాఖ అధికారి జగన్నాథం మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టులు లేనందున, హైదరాబాద్ నగర వాసులు పడిన ప్రతి బొట్టు వర్షం నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూగర్భ జలాలుగా మార్చాల్సిన ఎవరము భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పిల్లల ద్వారా తల్లి తండ్రులకు చెప్పడమే తమ ఉద్దేశమని చెబుతూ నగరంలో ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించే దిశగా పిల్లలు ద్వారా ముందడుగు పడాలని చెప్పారు. సీడ్ స్వచ్ఛంద సంస్థ సి.ఈ.ఓ నాగబ్రహ్మ చారి మాట్లాడుతూ భూగర్భ జలాల సంరక్షణ భవిష్యత్ తరాలకు నీటి కష్టాలు ఉండకూడదంటే పిల్లలకు భూగర్భ జలాలు వినియోగించు పద్ధతులు వర్షపు నీరు వృధా ఎలా అరికట్టాలనే అంశాలపై ఎస్సె రైటింగ్, వాక్చతి పోటీ, చిత్రాలేఖనం పోటీలు నిర్వహించాలన్నారు. భూగర్భ జలశాఖ జియాలోజిస్ట్ సంధ్య, హైడ్రోజిస్ట్ వాసు, సూపెరండెంట్ అంజయ్య పాఠశాల హెడ్ మాస్టర్ శాంత రాథోడ్, పాఠశాల ఇన్స్పెక్షన్ ఆఫీసర్ శ్రవణ్, సీడ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది రవి శ్రీధర్, ఉపాధ్యాయ, ఉపాధ్యానీలు విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే ప్రారంభం

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: పట్టణ కేంద్రంలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే కార్యక్రమం ప్రారంభించిన రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించబడిన సమగ్ర కుటుంబ, ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ఫరూక్ నగర్‌లో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ చీమ వెంకన్న, మున్సిపల్ చైర్మన్ నరేందర్, స్థానిక వార్డు కౌన్సిలర్లు శ్రావణి, పిల్లి శారదల సమక్షంలో ఫరూక్ నగర్‌లోని షాది ఖానా ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రారంభ సభలో ఎమ్మెల్యే హాజరై ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ ఎంతో సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని కులగణన సమగ్ర ఇంటింటి సర్వే చేయడం గొప్ప విషయం అని కొనియాడారు. గత ఎన్నికల్లో తమ జాతీయ నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చి కులగణన సర్వేతో సామాజిక సమన్యాయం జరిగే విధంగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణ సర్కార్‌లో రేవంత్ రెడ్డి అగ్రకుల బిడ్డ అయినప్పటికీ ఎంతో సాహసోపేతంగా బీసీలకు న్యాయం జరగాలన్న దృక్పథంతో కులగణన సర్వేకు ముందుకు రావడం హర్షనీయమని అన్నారు. కులగణన సమగ్ర సర్వే జరిగితే సామాజిక రాజకీయ ఆర్థిక విద్య ఉపాధి రంగాల్లో ఎంతో న్యాయం జరుగుతుందని అన్నారు. అందుకే నేడు కాంగ్రెస్ సర్కార్ రాహుల్ గాంధీ నేతృత్వంలో సమగ్ర కులగణన జరుగుతోందని వివరించారు. అనంతరం ఫరూక్ నగర్ మండలం లింగారెడ్డి గూడ గ్రామం, కొందుర్గు, చౌదరిగుడా మండలం, కేశంపేట్ మండలాలతో పాటు పలు గ్రామాల్లో కులగణన సర్వే కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని ఇంటింటి సర్వే కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి రామారావు, కౌన్సిలర్లు కృష్ణవేణి, సర్వర్ పాషా, రాయికల్ శ్రీనివాస్, నాయకులు బాబర్ అలీ ఖాన్, చెంది తిరుపతి రెడ్డి, జమ్రుద్ ఖాన్, చెన్నయ్య, బాలరాజు గౌడ్, కృష్ణారెడ్డి, బస్వమప్ప, రఘు, అందే మోహన్, చంద్రశేఖర్, ముబారక్ అలీ ఖాన్, ఖదీర్, దిలీప్, మురళీమోహన్ అప్పి, ఇబ్రహీం, గంగాధర్, పిల్లి శేఖర్, శ్రీశైలం, మహేష్, అశోక్, సీతారాం, వివిధ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

In The Court Of The Hon'ble I st Addl Dist Judge: Kadapa

M.V.O.P.No. 241/2022

Indla Lavanya D/o Krishna, Minor, rep by her fother Indla Krishna,as natural guardion - Plaintiff

VS

Metkare Mahesh, S/o Babu Rao, Major, Hindu, Owner of the goods vehicle bearing No. TS-13-UC-6353, R/o H.No: 10-771/50, Nehru Nagar, Musab Tank, Asif Nagar Mandal, Hyderabad District, Telangana State. - Respondant No.1

Notice

ఇందుమూలముగా తెలియజేయడ మేమనగా వాదికి, పై ప్రతివాది యొక్క గూడ్సువె హికల్ ఆక్సిడెంటులో కలిగిన గాయములకు గాను, వాది పై ప్రతివాదిపైన దాఖలుచేసిన పిటిషను వాయిదా 15-11-2024వ తేదిన వున్నది. కావున పై ప్రతివాది 15-11-2024వ తేదిన ఉదయం 10-30 గంటలకు వకీలు ద్వారాగాని, లేక ఖుద్దున గానీ పై కోర్టు నందు హాజరైఆక్షేపణలు వున్నయడల తెలుపుకోవలెను. లేనియడల పరోక్షముగా తీర్మానిం చబడును.

పి. శ్రీకాంత్ రెడ్డి
అడ్వకేట్, కడప

ఉదయం ఆరు గంటలకే ప్రత్యక్షమైన ఎంపీఓ

మొయినాబాద్ పరిసరాలను శుభ్రం చేయించిన అధికారి

విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర - మొయినాబాద్ : ఉదయం ఆరు గంటలకే మొయినాబాద్ మండల కేంద్రాల్లోకి వచ్చి మండల కేంద్రంలోని పరిసరాలను మండల ఎంపీవో వెంకటేశ్వర్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తూ సిబ్బందితో శుభ్రం చేయించాడు. బుధవారం నాడు విశాలాంధ్ర దినపత్రికలో మురికి కూపంగా మొయినాబాద్ అనే కథనానికి స్పందించిన ఆయన ఉదయమే మండల కేంద్రానికి వచ్చి గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి చెత్తా చెదారాలను, రోడ్డు పక్కన ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. ఎప్పటికప్పుడు గ్రామాలు పారిశుద్ధ్య పనులు చేపడుతామని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

ఇంటింటి సర్వేను ప్రారంభించిన మంత్రి

విశాలాంధ్ర - హైదరాబాద్ : బలహీనవర్గాల వారికి మేలు జరిగేందుకు ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, వివరాల సేకరణకై ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇంటింటి కుటుంబ సర్వేను చేపట్టినదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ, రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దీళ్ళ శ్రీధర్ బాబు తెలిపారు. బుధవారం రంగారెడ్డి జిల్లా శంకరపల్లి పట్టణంలోని తొమ్మిదో వార్డులో రాష్ట్ర ఐటీ శాఖ, పరిశ్రమల శాఖ, రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దీళ్ళ శ్రీధర్ బాబు, స్థానిక శాసన సభ్యులు కాలే యాదయ్య, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిలతో కలిసి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకునే విధంగా ఒక ఆలోచన దృక్పథంతో ప్రణాళికలు సిద్ధం చేసుకుని సర్వేను ప్రారంభించిందని అన్నారు. ఈ సర్వేపై ఎలాంటి అపోహాలు పెట్టుకోవద్దని, ఎవరి రేషన్ కార్డులు తీయరని, ఇంకా వారి స్థితిగతుల వివరాలు సేకరించి అన్ని విధాల సహకారం అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో మున్సిపల్ మినహా 5344 మంది ఎన్యూమినేటర్లను నియమించడం జరిగిందని, ఒక్కో ఎన్యూమినేటర్‌కి 150 గృహాలను కేటాయించామన్నారు. ఇంటింటి సర్వేలో భాగంగా ఈ నెల 6, 7, 8, తేదీలలో మూడు రోజుల పాటు ఇంటి గుర్తింపు కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ నెల 9వ తేదీ నుండి సమగ్ర కుటుంబ వివరాల సేకరణ ప్రారంభమవుతుందని, గుర్తింపు చేసిన గృహాలకు స్టిక్కర్లు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి కుటుంబాన్ని సామాజిక, ఆర్థికంగా మెరుగుపరచడమే ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభమైందని అన్నారు. ఒక్కో ఎన్యూమినేటర్‌కి 150 గృహాలను కేటాయించామన్నారు. రానున్న మూడు రోజులు ఇంటి గుర్తింపు కార్యక్రమం చేపడతామని, గుర్తింపు చేసిన గృహాలకు స్టిక్కర్లు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఎమ్యునరేటర్ ప్రతి ఇంటికి వెళ్లి ఇంట్లో ఎంతమంది ఉంటారు, వారి ఆదాయ వివరాలు, ఎవరైనా విదేశాలలో ఉన్నారా, ప్రజా ప్రతినిధులుగా ఎవరైనా ఉన్నారా, వారి ఫోన్ నెంబర్, ఆధార్ కార్డు వివరాలు వంటి 75 ప్రశ్నలకు వివరాలు సేకరిస్తున్నారన్నారు. ప్రజలు ఆధార్ కార్డు, రేషన్ కార్డ్ వంటి పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ఇండ్ల జాబితా తయారీ సందర్భంగా ఇంటిని సందర్శించినట్లుగా స్టిక్కర్‌ను అతికించాలని తెలిపారు. శాసనసభ్యులు కాలే యాదయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, శంకర్ పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి, అడిషనల్ కలెక్టర్ ప్రతిమ సింగ్, సిపిఓ సౌమ్య, డిపిఓ సురేష్ మోహన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అసమానతల రువుమాపేందుకే కులగణన : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కొత్తూరు : సమాజంలో మనుషుల మధ్య అసమానతలను రూపుమాపి అందరికీ సమానంగా, సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్య, ఉపాధి లక్ష్యంగా కుల గణనను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం నంది గామ మండల పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు యాదవ్ ఆధ్వర్యంలో నందిగామ మండలం, రంగాపూర్ గ్రామంలో, కొత్తూరు మండల పార్టీ అధ్యక్షుడు గొంగోళ్ల హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని తీగాపూర్ గ్రామంలో నిర్వహించిన కులగనన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శంకర్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, మండల ప్రత్యేక అధికారులు, మండల ఎంపీడీవోలు, విద్యాశాఖ, ఎమ్మార్వోలు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని కులగనన చేపట్టిందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెడ్డి బిడ్డ అయినప్పటికీ సమాజంలో అన్ని కులాలకు అవకాశాలు అన్ని విధాల అందాలనే ఉద్దేశంతో రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు పెద్ద ఎత్తున కులగలనన కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. స్వాతంత్రం సిద్ధించి ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఇంకా గ్రామాల్లో కుల వివక్ష ఇతర విషయాల్లో అసమానతలు పెచ్చు మీరిపోయాయని అన్నారు. ధరణితో రైతులకు పట్టుకున్న దరిద్రాన్ని తొలగించేందుకు తిరిగి ప్రజా పాలనలో పాత పద్ధతిని తెచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని వివరించారు. కుల గణనతో అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందుతాయని ఆయన భరోసా ఇచ్చారు .రాజ్యాధికారం పోతుందని కావు కావు మంటూ కల్వకుంట్ల కుటుంబం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు లేనిపోని ఆరోపణలు చేస్తుందని, వారి మాటలు నమ్మొద్దని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకట్ రెడ్డి, ఎంపీడీవో అరుందతి, మండల ప్రత్యేక అధికారిని లీల, ఎంఈవో అంగూర్ నాయక్, పంచాయత్ కార్యదర్శి సురేందర్ ,కొత్తూరు ఉమ్మడి మండలాల మాజీ ఎంపీపీ మంచన్నల్లి శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోవర్ధన్ గౌడ్, సుదర్శన్ గౌడ్, కుమారస్వామి గౌడ్, కొమ్ము కృష్ణ, అంబటి ప్రభాకర్, విశ్వం, ముబారక్, అఫ్సర్, కావలి కృష్ణ, బిఆర్ ఎస్ కొత్తూరు మండల పార్టీ అధ్యక్షుడు మెండె కృష్ణ యాదవ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మూసీని కలుషితం చేసిన ఫార్మా మాఫియాను కూల్చండి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: మూసీని అత్యంత కలుషితమైన నదులలో ఒకటిగా మార్చిన ఫార్మా మాఫియాను కూల్చి, అనంతరం పునరావాసం కల్పించి పేదల ఇళ్ళు కూల్చాలని సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. హైదరాబాద్ శివార్లలోని ఫార్మా కంపెనీలు పరిశ్రమల వ్యర్థాలను యథేచ్ఛగా మూసి నదిలోకి వదులుతున్నా రాష్ట్ర ప్రభుత్వం వాటిని నియంత్రించే చర్యలు తీసుకోకుండా మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ ఎలా చేపడుతారని, ప్రజల జీవన ప్రమాణాలను ఎలా కాపాడుతారని అయన ప్రశ్నించారు. మూసీ బాధితులకు న్యాయం చేయాలనీ డిమాండ్ చేస్తూ వారికీ మద్దతుగా లిబర్టీ చౌరస్తాలో బుధవారం ఆమ్ ఆద్మీ పార్టీ నిర్వహించిన సామూహిక సంతకాల సేకరణ కార్యక్రమాన్ని తన సంతకం చేసి పాశం యాదగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నది కాలుష్యం నుండి ప్రజలను రక్షించడానికి ముందుగా ప్రభుత్వం చర్యలు చేపట్టి, నది ప్రక్షాళన, నీటిని మెరుగుపరచడానికి అవసరమైన చర్యలు, నది ఒడ్డున నివసించే వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం అధ్యయనం చేసి వారికీ పునరావాసం, జీవనోపాధి కల్పించి ప్రక్షాళన చేపట్టాలని అన్నారు. అనంతరం డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ మూసీ నది పునరుజ్జీవనం కోసం నదీతీర జనాభాకు హాని కలిగించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం దుర్మార్గమన్నారు. డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్), పునరావాస పాలసీ లేకుండానే ఎందుకు ప్రాజెక్టును వేగవంతం చేసి పేదల ఇళ్ల కూల్చివేతలు చేస్తున్నారని అయన ప్రశ్నించారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అమలుపై డిపిఆర్ ప్రకటనతోపాటు అఖిల పక్ష పార్టీల కమిటీ వేసి వారి సలహాలు సూచనలు తీసుకొని ముందుకు సాగాలని అలాగే నేషనల్ రివర్ కంట్రోల్ ప్లాన్, జల్ శక్తి అభియాన్ వంటి పథకాల కింద మూసీ నది శు ద్ధీకరణకు నిధుల కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ముందుగా మూసీ బాధితులకు పునరావాసం కల్పించాలని డాక్టర్ దిడ్డి సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, ఆప్ మహిళా విభాగం అధ్యక్షులు హేమ జిల్లోజు, దివ్యంగా కమిటీ చైర్మన్ దర్శనం రమేష్, అధికార ప్రతినిధి జావేద్ షరీఫ్, నేతలు సుధారాణి, సునీత తదితరులు పాల్గొన్నారు.

రిట్జ్ హోటల్, గాంధీ మెడికల్ కాలేజ్ స్థలాల అభివృద్ధికి బడ్జెట్ కేటాయించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఒకప్పుడు పేరు ప్రఖ్యాతలతో విరాజిల్లి హైదరాబాద్ నడిబొడ్డున రాష్ట్ర సెక్రటేరియట్‌కు దగ్గరలో ఉన్న రిట్జ్ హెూటల్‌ను, బషీర్‌బాగ్‌లో ఉన్న ఒకప్పటి గాంధీ మెడికల్ కాలేజ్‌ని అభివృద్ధి చేయటానికి తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు బడ్జెట్ కేటాయించి అధునాతనమైన హెూటల్స్‌ను నిర్మించాలని తెలంగాణ టూరిజం కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటీయుసి) రాష్ట్ర అధ్యక్షులు వి.యస్.బోస్ డిమాండ్ చేశారు. రిట్జ్ హెూటల్‌కు 6 ఎకరాలు, గాంధీ మెడికల్ కాలేజ్‌కి 6 ఎకరాల స్థలం నగరం నడిబొడ్డున 12 ఎకరాల ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా ఉండటం సంతోషించ దగిన విషయమన్నారు. రిట్జ్ హెూటల్ నిజాం పరిపాలనలోని 1915లో నిర్మించబడి 1929లో అప్పటి ప్రభుత్వం కొని ప్రైవేట్ యాజమాన్యానికి అద్దెకు ఇవ్వటం జరిగింది. అదే రిట్జ్ హెూటల్‌ను అద్దె ముగిసిన తర్వాత 1997లో అప్పటి టూరిజం కార్పొరేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం అప్పచెప్పటం జరిగింది. అప్పటి నుండి టూరిజం కార్పొరేషన్ హెూటల్ నడిపినప్పటికి హెూటల్ శిథిలావస్థకు చేరటం మూలంగా హెూటల్ నడపటం ఆగిపో యింది. ప్రస్తుతం సినిమా షూటింగ్‌లు మాత్రమే ఆ ప్రాంతంలో జరుగుతున్నాయి. టూరిజం కార్పొరేషన్ దగ్గర పెట్టుబడి లేకపోవటంతో క్రిందటి ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో రిట్జ్ హెూటల్ అభివృద్ధికి నోచుకోలేదని ఆయన అన్నారు. అలాగే బషీర్‌బాగ్‌లో ఉన్న గాంధీ మెడికల్ కాలేజ్, ముషీరాబాద్‌లో ఉన్న జైలు ప్రాంతంలో ఆసుపత్రితో పాటు కాలలేజ్‌ని కూడా మార్చటం మూలంగా బషీర్‌బాగ్‌లో ఉన్న 6 ఎకరాల కాలేజ్ స్థలాన్ని అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా కిరణ్ కుమార్ రెడ్డి టూరిజం కార్పొరేషన్‌కు ఇవ్వటం జరిగింది. టూరిజం కార్పొరేషన్ దాని అభివృద్ధి కొరకు ప్రయత్నం చేసినప్పటికి గత ప్రభుత్వం సహకరించకపోగా, అడ్డుపుల్లలు వేయటం మూలంగా ఏలాంటి అభివృద్ధి జరగకుండా నిలిచిపోయింది. అటు టూరిజానికి ఇటు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం రావటానికి ఉపయోగపడే రిట్జ్ హెూటల్‌ను, గాంధీ మెడికల్ కాలేజ్ స్థలంలో మరో అధునాతనమైన హెూటల్స్‌గా నిర్మించటం సరైన చర్యగా ఉంటుందని ప్రభుత్వాన్ని కోరారు. టూరిజం కార్పొరేషన్‌కు ఆదాయం పెరగటం మూలంగా అక్కడ పనిచేస్తున్న కాంట్రాక్టు మరియు ఇతర కార్మికులకు న్యాయమైన సమస్యలు పరిష్కారమవుతున్నాయని, వారి జీవితాలు బాగుపడుతాయనే నమ్మకంతో రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశారు. అతి విలువైన ఈ స్థలాలు భూకబ్జాదారుల కన్నులు పడకముందే కార్యాచరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకే సీట్లు కేటాయించాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బిసిలకే సీట్లు కేటాయించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో బిసి సంఘం అధ్యక్షులు సి.రాజేందర్, భూపేష్ సాగర్ అధ్యక్షతన జరిగిన బిసి సంఘాల కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు అర్థబలం, అంగబలం ఉన్న అగ్రకులాలకే సీట్లు కేటాయించారని, ఇదే పనిగా బిసిలకు అన్యాయం చేస్తూపోతే సహించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించడంతోపాటు బిసి ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాలని, ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ మాట్లాడుతూ కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో ఓసీలకే సీటు ఇవ్వాలని, లేనియెడల బిసి వ్యతిరేక పార్టీగా ప్రచారం చేస్తామని తెలిపారు. సమావేశంలో బిసి ఫ్రంట్ చైర్మన్ గోరిగె మల్లేశ్, రాందేవ్ మోదీ తదితర నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవార్చుకోవాలి

విశాలాంధ్ర - మొయినాబాద్ : విద్యార్థినీ, విద్యార్థులు పాఠశాల దశలోనే ప్రశ్నించే తత్వాన్ని అలవార్చుకోవాలని అలాగే పాఠశాలల్లో నిర్వహించే ప్రతి క్రీడల పోటీల్లో ధైర్యంగా పాల్గొనాలని తెలంగాణ రాష్ట్ర రిజినల్ పాస్ పోర్టు ఆఫీసర్ జొన్నలగడ్డ స్నేహజ తెలిపారు. గత మూడు రోజుల నుంచి మండల పరిధిలోని ఎన్టీఆర్ విద్య సంస్థల్లో స్పోర్ట్స్ మీట్, సంస్కృతిక పోటీలు బుధవారం సాయంత్రం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమంలో రిజినల్ పాస్ పోర్టు ఆఫీసర్ స్నేహజ ముఖ్యఅతిథిగా పాల్గొని వివిద క్రీడల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇప్పుడు క్రీడల పోటీలను చూస్తుంటే తన చిన్నతనం పాఠశాల జ్ఞాపకాలు గుర్తుకు వస్తున్నాయన్నారు. ఓడామా అన్నది కాకుండా క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. ప్రశ్నించే తత్వాన్ని అలవార్చుకోవాలని సూచించారు. డీన్ రామారావు, డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఇంటర్ ప్రిన్సిపాల్ ఎస్. రెడ్డి ఏఓ సురేష్, మట్టయ్య, వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

నాడు అక్రమం... నేడు సక్రమం ఎలా...?

> అక్రమ నిర్మాణాలకు ఊతమిస్తున్న కుత్బుల్లాపూర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు
>
> పేరుకే ప్రజావాణి... వందలకొద్దీ ఫిర్యాదులు బుట్టదాఖలు
>
> దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా పరిష్కారం కాని సమస్యలు
>
> ప్రజా సమస్యలు, ఆక్రమణలపై నోరు మెదపని అధికారులు

విశాలాంధ్ర - కుత్బుల్లాపూర్ : కుత్బుల్లాపూర్ సర్కిల్ లో అక్రమార్కులకు కొదవే లేకుండా పోయింది. సర్కిల్‌లోని అక్రమణలకు, అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్న కొందరు ముష్కరుల ముఠాకు వంత పాడుతూ టౌన్ ప్లానింగ్ అధికారులు చేస్తున్న ఆగడాలు స్థానికంగా చర్చనియాంశంగా మారాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్ 130 డివిజన్ సుభాష్ నగర్ పరిధి గంపల బస్తీలో ఓ నిర్మాణదారుడు 15-20 ఫీట్ల నాల పక్కన నిర్మాణం చేపడుతూ, దాదాపుగా 100 గజాల నాలా స్థలాన్ని ఆక్రమించుకొని ఎలాంటి సెట్ బ్యాక్‌లు, అనుమతులు లేకుండా జీహెచ్ఎంసి నిబంధనలను తుంగలో తొక్కుతూ నిర్మాణం చేపడుతున్నారు. విషయాన్ని తెలుసుకున్న కుత్బుల్లాపూర్ సర్కిల్ 25 డిప్యూటీ కమిషనర్ నరసింహ, అప్పటి ఏసిపి సాయిబాబా, టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకొని వారే దగ్గరుండి నిర్మాణాన్ని కూల్చివేతలు చేపట్టారు. తదనంతరం బిల్డింగును సీజ్ కూడా చేశారు. ఈ చర్యల అనంతరం అక్రమ నిర్మాణంపై అధికారులకు ఏం మమకారమో గాని అప్పటి అక్రమ నిర్మాణం ఇప్పుడు సక్రమంగా చక చక పనులు సాగిపోతున్నాయి. అధికారులు వేసిన సీజును అమాంతం తొలగించి, సెక్షన్ "461-ఆక్ట్, జిహెచ్ఎంసి ఆక్ట్ 1955 " నిర్వీర్యం చేస్తూ అధికారులతో లోపాయికార ఒప్పందాలను కుదుర్చుకొని చట్టాలను తుంగలో తొక్కుతూ దర్జాగా నిర్మాణదారుడు పనులను చేపడుతున్నాడు. అప్పుడు అక్రమ నిర్మాణం అని తెలిసిన వెంటనే డిప్యూటీ కమిషనర్, ఏసిపి సాయిబాబా ఇరువురు స్వయంగా సిబ్బందిని వెంటబెట్టుకుని వచ్చి నిర్మాణాన్ని కూల్చివేతలు చేపట్టి, సీజ్ చేసిన భవనాన్ని పనులు చేపడుతున్నారని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చి, డిప్యూటీ కమిషనర్‌కు సరాసరి ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా, ఆ ఫిర్యాదులను బుట్ట దాఖలు చేస్తున్నారు. అధికారులు వేసిన సీజ్‌ను తొలగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకుండా అట్టి అక్రమ నిర్మాణానికి అడ్డుకట్ట వేయకుండా అధికారులే నిర్మాణదారులకు ప్రత్యక్ష, పరోక్ష సహకారం అందించడం స్థానిక పౌరులను ముక్కున వేలేసుకునేలా చేస్తుంది. ప్రజల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమానికి ఇక్కడి అధికారులు కలంకం తీసుకొస్తున్నారు.

పలు అక్రమాలతో పాటు, 130 డివిజన్ గంపల బస్తిలో నాలాను ఆక్రమించి చేపడుతున్న నిర్మాణంపై ప్రజావాణిలో డిసిపి డిప్యూటీ కమిషనర్ నరసింహ్మకు నేరుగా పిర్యాదు అందించి దాదాపు 2 నెలలు గడుస్తున్న పట్టించుకోకుండా పక్కన పడేశారు. దీని బట్టే అర్థమవుతుంది ప్రజావాణిలో ప్రజలకు ఎటువంటి న్యాయం జరుగుతుందో అని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలపై అధికారుల సమాధానం..

డిప్యూటీ కమిషనర్ నరసింహను సీజ్ చేసి కూల్చివేతలు చేపట్టిన బిల్డింగ్‌లో మళ్ళీ పనులు ఎలా కొసాగుతున్నాయని అడగగా, అది జోనల్ కమిషనర్‌ను కలిసి అడగాలని, మేము అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇచ్చే వరకే మా పని అంటూ, ఏదైనా ఉంటే జోనల్ కమిషనర్ సమాధానం ఇస్తారని, మా చేతిలో ఏమి లేదని సమాధానమిచ్చారు.

ఏసీపీ సురేందర్ రెడ్డి వివరణ...

నాలాపై నిర్మించినట్టి అక్రమ నిర్మాణం పై ఏసిపి ని వివరణ కోరగా, ప్రైవేట్ స్థలాల్లోని అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చిన వాటిని కూల్చావద్దని, కేవలం చెరువులో కుంటలలో, సర్కారు భూములలో నిర్మించిన నిర్మాణాల్ని కూల్చమని సుప్రీంకోర్టు గైడ్లెన్స్ ఉన్నాయని, కుత్బుల్లాపూర్ సర్కిల్లో దాదాపుగా నెల 15 రోజులుగా, అక్రమ నిర్మాణాలపై ఎటువంటి డిమాల్యూషన్స్ లేవని, మరొకసారి అట్టి నిర్మాణంపై ఎస్ టిఎఫ్‌టీమ్ కి పంపుతామని అయన అన్నారు. వారు చెప్పిన విధంగానే నాలాను ఆక్రమించి నిర్మించిన ఇట్టి భవనంపై చర్యలు చేపడతారా లేక ప్రేక్షక పాత్ర వహిస్తారా వేచి చూడాలి మరి.



ప్రారంభమైన సమగ్ర కుటుంబ సర్వే

విశాలాంధ్ర - మేడిపల్లి : తెలంగాణాలో కుల గనన దేశానికీ ఆదర్శంగా నిలుస్తుందని ఏ కులం వారు ఎందరు ఉన్నారో తెలిస్తేనే రిజర్వేషన్ సక్రమంగా అమలై, మెరుగైన సేవలు అందించడానికి ఉపయోగపడుతుందని మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిదిలో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, కమీషనర్ రామలింగం, కార్పొరేటర్లు సింగిరెడ్డి పద్మా రెడ్డి, కొత్త చందర్ గౌడ్, సుమన్ నాయక్, బింగి జంగయ్య యాదవ్, చీరాల నర్సింహా, అంజలి శ్రీధర్ గౌడ్, బొమ్మక్ కళ్యాణ్, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, డి.ఈ ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర - కూకట్‌పల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ రామకృష్ణ వీధిలో గల పెద్దమ్మ తల్లి ఆలయ 21వ వార్షికోత్సవ వేడుకలు ఆలయ కమిటీ అధ్యక్షులు గుండడి రవికుమార్, కాలనీ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డీల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్థానిక ఎమ్మెల్యే, పిఏసీ చైర్మన్ అరేకపూడి గాంధీ, వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ రోజదేవి రంగారావు, సీనియర్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి అశీసులతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చంద్రకాంత్, తాండవ కృష్ణ, సుధాకర్, డాక్టర్ వంశీ, సూర్యనారాయణ, శ్రీధర్, చంగల్ రెడ్డీ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి సహకరిస్తా : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కాప్రా : ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని ప్రతి డివిజన్ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలోని బాబా నగర్‌లో 22 లక్షల నిధులతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులకు స్థానిక కార్పొరేటర్ దేవేందర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్య పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీజీఎం సతీష్, మేనేజర్ సిరాజుద్దీన్, స్థానిక కాలనీ వాసులు సుర్గం శివ, శైలేష్ రెడ్డి, యాదయ్య, శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కుంటి కృష్ణ, తిగుళ్ల శ్రీనివాస్ గౌడ్, తండా వాసుగౌడ్, సత్తి రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, దయాకర్ రెడ్డి, దశరథ్, శ్రీశైలం, ఉస్మాన్, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైబ్స్ హెల్త్‌కేర్ సెంటర్ ప్రారంభించిన సినీ నటి తేజస్వీ

విశాలాంధ్ర - కాప్రా : ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని హబ్సిగూడలో కొత్తగా ఏర్పాటు చేసిన వైబ్స్ హెల్త్కేర్ ఆవర సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ సెంటర్‌ను ప్రముఖ సినీ నటి తేజస్వీ మడివాడ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైబ్స్ హెల్త్కేర్ సెంటర్ ఎండీ లలితా జైన్ మాట్లాడుతూ చర్మ సౌందర్యం, చర్మానికి అధునాతన స్లిమ్మింగ్, బాడీ కాంటరింగ్ చికిత్సలకు తాము ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. తమ సెంటర్లో బాడీ కాంటరింగ్ చికిత్సలు పొందిన ఎంతో మంది ఎంతో ఆరోగ్యవంతమైన, నిగనిగ లాడే చర్మ సౌందర్యాన్ని పొందారన్నారు. అలాగే హెయిర్ కేర్ సేవలకు తమ సంస్థ ఎంతో ప్రసిద్ధి పొందినట్లు ఆమె చెప్పారు. జుట్టు, శరీర ఆకృతి చికిత్సలు అందిస్తూ మంచి ఫలితాలు సాధిస్తూ భారతదేశంలోనే కాదు, బంగ్లాదేశ్ అంతటా వెల్నెస్, సౌందర్య సేవలలో తమ సంస్థ ప్రజాధరణ పొంది పేరు ప్రఖ్యాతలు సాధించింద న్నారు. హబ్సిగూడ సెంటర్ ఓనర్ గీతా చౌదరీ మాట్లాడుతూ ఇప్పటికే వైబ్స్ హెల్త్కేర్ సిటీలోని పలు ప్రాంతాల్లో సెంటర్లు ప్రారంభించి వినియోగదారులకు సేవ లు అందిస్తుందన్నారు. హబ్సిగూడలో తమ ఆరవ బ్రాంచ్‌ను ప్రారంభించామన్నారు.

నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యం

విశాలాంధ్ర-దుండిగల్: భోజన ప్రియులకు నిజమైన భోజనం అందించడమే లక్ష్యమని రెస్టారెంట్స్ డైరెక్టర్ సంతోష్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో కొంపల్లి డీ మార్ట్ వద్ద ఆధునికరించిన 'పద్మరాగ రెస్టారెంట్, బాంక్వెట్‌ను ఆదర్శ ఫౌండేషన్‌కు చెందిన అనాథ పిల్లల చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం పిల్లలకు స్కూల్ బ్యాగ్స్, యూనిఫామ్స్, పుస్తకాలు, షూస్ పంపిణీ చేసి, పిల్లలకు రెస్టారెంట్‌లోని రుచికరమైన వివిధ రకాల వంటకాలను వడ్డించారు.ఈ సందర్భంగా పద్మరాగ గ్రూప్ ఆఫ్ రెస్టారెంట్స్ డైరెక్టర్ సంతోష్ రెడ్డి మాట్లాడుతూ ఈ రెస్టారెంట్ ఆహార ప్రియులను ఆకట్టుకుంటుందని, ఆదర్శ ఫౌండేషన్ చిన్నారుల చేతుల మీదుగా రెస్టారెంట్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.ఈ చర్య సమాజం పట్ల పద్మరాగకు ఉన్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. భోజన ప్రియులకు రుచికరమైన ఆహారాన్ని అందించడమే కాకుండా సామాజికంగా సానుకూల ప్రభావాన్ని చూపించడం కూడా మా లక్ష్యమన్నారు. అహ్లాదకరమైన డైనింగ్ అనుభవాన్ని అందించనున్నామని తెలిపారు. అనేక రుచులలో కూడిన మెనూ కలదని, ఈ వేదికలో ఉన్న బాంక్వెట్ హాల్లో వివాహాలు, కార్పొరేట్ ఈవెంట్లు, సామాజిక సమావేశాలు చేసుకోవచ్చన్నారు. డైరెక్టర్స్ చక్రధర్, జగదీష్, ఎంవీ రావు, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రఘురాజుపై అనర్హత వేటు రద్దు

హైకోర్టు ధర్మాసనం తీర్పు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుపై శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషెన్‌రాజు తీసుకున్న అనర్హత వేటును రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎన్నికలకు అడ్డంకులు ఏర్పడ్డాయి. అనర్హత వేటును సవాల్ చేస్తూ... రఘురాజు గతంలో హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై బుధవారం తుది తీర్పు వెలువడింది. రఘురాజుపై అనర్హతవేటు చెల్లదని హైకోర్టు తీర్పు ఇచ్చింది. 2027 నవంబరు చివరి వరకు రఘురాజు కొనసాగవచ్చని ధర్మాసనం తెలిపింది. కాగా, సార్వత్రిక ఎన్నికల సమయంలో వైసీపీ ఎమ్మెల్సీగా ఉన్న రఘురాజు... టీడీపీలోకి ఫిరాయించారు. దీనిపై శాసన మండలి చైర్మన్‌కు వైసీపీ ఎమ్మెల్సీలు ఫిర్యాదు చేయడంతో రఘురాజుపై వేటు వేసిన విషయం విదితమే.

పోలీస్ వ్యవస్థను సరిచేద్దాం

సోషల్‌మీడియాలో అనుచిత పోస్టులపై కఠినచర్యలు

మంత్రులతో సీఎం చంద్రబాబు

కడప జిల్లా ఎస్పీపై బదిలీ వేటు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: నెల రోజుల్లో పోలీసు వ్యవస్థను గాడిన పెడదామని సీఎం చంద్రబాబు మంత్రులతో అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హోంమంత్రి, పోలీస్ అధికారుల పనితీరుపై ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో మంత్రివర్గ సమావేశం అనంతరం సీఎం మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈసందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైసీపీ చేస్తున్న సోషల్ మీడియా ప్రచారంపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ సమయంలో కలగజేసుకున్న పవన్ కల్యాణ్ ప్రభుత్వాన్ని కించపరిచే పోస్టులపై ఉదాసీనత తగదని చెప్పినట్లు తెల్సింది. తాను కూడా అందుకే తీవ్రంగా స్పందించాల్సి వచ్చిందని, అసభ్య, అవాస్తవ పోస్టులపై ఫిర్యాదులు వస్తున్నా... కొందరు పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పవన్ కల్యాణ్ అన్నట్లు సమాచారం. జగన్ ప్రభుత్వంలో క్రియాశీలంగా వ్యవహరించిన కొందరు అధికారులే ఇప్పుడు కీలక పదవుల్లో ఉన్నారని కొందరు మంత్రులు తెలిపారు. కొంతమంది అధికారుల తీరువల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని మంత్రులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని జిల్లాల ఎస్పీలు మంత్రుల ఫోన్లకు సరిగా స్పందించడం లేదని, కింది స్థాయిలో డీఎస్పీ, సీఐలపై నెపం నెట్టి తప్పించుకుంటున్నారని మంత్రులు చంద్రబాబుకు తెలియజేశారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ గత ప్రభుత్వం నుంచే పోలీసులు ఇలా తయారయ్యారని, ఇకనుంచి సమస్యలపై ఎప్పటికప్పుడు మాట్లాడుకుంటూ నెల రోజుల్లో వ్యవస్థను గాడిన పెడదామని సీఎం వారికి హామీ ఇచ్చారు. మంత్రివర్గ సమావేశంలో వైసీపీ సోషల్ మీడియా పట్ల పోలీసులు ఉదాశీనంగా వ్యవహరిస్తున్నారని జరిగిన చర్చ అనంతరం కొద్దిసేపటికే కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజుపై బదిలీ వేటు పడింది. తక్షణమే హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశిస్తూ, అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌కు కడప ఎస్పీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ నేత వర్రా రవీంద్రరెడ్డిపై చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రభుత్వం హర్షవర్ధన్‌పై చర్యలకు ఉపక్రమించింది. రవీంద్రరెడ్డి చేసిన అసభ్యకర పోస్టులపై ఫిర్యాదులు వచ్చినా, తగు చర్యలు తీసుకోకపోవడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించింది. కడప జిల్లాలో మరో సీఐని కూడా ప్రభుత్వం సస్పెండ్ చేసింది. రవీంద్రరెడ్డిని అరెస్టు చేయడంలోనేగాక, అరెస్ట్ చేసిన తర్వాత వెంటనే వదిలేయడంలోనూ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని పోలీసులపై ఫిర్యాదులు వచ్చాయి. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, హోం మంత్రి అనితపై సామాజిక మాధ్యమాల్లో వైసీపీ ప్రభుత్వంలోనేగాక, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ రవీంద్రరెడ్డి అసభ్యకర పోస్టులు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఎట్టకేలకు మంగళవారం అరెస్ట్ చేయగా, 41ఏ నోటీసు ఇచ్చి వెంటనే వదిలేయడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది.

ప్రతిభగల విద్యార్థులకు రుణాలు

పీఎం-విద్యాలక్ష్మికి కేంద్ర కేబినెట్ ఆమోదం

ఎఫ్‌సీఐకు రూ.10,700 కోట్ల కేటాయింపు

న్యూఢిల్లీ: ప్రతిభగల విద్యార్థులకు కేంద్ర హామీతో రుణసాయం అందించేందుకుగాను పీఎం-విద్యాలక్ష్మి పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదించింది. అలాగే ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)లో మూలధన అవసరాలకు రూ.10,700 కోట్లను కేటాయించేందుకు అంగీకరించింది. ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన ఆర్థిక వ్యవహారాలపై కేంద్ర కేబినెట్ (సీసీఈఏ) ఈ మేరకు నిర్ణయించింది. సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేబినెట్ నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు కేంద్ర హామీతో రుణాలు అందించి, వారి ప్రగతికి ఆటంకం రాకుండా చూడాలనే ఉద్దేశంతోనే పీఎం విద్యాలక్ష్మి పథకాన్ని తెచ్చినట్లు చెప్పారు. క్వాలిటీ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ (క్యూహెచ్‌ఈఐఎస్)లలో ప్రవేశం పొందిన విద్యార్థులు ఈ రుణ సాయానికి అర్హులన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూ షనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్స్) ఆధారంగా క్యూహెచ్‌ఈఐల జాబితా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తారని వైష్ణవ్ చెప్పారు. దేశవ్యాప్తంగా 860 క్యూహెచ్‌ఈఐల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు కేంద్రం హామీతో ఏడున్నర లక్షల రూపాయల వరకు రుణం పొందవచ్చని, ఇందులో 75 శాతం వరకు బ్యాంకులకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇస్తుందన్నారు. ఈ పథకం ద్వారా 22లక్షల మందికిపైగా విద్యార్థులకు ప్రయోజనం ఉంటుందని వైష్ణవ్ తెలిపారు. రూ.8లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్నవారికి ఈ పథకం వర్తింపజేయనున్నట్లు తెలిపారు. రూ.10లక్షల వరకు రుణాలపై 3 శాతం వడ్డీ రాయితీ కల్పించనున్నారన్నారు. అయితే ప్రభుత్వ స్కాలర్‌షిప్ లబ్ధిదారులకు ఈ పథకం వర్తించదని చెప్పారు. అర్హులైన విద్యార్థులు పీఎం విద్యాలక్ష్మి వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే ఎఫ్‌సీఐలో మూలధన అవసరాలకు రూ.10,700 కోట్లు కేటాయించేందుకు కేబినెట్ అంగీకరించినట్లు అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. 'ఆహార సేకరణ వ్యవస్థలో ఎఫ్‌సీఐ ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఎఫ్‌సీఐని మరింత బలోపేతం చేయాలని కేబినెట్ నిర్ణయం జరిగింది. గత పదేళ్లలో ఆహార ధాన్యాల సేకరణ గణనీయంగా పెరిగింది. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) అనేక రెట్లు పెరిగింది. ఫలితంగా ఎఫ్‌సీఐ కార్యకలాపాలు పుంజుకున్నాయి' అని అధికారిక ప్రకటన తెలిపింది. ఎఫ్‌సీఐ స్టాక్ విలువ ఏ సంవత్సరం చివరికైనా రూ.80వేల కోట్లుగా ఉంటుందని, 2024 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో దాని విలువ రూ.98వేల కోట్లుగా ఉందని పేర్కొంది. స్టాక్ విలువ పెరగడం దృష్ట్యా ఎఫ్‌ఐసీ మూలధనాన్ని ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.10వేల కోట్ల నుంచి రూ.21వేల కోట్లకు పెంచారని అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ఎఫ్‌సీఐలో కొత్తగా రూ.10,700 కోట్ల ఈక్విటీ చేర్పింపు ద్వారా దాని పనితీరును మెరుగుపర్చే విధంగా కేంద్ర కేబినెట్ తాజా సమావేశంలో నిర్ణయించిందన్నారు. కాగా,ఎఫ్‌సీఐ ఈక్విటీ 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.4,496 కోట్లు కాగా, 2023-24లో రూ.10,157 కోట్లుగా ఉంది.

ఐదు నెలల్లోనే రూ.17 వేల కోట్ల భారమా?

తక్షణం విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి

ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: విద్యుత్ సర్దుబాటు చార్జీలు 17 వేల కోట్ల రూపాయలను చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిల డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపటాన్ని నిరసిస్తూ బుధవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో విజయవాడలో ధర్నా నిర్వహించారు. ధర్నా చౌక్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పెంచిన విద్యుత్ చార్జీలను వ్యతిరేకిస్తూ లాంతర్లతో నిరసన తెలిపారు. షర్మిల మాట్లాడుతూ సర్దుబాటు భారం వైసీపీ చేసిన పాపం అయితే... కూటమి ప్రభుత్వం పెడుతున్న శాపమని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి కేవలం 5 నెలల్లో ప్రజలకు హై ఓల్టేజ్ షాక్ ఇచ్చారని మండిపడ్డారు. విద్యుత్ చార్జీల భారాన్ని దారుణంగా మోపుతున్నారని తెలిపారు. ఇప్పటికే రూ.6 వేల కోట్ల భారం మోపగా ఇది చాలదన్నట్లు ఇంకో రూ.11 వేల కోట్లు సిద్ధం చేశారని మొత్తంగా రూ. 17 వేలకోట్లు సర్దుబాటు కింద మోపుతున్నారని చెప్పారు. ప్రజలు ఏం పాపం చేశారని ఇంత భారం మోపుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబుని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ చార్జీల పై ఎన్నో హామీలు ఇచ్చారని, వైసీపీ 9 సార్లు పెంచిందని గగ్గోలు పెట్టారని గుర్తు చేశారు. వైసీపీ రూ. 35 వేల కోట్లు భారం వేసిందని, కూటమి అధికారంలో వచ్చాకా చార్జీలు 30 శాతం తగ్గిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. జగన్ మోహన్ రెడ్డి 5 ఏళ్లలో రూ.35 వేల కోట్లు భారం మోపితే...కూటమి ప్రభుత్వం 5 నెలల పాలనలో రూ.17 వేల కోట్లు భారం మోపుతుందా ? అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగితే చర్యలు తీసుకోవాలన్నారు. హిందూజా లాంటి కంపెనీకి రూ.12 వందల కోట్లు ఎందుకు ఇచ్చారో తేల్చాలని డిమాండ్ చేశారు. బీజేపీకి గత 10 ఏళ్లుగా ఊడిగం చేస్తున్న చంద్రబాబు... కేంద్రం నుంచి నిధులు తేవాలన్నారు. ఇప్పటికే సూపర్ సిక్స్ అమలులో విఫలం అయ్యారని, సంక్షేమ పథకాలు అని చెప్పి... ఒక చేత్తో ఇస్తూ మరో చేత్తో వసూలు చేస్తున్నారని చెప్పారు. సర్దుబాటు భారం వైసీపీదేనని గుర్తించి ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, రాష్ట్ర మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్.మస్తాన్ వలి, విజయవాడ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహా రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రమజీవుల హక్కుల కోసం

ఎలుగెత్తే గొంతుకే 'ఎరుపు'

విశాలాంధ్ర-విజయవాడ: ప్రజల్ని జాగృతపరిచే సాహిత్యం రావాలని... శ్రమజీవుల హక్కుల కోసం ఎలుగెత్తే గొంతుకే ఎరుపు గ్రంథమని ఏపీటీఎఫ్ మాజీ కార్యదర్శి పాండురంగ వర ప్రసాద్ అన్నారు. బుధవారం 'ఆలోచన' నిర్వహణలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్‌లో ప్రముఖ కవి సింగంపల్లి అశోక్ కుమార్ రచించిన 'ఎరుపు' గ్రంథావిష్కరణ సభ జరిగింది. గ్రంథావిష్కర్త, ముఖ్యఅతిథిగా హాజరైన పాండురంగ వర ప్రసాద్ మాట్లాడుతూ...సాంకేతికత అభివృద్ధి చెందడంతో పుస్తకాలు చదివే పాఠకులు తగ్గిపోయారని... వారికి పుస్తకాలకున్న ప్రాధాన్యతను వివరించి...మరలా పుస్తక పఠనంవైపు దృష్టి సారించేలా చేయాల్సిన బాధ్యత కవులపై ఉందన్నారు. విశిష్ట సాహితీ అతిథిగా హాజరైన అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం (అరసం) అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ... అక్రమాలపై ఎక్కుపెట్టిన అస్త్రం ఎరుపు గ్రంథం అన్నారు. పాఠకులను ఆలోచింపచేసే రచనలు రావాల్సిన అవసరం చాలా ఉందన్నారు. విప్లవ రచయితల సంఘం (విరసం) అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి సాహిత్యం తోడ్పడాలన్నారు. జనసాహితి అధ్యక్షుడు దివికుమార్ మాట్లాడుతూ దోపిడీ వ్యవస్థ మారాలన్నారు. సాహితీ స్రవంతి ఉపాధ్యక్షుడు సత్యాజీ మాట్లాడుతూ అశోక్ కుమార్ తన రచనల ద్వారా మంచి మార్పుని కాంక్షిస్తున్నారని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ఎక్స్ రే అధ్యక్షుడు కొల్లూరి ప్రసంగిస్తూ సాహితీ విలువలతో కూడిన అభ్యుదయ సాహిత్యం ప్రజల మనస్సులో చిరకాలం ఉంటుందన్నారు. గ్రంథ రచయిత, శ్రీశ్రీ సాహిత్యనిధి కన్వీనర్ సింగంపల్లి అశోక్ కుమార్ మాట్లాడుతూ... తన రచనల ద్వారా ఒక్కరు మారినా తన ఆశయం నెరవేరినట్లే అన్నారు. చివరగా అశోక్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ సత్కారం చేశారు. తొలుత ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గాయకులు చంద్రనాయక్ అభ్యుదయ గీతాలు ఆలపించగా, ఎక్స్ రే ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు, కవులు, రచయితలు పాల్గొన్నారు.

అల్లు అర్జున్‌కు ఊరట

కేసు కొట్టివేసిన హైకోర్టు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సినీ హీరో అల్లు అర్జున్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఎన్నికల సమయంలో నంద్యాలలో తనపై దాఖలైన కేసు కొట్టేయాలంటూ హైకోర్టులో అల్లు అర్జున్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని బుధవారం విచారించిన హైకోర్టు ఆయన అభ్యర్థన మేరకు క్వాష్ చేస్తూ నిర్ణయం వెలువరించింది. 2024 ఎన్నికల సమయంలో అల్లు అర్జున్ నంద్యాలలో వైసీపీ అభ్యర్థి శిల్పా రవి నివాసానికి వెళ్లారు. అక్కడ భారీ సంఖ్యలో అభిమానులు తరలి వచ్చారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో అల్లు అర్జున్ నిబంధనలు ఉల్లంఘించారని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు కొట్టేయాలంటూ అర్జున్, మాజీ ఎమ్మెల్యే రవిచంద్రకిశోర్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ గతనెల 25న విచారణకు రాగా, ధర్మాసనం స్పందిస్తూ.. ఎఫ్ఐఆర్ ఆధారంగా నవంబరు 6 వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. తాజా విచారణ క్రమంలో కేసును కొట్టివేస్తూ ఆదేశాలు ఇచ్చింది.

విదేశీ పర్యటనకు అనుమతివ్వండి: విజయసాయి రెడ్డి

విదేశీ పర్యటనకు అనుమతి కోరుతూ ఎంపీ విజయసాయి రెడ్డి హైదరాబాద్‌లోని నాంపల్లి సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈనెల 15 నుంచి 30వ తేదీ వరకు అమెరికా, ఫ్రాన్స్ పర్యటనకు అనుమతి కోరారు. ఈ పిటిషన్‌పై సీబీఐ అభ్యంతరం వ్యక్తం చేసింది. విజయసాయిరెడ్డికి అనుమతి ఇవ్వొద్దని కోర్టుకు విన్నవించింది. విచారణ కోర్టు గతంలో విదేశీ పర్యటనకు అనుమతిచ్చిందని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. వాదనల అనంతరం తీర్పును ఈనెల8 వరకు కోర్టు రిజర్వ్ చేసింది.

నందిగం సురేశ్‌కు బెయిల్ నిరాకరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. మరియమ్మ అనే మహిళ హత్య కేసులో ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ కేసులో బెయిల్ మంజూరు చేయాలని గుంటూరు కోర్టును సురేశ్ ఆశ్రయించగా... తోసిపుచ్చడంతో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారించిన హైకోర్టు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. తుళ్లూరు మండలం వెలగపూడిలో 2020 డిసెంబరులో రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో రాళ్లు రువ్వుకున్న సంఘటనలో వెలగపూడికి చెందిన మరియమ్మ మృతి చెందింది. ఈ కేసులో వచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో నందిగం సురేశ్‌పై కేసు నమోదు చేశారు. సురేశ్‌ను 78వ నిందితుడిగా పోలీసులు చేర్చారు.

'సర్వేపల్లి రాధాకృష్ణన్' పథకానికి రూ.953 కోట్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర (ఎస్ఆర్‌కేవీఎం) పథకానికి రూ.953.71 కోట్లు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా ఆమోదం తెలిపింది. ఇందులో కేంద్ర వాటా రూ.175.03 కోట్లు, రాష్ట్ర వాటా రూ.778.68 కోట్లుగా కేటాయించారు. ఈ మేరకు పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్ బుధవారం ఉత్తర్వులు జారీజేశారు. 2025-26 విద్యా సంవత్సరానికిగాను ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కిట్లు అందజేస్తారు. నోట్‌బుక్‌లు, బెల్ట్, షూస్, బ్యాగ్, పిక్టోరియల్ డిక్షనరీ, ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు, పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్‌లు, మూడు జతల ఏకరూప దుస్తులు పంపిణీ చేస్తారు. ఒకటో తరగతి నుంచి 10 చదువుతున్న విద్యార్థులకు అందజేస్తారు.

ఆర్టికల్ 370 పునరుద్ధరించాల్సిందే

జమ్మూకశ్మీర్ అసెంబ్లీ తీర్మానం

తీవ్రంగా వ్యతిరేకించిన బీజేపీ

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో సంచలన పరిణామం చోటు చేసుకుంది. ఆర్టికల్ 370ని పునరుద్ధరిం చేందుకు సంప్రదింపులు ప్రారంభించాలని కోరుతూ జమ్మూకశ్మీర్ అసెంబ్లీ తీర్మానం చేసింది. బీజేపీ ఎమ్మెల్యేలు ఈ తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. తీర్మానం ప్రతులను చించివేసి, వెల్‌లోకి విసిరేశారు. అయితే తీవ్ర గందరగోళ పరిస్థితుల నడుమ స్పీకర్ అబ్దుల్ రహీమ్ ఈ తీర్మానంపై ఓటింగ్ నిర్వహించి ఆమోదం పొందినట్లు ప్రకటించారు. అనంతరం తీవ్ర ఉద్రిక్తత మధ్య సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సభ వాయిదా పడిన అనంతరం మీడియాతో మాట్లాడిన అధికార, ప్రతిపక్ష సభ్యులు ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో దుమ్మెత్తిపోసుకున్నారు. జమ్మూకశ్మీర్ ఉప ముఖ్యమంత్రి సురీందర్ చౌదరి.. అసెంబ్లీలో బుధవారం ఉదయం ఈ తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టారు. జమ్మూకశ్మీర్ ప్రజల గుర్తింపు, సంస్కృతి, హక్కులను పరిరక్షించడంలో ఆర్టికల్ 370 రక్షణగా నిలుస్తోందని తీర్మానాన్ని ప్రవేశపెడుతూ ఆయన అన్నారు. అనంతరం తీవ్ర గందర గోళ పరిస్థితుల్లో ఆర్టికల్ 370 పునరుద్ధరణకు సంబంధించి ఎన్నికైన ప్రతినిధులతో చర్చలు ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ జమ్మూకశ్మీర్ అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించింది. ప్రతిపక్ష నాయకుడు సునీల్ శర్మ సహా బీజేపీ సభ్యులు తీర్మానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ముందుగా ప్రకటించిన అంశాల్లో ఈ తీర్మానాన్ని చేర్చలేదని వాదించారు. దేశంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేవాలయం (పార్లమెంట్) ఈ చట్టాన్ని ఆమోదించిందని సునీల్ శర్మ తెలిపారు.

బయటి వ్యక్తులు ఆస్తులు కొంటున్నారు...

'బయటి నుంచి వచ్చిన వ్యక్తులు జమ్మూకశ్మీర్‌లో ఆస్తులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో కశ్మీర్ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆర్టికల్ 370 రద్దు కారణంగా ఇక్కడి ప్రజలు నష్టపోతున్నారు, ఇబ్బందులు పడుతున్నారు' అని డిప్యూటీ సీఎం సురీందర్ సింగ్ చౌదరి అన్నారు. సభ వాయిదా పడిన అనంతరం ఏఎన్ఐ ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ బీజేపీపై విరుచుకుపడ్డారు.

'2019లో మా నుంచి లాక్కున్న ప్రత్యేక హోదా గురించి మాత్రమే మేం మాట్లాడాం. ఒకవేళ బీజేపీ సభ్యులకు నార్కో టెస్ట్ చేస్తే, వారు కూడా అదే కోరుకుంటున్నారని రుజువవుతుంది' అని అన్నారు. 'కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీహార్‌కు ప్రత్యేక హోదా హామీ ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ కూడా ప్రత్యేక హామీలు, గ్రాంట్ ఇచ్చింది. వారు (బీజేపీ) రాముడి పేరు (అసెంబ్లీలో) తీసుకున్నప్పుడు, ప్రతి ఒక్కరికీ వారి హక్కులు ఉండాలని, జమ్మూకశ్మీర్ ప్రత్యేక హోదా పొందాలని మేము వారికి చెప్పాలనుకుంటున్నాం' అని కశ్మీర్ డిప్యూటీ సీఎం అన్నారు. వారి పాలనా కాలంలో రాజౌరి, చీనాబ్, కథువా, సాంబా లోయలో ఉగ్రవాదం లేకుండా పోయిందా అని ఆయన ప్రశ్నించారు.

ఆర్టికల్ 370 జమ్మూ కశ్మీర్‌కు కొన్ని ప్రత్యేక అధికారాలను కల్పిస్తోంది. నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 2019 ఆగస్టు 5న ఆర్టికల్ 370ని రద్దు చేసింది. పార్లమెంట్ ఆమోదం ద్వారా ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. దీంతో జమ్మూ కశ్మీర్‌కు కొన్ని దశాబ్దాలుగా ఉన్న ప్రత్యేక అధికారాలు రద్దయ్యాయి. అనంతరం అక్కడ రాష్ట్రపతి పాలన విధించారు. పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ ఏడాది సెప్టెంబర్‌లో జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలోని జేకేఎన్‌సి అక్టోబర్ 16న ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత చోటు చేసుకున్న తాజా పరిణామం ఇది.

ప్రతినిధుల సభలో ఇండో-అమెరికన్లు

ఆరుగురి ఎన్నిక - చరిత్ర సృష్టించిన సుహాస్ సుబ్రమణ్యం

వాషింగ్టన్: అమెరికా రాజకీయాల్లో భారత సంతతి నేతలు అంచెలంచెలుగా ఎదుగుతున్నారు. అమెరికా ప్రతినిధుల సభకు ఆరుగురు ఎన్నికయ్యారు. వారిలో సుహాస్ సుబ్రమణ్యం, అమీ బేరా, రాజా కృష్ణమూర్తి, రో ఖన్నా, ప్రమీలా జైపాల్, శ్రీ థానేదార్ ఉన్నారు. వీరంతా డెమొక్రటిక్ పార్టీ తరపున పోటీ చేసి గెలుపొందారు.

సుహాస్ సుబ్రమణ్యం

ఈస్ట్ కోస్ట్, వర్జీనియా నుంచి ఎన్నికైన మొదటి భారత సంతతి నేతగా సుహాస్ సుబ్రమణ్యం (38) చరిత్ర సృష్టించారు. వర్జీనియా 10వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి డెమొక్రటిక్ పార్టీ తరపున ఎన్నికయ్యారు. రిపబ్లికన్ అభ్యర్థి మైక్ క్లాన్సీపై ఆయన గెలుపొందారు. సుహాస్‌కు 2,07,131 ఓట్లు రాగా ప్రత్యర్థి క్లాన్సీకి 1,90,227 ఓట్లు పోలయ్యాయి. ఐదుగురు భారత సంతతి నేతలు అమీ బేరా, రాజా కృష్ణమూర్తి, రో ఖన్నా, ప్రమీలా జైపాల్, శ్రీ థానేదార్‌తో కూడిన 'సమోసా కౌకస్ ఇన్ కాంగ్రెస్'లో సుహాస్ స్థానం దక్కించుకున్నారు.

రాజా కృష్ణమూర్తి

రాజా కృష్ణమూర్తి(51) ఇల్లినాయిస్ 8వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి డెమొక్రటిక్ పార్టీ తరపున ప్రతినిధుల సభకు ఎన్నికయ్యారు. రిపబ్లికన్ పార్టీకి చెందిన తన ప్రత్యర్థి మార్క్ రైస్‌పై విజయం సాధించారు. రైస్‌కు 1,27,136 ఓట్లు రాగా... కృష్ణమూర్తి 1,63,721 ఓట్లు పొందారు. వృత్తిరీత్యా న్యాయవాదైన కృష్ణమూర్తి 2016లో అమెరికా కాంగ్రెస్‌కు తొలిసారి ఎన్నికయ్యారు.

శ్రీ థానేదార్

మిచిగాన్ 13వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి శ్రీ థానేదార్ (69) రెండవ సారి ఎన్నికయ్యారు. రిపబ్లికన్ పార్టీకి చెందిన ప్రత్యర్థి మార్టెల్ బివింగ్స్‌పై గెలుపొందారు. థానేదార్‌కు 80,462 ఓట్లు రాగా, బివింగ్స్ 39,385 ఓట్లు పొందారు. 2022లో మిచిగన్ ప్రతినిధుల సభకు శ్రీథానేదార్ ఎన్నికయ్యారు. 2017 నుంచి ఇల్లినాయిస్ 7వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ ప్రతినిధిగా ఉన్నారు.

రో ఖన్నా

కాలిఫోర్నియా 17వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి రో ఖన్నా... రిపబ్లికన్ అభ్యర్థి అనితా చెన్‌పై గెలుపొందారు. ఖన్నాకు 80,112 ఓట్లు రాగా, అనిత చెన్‌కు 36,837 ఓట్లు పోలయ్యాయి. రో ఖన్నా ప్రస్తుతం ఇదే స్థానానికి మూడవ సారి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

ప్రమీలా జైపాల్

డెమొక్రాట్ పార్టీ సీనియర్ నేత, భారత సంతతికి చెందిన ప్రమీలా జైపాల్ (59) విజేతగా నిలిచారు. వాషింగ్టన్ 7వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ రేసులో నిలిచిన ఆమె ప్రత్యర్థి డాన్ అలెగ్జాండర్‌పై ఘన విజయం సాధించారు. అలెగ్జాండర్‌కు 42,959 ఓట్లు రాగా ప్రమీలా జైపాల్ 2,44,150 ఓట్లు పొందారు. ఆమె మొదటిసారి 2016లో ఎన్నికయ్యారు.

డాక్టర్ బీరా

డాక్టర్ అమీ బీరా (59) కాలిఫోర్నియా 7వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి కాంగ్రెస్‌కు ఎన్నికయ్యారు. ప్రత్యర్థి క్రిస్టిన్ బిష్‌పై విజయం సాధించారు. క్రిస్టిన్‌కు 1,28,606 ఓట్లు రాగా డాక్టర్ బీరా 1,32,712 ఓట్లతో గెలుపొందారు. 2013 నుంచి కాలిఫోర్నియా 6వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ ప్రతినిధిగా ఉన్నారు.

ఆశలు అనంతలోకానికి...

అనారోగ్యంతో ఇద్దరు విద్యార్థుల మృతి

విశాలాంధ్ర-పార్వతీపురం/ జియ్యమ్మవలస: ఎన్నో ఉన్నతాశయాలతో పాఠశాలకు వెళ్లిన ఇద్దరు గిరిజన విద్యార్థులు అనారోగ్యంతో మృతిచెందారు. చదువులతల్లి ఒడిలో విగత జీవిగా మారడాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ ఘటన పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం రావాడరామభద్రపురం, కురుపాం జీఎంవలస గ్రామాల్లో చోటుచేసుకుంది. వివరాలివి... రావాడరామ భద్రపురం గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో నిమ్మక జీవన్ కుమార్ (12) ఏడవ తరగతి చదువుతున్నాడు. బుధవారం వేకువజామున తనకు విపరీతంగా తలనొప్పిగా ఉందని సహచర విద్యార్థులతో చెప్పాడు. విషయం తెలుసుకున్న వెంటనే డిప్యూటీ వార్డెన్ ఎల్.గణపతిరావు, కార్యాలయ సబార్డినేట్ వెంకటేశ్, వంట మనిషి రాజు హుటాహుటిన అక్కడకు చేరుకుని పీహెచ్‌సీ కేంద్రానికి తరలించారు. అప్పటికే చనిపోయినట్టు వైద్యాధికారి సీహెచ్ శంకరరావు నిర్ధారించారు. ఈ విషయాన్ని మృతుడి తల్లిదండ్రులకు ప్రధానోపాధ్యాయుడు ఎస్.తిరుపతి తెలియజేశారు. విద్యాబుద్ధులు నేర్పించాలన్న కొండంత ఆశతో ఆశ్రమపాఠశాలలో చేరిస్తే... అందనంత లోకానికి చేరిపోయావా నాయనా అంటూ తల్లిదండ్రుల రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. విగతజీవిగా మారిన కుమారుడిని చూసి బోరున విలపించారు. విద్యార్థి స్వగ్రామం గుమ్మలక్ష్మీపురం మండలం వనకాబడి పంచాయతీ వండడి గ్రామం. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. కురుపాం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న నిమ్మక నితిన్(9) అనే విద్యార్థి అనారోగ్యంతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విశాఖపట్నం కేజీహెచ్ లో చికిత్స పొందుతూ మంగళవారంరాత్రి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇదిలా ఉండగా... ఈ ఏడాది మన్యం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో ఏడు వరకు మరణాలు జరగడం ఆందోళన కలిగించే అంశం. పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకొని ఆశ్రమం పాఠశాలలో చేరుస్తున్న తల్లి దండ్రులు... అనారోగ్య కారణాలతో బిడ్డలు మృతి చెందడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని వామపక్ష సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఐ మన్యం జిల్లా కార్యదర్శి కోరంగి మన్మధరావు డిమాండ్ చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.